శుక్రవారం
31-10-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 10, సంచిక : 39
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Hyderabad,Vijayawada, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మల్టీకలర్ ప్రింటింగ్
ఇప్పుడు మన విశాలాంధ్ర లో
మ్యాగజైన్స్
లామినేషన్
గమ్ బైండింగ్
బుక్ వర్క్స్
మరియు
పోస్టర్లు
పాంప్లేట్స్
ప్రింట్ చేయబడును
సంప్రదించండి: 94405 73343

రూటు మార్చారని బీమా ఆపరాదు

న్యూఢిల్లీ: పరిహారం చెల్లింపు విషయంలో బీమా కంపెనీలకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. రూట్ పర్మిట్ ఉల్లంఘన వంటి సాంకేతిక కారణాలు చెప్పి బాధితుడికి పరిహారం నిరాకరించడం సరికాదని పేర్కొంది. ఓ ప్రమాదంలో బాధితుడి తప్పిదం లేదని, అలాంటప్పుడు అతడికి పరిహారం చెల్లించాల్సిందేనని స్పష్టం చేసింది. అంతేకాకుండా సంబంధిత పరిహారాన్ని వాహన యజమాని నుంచి రికవరీ చేసుకోవచ్చని గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు సమర్థనీయమని పేర్కొంది. కర్నాటకలో అక్టోబర్ 7, 2014లో వేగంగా వచ్చిన ఓ బస్సు బైక్‌ను

- మిగతా 2 లో

ఏపీ కేబినెట్ 10కి వాయిదా

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: నవంబరు 7వ తేదీన జరగాల్సిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం వాయిదా పడింది. తిరిగి ఈ సమావేశాన్ని నవంబరు 10వ తేదీన నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి విజయానంద్ నోట్ విడుదల చేశారు. మంత్రివర్గ సమావేశం నిర్వహణకు సంబంధించిన మార్పులు గమనించాల్సిందిగా అన్ని శాఖల కార్యదర్శులకు సూచనలు చేశారు. రాష్ట్రంలో కొనసాగుతున్న మొంథా

- మిగతా 2 లో

బతికుండగానే మార్చురీకి...

మహబూబాబాద్: అనారోగ్యంతో ఆసుపత్రికి వచ్చిన ఓ రోగిని ఆధార్ కార్డు లేదనే నెపంతో సిబ్బంది చేర్చుకోకపోలేదు. అతడి ఆరోగ్య పరిస్థితిని పట్టించుకోలేదు. చికిత్స చేయడానికి ముందుకు రాలేదు. రోగి ఆసుపత్రి ఆవరణలోనే రెండు రోజులు పడిగాపులుకాసినా కనికరం చూపలేదు. చివరకు అతను ఉలుకు పలుకు లేకుండా ఉండటంతో, ఏం జరిగిందో చూడకుండానే మృతి చెందాడనే అనుమానంతో మార్చురీకి పంపించారు. ఉదయం మార్చురీ గదిని శుభ్రం చేయడానికి వచ్చిన స్వీపర్లు రోగి కదలికలను గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడికి చేరుకున్న పోలీసులు అతడికి చికిత్స చేయిస్తున్నారు. రోగిని

- మిగతా 2 లో

ఇదీ లోకం!

బాధితులను ఆదుకుంటాం

ప్రాణ నష్టం నివారించండి
ముంపు గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించండి

- అందుబాటులో అత్యవసర వైద్యసేవలు
- ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొట్టుకుపోవటం బాధాకరం
- నష్టం అంచనాలు సిద్ధం చేసి నివేదిక ఇవ్వండి
- అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి
- వ్యాన్... డ్రైవర్ వాగులో కొట్టుకుపోవటం దురదృష్టకరం
- వరదలో చిక్కుకున్న కుటుంబాలకు ఆహారం, మంచినీరు
- తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లకు సీఎం రేవంత్ ఆదేశం

విశాలాంధ్ర - హైదరాబాద్: తుపాను బాధితులను ఆదుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. భారీవర్షాలు కురుస్తున్న జిల్లాల్లో యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడా ప్రాణనష్టం జరగకుండా చూడాలని, పశువులకు ఆపద రాకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వరద ముప్పు ఉన్న ప్రాంతాల ప్రజలను, ముంపు గ్రామాలు... కాలనీల్లో ఉంటున్న వారిని వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, అవసరమైన చోట పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి తగిన సహాయం అందించాలని ఆదేశించారు. తుపాను వల్ల ప్రధానంగా వరి, పత్తి పంటకు తీవ్రనష్టం వాటిల్లిందని మంత్రులు, కలెక్టర్లు ముఖ్యమంత్రికి ఈ సందర్భంగా వివరించారు. ఉమ్మడి వరంగల్, నల్లగొండ జిల్లాలతో పాటు, హుస్నాబాద్ నియోజకవర్గంలో వరద నష్టం ఎక్కువగా ఉందని అంచనాకు వచ్చారు. అన్ని చోట్ల వరి కోతలు మొదలయ్యాయని, అనుకోని ఉపద్రవం రైతులకు ఆవేదన మిగులుస్తుందని సీఎం అన్నారు. 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, అందుకు తగినట్లుగా పౌరసరఫరాల విభాగం చర్యలు చేపట్టాలని అన్నారు. వర్షంతో చాలా చోట్ల ధాన్యం తడిచిపోయిందని, ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొట్టుకుపోవటం... రైతులు నష్టపోవటం... ఆందోళన కలిగించిందని అన్నారు. కల్లాలు, ఐకేపీ కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని గోదాములు, మిల్లులకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. మిల్లుల, గోదాములు అందుబాటులో లేని చోట దగ్గరలో ఉన్న ఫంక్షన్ హాళ్లలో నిల్వ చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి ఇంచార్జి అధికారిని నియమించాలని సూచించారు. ప్రతీ కేంద్రం నుంచి నిత్యం నివేదిక తెప్పించుకోవాలని, నిర్లక్ష్యం వహించే అధికారులపై తక్షణం చర్యలు తీసుకోవాలని అన్నారు. సెలవులు రద్దు చేసి అందరూ క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్లను ఆదేశించారు. ధాన్యం తడవకుండా తగినన్ని టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, విధానపరమైన నిర్ణయాలు వెంటనే సివిల్ సప్లయిస్ కమిషనర్, సీఎస్ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. వ్యవసాయ, రెవెన్యూ విభాగాల అధికారులు సంయుక్తంగా సర్వేలు చేసి నష్టం అంచనాలు తయారు చేసి నివేదికలు అందజేయాలన్నారు. సహాయక చర్యలు, రోడ్లు, రహదారుల పునరుద్ధరణ పనులు, ధాన్యం కొనుగోళ్లను ఎప్పటికప్పుడు జిల్లా ఇంచార్జి మంత్రులు సమీక్షించాలని సీఎం కోరారు. ఇప్పటికే రాష్ట్రంలో 16 జిల్లాలపై తుపాను ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించిందంటూ అధికారులను అప్రమత్తం చేశారు. విద్యుత్ అంతరాయం లేకుండా

- మిగతా 2 లో

నేడు సీఎం ఏరియల్ సర్వే

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం ఉదయం వరంగల్, హుస్నాబాద్ వరద ప్రాంతాల్లో ఏరియల్ సర్వే చేపట్టనున్నారు. భారీ వర్షాలతో దెబ్బతిన్న ప్రాంతాలు, పంట నష్టం వాటిల్లిన ప్రాంతాలను పరిశీలిస్తారు. గురువారం ఉదయమే ఏరియల్ సర్వే చేయాల్సి ఉండగా... వాతావరణం అనుకూలించకపోవటంతో హెలికాప్టర్ ప్రయాణం వీలు కాదని అధికారులు అనుమతించలేదు.

మోదీ సర్కారును కూల్చే కుట్ర

దిల్లీ అల్లర్ల కేసులో పోలీసుల అఫిడవిట్

న్యూఢిల్లీ: దేశ రాజధాని దిల్లీలో 2020 నాటి మత అల్లర్ల కేసుకు సంబంధించి దిల్లీ పోలీసులు సుప్రీంకోర్టులో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేశారు. ఈ అల్లర్ల కుట్ర కేసులో నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉమర్ ఖాలిద్, షార్జీల్ ఇమామ్, మీరాన్ హైదర్, గుల్ఫిషా ఫాతిమా ఇతరుల బెయిల్ పిటిషన్‌ను తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ హింసాకాండ ప్రణాళికాబద్ధంగా జరిగిందని, ప్రభుత్వాన్ని మార్చేందుకు జరిగిన కుట్రలో భాగమని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అల్లర్లు ఆకస్మికంగా జరగలేదని, దేశంలో శాంతికి

- మిగతా 2 లో

ఎస్డీఆర్ఎఫ్ నిధులు వినియోగించండి

ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తతతో ప్రాణ, ఆస్తి నష్ట నివారణ: భట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్: తుపాను ప్రభావిత జిల్లాల్లో సహాయ, పునరావాస చర్యల్లో భాగంగా ఎస్డీఆర్ఎఫ్, టీఆర్ నిధులు వినియోగం చేసుకోవాలని, నిధులకు ఎలాంటి ఇబ్బంది లేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ... కలెక్టర్లకు సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... యావత్ క్యాబినెట్ సూచనలకు అనుగుణంగా ప్రభుత్వ యంత్రాంగం స్పందించడంతో ప్రాణ, భారీ ఆస్తి నష్టం నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోగలిగామని చెప్పారు. 24 గంటల్లో సహాయ, పునరావాస చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ లోని కృష్ణాజిల్లా నుంచి నల్లగొండ, ఖమ్మం జిల్లా మీదుగా మొంథా తుపాను పయనించడంతో ఉత్తర తెలంగాణలో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయని భట్టి వివరించారు. అధికారులు అప్రమత్తతతో పత్తి పంటను కాపాడుకోగలిగామన్నారు. విద్యుత్ సమస్య తలెత్తకుండా చూడాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. మొబైల్ వ్యాన్లు సిద్ధం చేసుకుని విద్యుత్ పునరుద్ధరించాలని సూచించారు. రెండు డిస్కంల పరిధిలో 11. 33/11 కె.వి సబ్ స్టేషన్లు దెబ్బ తినగా ఏడు సబ్ స్టేషన్ లను తిరిగి పునరుద్ధరించారన్నారు. 33 కేవీ లైన్లు 101 దెబ్బతినగా అందులో 96 లైన్లను, 11 కేవీ లైన్లు 237 దెబ్బతినగా 227 లైన్లను, డీటీఆర్ (డిస్ట్రిబ్యూషన్

- మిగతా 2 లో

‘జూబ్లీహిల్స్’లో మాదే విజయం

- బీఆర్ఎస్ పాలనలో పేదలు నిర్లక్ష్యం
- 20 నెలల పాలనలో కోటి 15 లక్షల తెల్లరేషన్ కార్డుల పంపిణీ
- సన్నబియ్యం ద్వారా 3.15 కోట్ల మందికి లబ్ధి
- సంక్షేమ పథకాలపై విపక్షాల దుష్ప్రచారం
- ఇంటింటి ప్రచారంలో మంత్రి ఉత్తమ్

2 లో

జస్టిస్ సూర్యకాంత్ నియామకం ఖరారు



న్యూఢిల్లీ: సర్వోన్నత న్యాయస్థానం 53వ ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ)గా జస్టిస్ సూర్యకాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. జస్టిస్ సూర్యకాంత్‌ను తదుపరి సీజేఐగా నియమించేందుకు నోటిఫికేషన్ విడుదల చేశారు. సీజేఐ బీఆర్ గవాయ్ పదవీకాలం నవంబర్ 23వ తేదీతో ముగియనుండగా... నవంబరు 24న జస్టిస్ సూర్యకాంత్ బాధ్యతలు స్వీకరిస్తారు. జస్టిస్ సూర్యకాంత్ పేరును సీజేఐ గవాయ్ సిఫార్సు చేయగా... కేంద్రం, రాష్ట్రపతి ఆమోదం లభించింది. రాజ్యాంగం ప్రసాదించిన అధికారాలను వినియోగించి జస్టిస్ సూర్యకాంత్‌ను సీజేఐగా రాష్ట్రపతి నియమించారని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘవాల్ ‘ఎక్స్’లో వెల్లడించారు. సీజేఐగా నియమితులైనందుకుగాను జస్టిస్ సూర్యకాంత్‌కు శుభాకాంక్షలు తెలిపారు. జస్టిస్ సూర్యకాంత్ 2019 మే 24న సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. ఆయన పదవీకాలం 2027 ఫిబ్రవరి 9 వరకు ఉంది. దీంతో ఆయన 14 నెలల పాటు సీజేఐగా కొనసాగుతారు. హర్యానాలోని హిసార్‌కు చెందిన మధ్యతరగతి కుటుంబంలో 1962

- మిగతా 2 లో

కుదిరిన ఏకాభిప్రాయం

ఆరేళ్ల తర్వాత జిన్‌పింగ్, ట్రంప్ భేటీ

- తొలగిన ఆటంకాలు... సయోధ్యకు మార్గం సుగమం
- అమెరికా సుంకాల నుంచి చైనాకు ఊరట
- త్వరలో వాణిజ్య ఒప్పందానికి సంకేతాలు

బుసాన్: అమెరికా-చైనా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, జిన్‌పింగ్ కలిసిపోయారు. వివాదాలు- ఘర్షణలను పక్కకు పెట్టి ఇద్దరు నాయకులు ఒప్పందాలు చేసుకున్నారు. వాణిజ్య యుద్ధంపై వెనక్కి తగ్గారు. సుంకాల విషయంలో రాజీ కుదుర్చుకున్నారు. దక్షిణ కొరియాలో అపెక్ శిఖరాగ్ర సదస్సు నేపథ్యంలో ఇద్దరు అధినేతలు ఆరేళ్ల తర్వాత భేటీ అయ్యారు. దాదాపు 100 నిమిషాల పాటు చర్చలు జరిపారు. అనేక అంశాలను చర్చించారు. పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారు. భవిష్యత్‌లో సహకారాన్ని బలోపేతం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇదే క్రమంలో చైనా నుంచి ఫెంటనైల్

- మిగతా 2 లో

ప్రతి రైతుకు న్యాయం చేస్తాం

- 4,47,864 ఎకరాల్లో పంట నష్టం
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో అధికం: మంత్రి తుమ్మల

విశాలాంధ్ర - హైదరాబాద్: మొంథా తుఫాన్ ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా 4,47,864 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. పూర్తి స్థాయిలో సర్వే చేశాక పంట నష్టం పెరగొచ్చని ఆయన వెల్లడించారు. భారీ వర్షాల వల్ల జరిగిన పంట

- మిగతా 2 లో

విశాలాంధ్ర శుక్రవారం 31, అక్టోబరు 2025

మరో అణ్వస్త్రాన్ని పరీక్షించిన రష్యా

'పోసిడాన్'కు తిరుగులేదు: పుతిన్

మాస్కో: అణ్వస్త్రాల పరీక్షలు వద్దంటూ అమెరికా చేసిన హెచ్చరికలను రష్యా బేఖాతరు చేసింది. మరో శక్తిమంతమైన అణ్వస్త్రాన్ని విజయవంతంగా పరీక్షించింది. అణుశక్తితో పనిచేసే అండర్‌వాటర్ డ్రోన్ 'పోసిడాన్'ను పరీక్షించినట్లు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రకటించారు. 'మానవరహిత సముద్ర జలాల్లో లక్ష్యాన్ని ధ్వంసం చేయగల సామర్థ్యంగల అణ్వస్త్రాన్ని విజయవంతంగా పరీక్షించాం. ఈ డ్రోన్‌ను అడ్డుకునేందుకు ఆస్కారం ఉండదు. మరో అణ్వాయుధ పరీక్ష విజయవంతం అయింది' అని తెలిపారు. 'సర్మాట్' క్షిపణి కంటే ఇది శక్తిమంతమైనదిగా వెల్లడించారు. 'పోసిడాన్'కు తిరుగు లేదన్నారు. సముద్ర గర్భంలో న్యూక్లియర్ ప్రొపల్షన్ సిస్టమ్‌ను సొంతంగా క్రియాశీలం చేయగల సామర్థ్యం ఈ అస్త్రం సొంతమని చెప్పారు. పోసిడాన్ నవతరం సాంకేతికతకు నిదర్శనమని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ అన్నారు. ప్రపంచ శాంతి కోసం ఇలాంటి ఆయుధాలు అవసరమన్నారు. అంతర్జాతీయ నిబంధనలు, ద్వైపాక్షిక

ఒప్పందాల ప్రకారమే పరీక్ష జరిగిందని తెలిపారు. 'పోసిడాన్' 10 వేల కిలోమీటర్ల దూరం వరకు... గంటకు 185 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదు. ఇది 20 మీటర్ల పొడుగు ఉంటుంది. దాని వైశాల్యం 1.8 మీటర్లు ఉంది. 100 టన్నుల బరువు ఉంటుందని అంచనా. రెండు మెగాటన్నుల వార్‌హెడ్‌ను తీసుకెళ్లగలదు. కాగా, అపరిమిత పరిధిగల అణ్వాయుధం 'బురెవిస్నిక్'ని రష్యా ఇటీవల పరీక్షించింది.

ద.కొరియాలో ట్రంప్‌కు నిరసన సెగ

సియోల్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు దక్షిణ కొరియాలో నిరసన సెగ తాకింది. అపెక్ శిఖరాగ్ర సదస్సు కోసం ఆ దేశానికి వెళ్లిన ఆయనకు ఆందోళనలు స్వాగతం పలికాయి. వందల మంది వీధుల్లోకి వచ్చి 'నో టు ట్రంప్' అంటూ నినాదాలు ఇచ్చాయి. ట్రంప్‌కు వ్యతిరేకంగా ప్రధాన నగరాల్లో ర్యాలీలు జరిగాయి. జియాంగ్జులో నిరసనకారులు బోమున్ టూరిస్ట్ కాంపెక్స్ (అపెక్స్ సదస్సు వేదిక) వరకు మార్చ్‌కు ప్రయత్నించగా, ఐదు కిలోమీటర్ల దూరంలోనే వారిని భద్రతా సిబ్బంది ఆపేశారు. బ్యారికేడ్లను దాటుకొని కొందరు సభా వేదికకు చేరుకొనేందుకు ప్రయత్నించిన క్రమంలో జరిగిన ఘర్షణలో కొందరికి గాయాలయ్యాయి. అమెరికా విధానాలు, 'నో కింగ్: ట్రంప్ నాట్ వెల్‌కమ్' 'నో అపెక్' వంటి నినాదాలతో బ్యానర్లు, ప్లకార్డులతో నిరసనకారులు కదం తొక్కారు. దక్షిణ కొరియాలోనే అతిపెద్ద కార్మిక సంఘం కొరియన్ కాన్ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (కేసీటీయూ) అధ్వర్యంలో జియాంగ్జు రైల్వే స్టేషన్ సమీపంలో నిరసన ర్యాలీ జరిగింది. అపెక్‌కు వ్యతిరేకంగా ఆందోళనలకు ఇంటర్నేషనల్ పీపుల్స్ రెస్పాన్స్ (30కుపైగా పౌర సంఘాలు, రాజకీయ పార్టీ (లెఫ్ట్ పార్టీ)ల సంకీర్ణం) పిలుపునిచ్చింది. ట్రంప్ సుంకాల భారం వల్ల దీర్ఘకాల మిత్రదేశానికి అన్యాయం

జరుగుతోందని నిరసనకారులు మండిపడ్డారు. దక్షిణ కొరియా సార్వభౌమత్వంతో రాజీ పడి ఆ ప్రాంతాన్ని అస్థిరపర్చేలా ట్రంప్ నిరంకుశ విధానాలు ఉన్నాయని దుయ్యబట్టారు. అధిక సుంకాలతో విరుచుకుపడటంతో దేశంలో అనేక మంది ఉద్యోగాలు పోయాయంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. ట్రంప్ బలవంతపు చర్యలతో అమెరికా ఉత్పత్తి చేసే ఆయుధాలను దక్షిణ కొరియా కొనుగోలు చేసేలా ఒత్తిడి పెరుగుతోందని ఆరోపించారు. ఇదిలావుంటే, ట్రంప్ రాకకు నిరసనగా వారం రోజులుగా దక్షిణ కొరియాలో ఆందోళనలు జరుగుతున్నాయి. రాజధాని సియోల్‌లో ఇటీవల భారీ నిరసన జరిగింది. రాబోయే రోజుల్లో ఆందోళనలు మరింత తీవ్రరూపం దాల్చుతాయని నిరసనకారులు హెచ్చరించారు. శుక్ర, శనివారాల్లో జరిగే అపెక్ సదస్సులో ట్రంప్ పాల్గొంటారు. ఆయన బుధవారం దక్షిణ కొరియా చేరుకున్నారు. అధ్యక్షుడు లీ జే మ్యుంగ్‌తో ద్వైపాక్షిక సమావేశాలు జరిపారు. దేశ ప్రజలు పెద్ద ఎత్తున వ్యతిరేకిస్తున్నప్పటికీ ట్రంప్‌తో కలిసి పనిచేస్తామని మ్యుంగ్ ప్రకటించారు. అమెరికాపై భారాన్ని తగ్గించడం కోసం భవిష్యత్‌లో తమ రక్షణ వ్యయం మరింత పెంచుతామని దేశాధ్యక్షుడు తెలిపారు.

ఏపీ కేబినెట్ 10కి వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

తుపాను ప్రభావం, మరోపక్క కృష్ణాకు పెరిగిన వరద ఉధృతి కారణంగా కేబినెట్ భేటీని వాయిదా వేసినట్లు సమాచారం. విశాఖ వేదికగా నవంబరు 14,15 తేదీల్లో జరిగే పెట్టుబడుల సదస్సుపై మంత్రి వర్గం చర్చించనుంది. మంత్రులు అందరికీ సదస్సు నిర్వహణ బాధ్యతలు అప్పగించనున్నారు. ఏర్పాట్లపై ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘం నియామకమైన విషయం తెలిసిందే. దీంతో పాటు రాజధాని అమరావతి పనులు, భూముల కేటాయింపులపైనా మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు.

జస్టిస్ సూర్యకాంత్ నియామకం ఖరారు

(మొదటిపేజీ తరువాయి)

ఫిబ్రవరి 10న జస్టిస్ సూర్యకాంత్ జన్మించారు. 1981లో హిసార్‌లోని ప్రభుత్వ కళాశాల నుంచి పట్టభద్రులయ్యారు. 1984లో రోహతక్‌లోని మహర్షి దయానంద్ విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. అదే ఏడాది హిసార్ జిల్లా కోర్టులో ప్రాక్టీస్ మొదలు పెట్టారు. 1985లో పంజాబ్, హర్యానా హైకోర్టుకు బదిలీ అయ్యారు. 2001 మార్చిలో సీనియర్ న్యాయవాది అయ్యారు. 2004 జనవరి 9న పంజాబ్, హర్యానా హైకోర్టు శాశ్వత జడ్జిగా పదోన్నతి పొందారు. అప్పటివరకు అడ్వకేట్ జనరల్‌గా వ్యవహరించారు. 2018 అక్టోబరు 5న హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు.

మోదీ సర్కారును కూల్చే కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

భంగం కలిగించడానికి, ప్రపంచవ్యాప్తంగా భారత ప్రతిష్టను దెబ్బతీసేందుకు జాగ్రత్తగా ప్లాన్ ప్రకారం చేసిన ప్రయత్నమని పోలీసులు తెలిపారు. 2020 హింసకు సంబంధించి, ఉపా కేసులో ఖాలిద్, ఇతరులకు ఢిల్లీ హైకోర్ట్ బెయిల్ నిరాకరించిన తర్వాత ఈ పరిణామం చోటు చేసుకుంది. పౌరసత్వం (సవరణ) చట్టం (సీఏఏ) కు వ్యతిరేకంగా ఉన్న అసమ్మతిని ఆయుధంగా చేసుకుని భారతదేశ సార్వభౌమాధికారం, సమగ్రతను దెబ్బతీసేందుకు ఈ అల్లర్లు సృష్టించబడ్డాయని పోలీసులు వాదించారు. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ తన మొదటి పదవీ కాలంలో భారతదేశానికి అధికారిక పర్యటనకు వెళ్లే సమయంలోనే ఈ కుట్రను అమలు చేయడానికి ముందస్తు ప్రణాళిక రూపొందించబడిందని, అంతర్జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించడానికి పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) అంశాన్ని ప్రపంచ సమస్యగా మార్చడానికి ఈ కుట్రను అమలు చేశారని పేర్కొన్నారు. ఈ కేసులో బెయిల్ నిరాకరిస్తూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వును సవాలు చేస్తూ షార్జీల్ ఇమామ్, ఉమర్ ఖాలిద్, గుల్ఫిషా ఫాతిమా, మీరాన్ హైదర్, షిఫా ఉర్ రెహ్మాన్ బెయిల్ పిటిషన్లపై ఢిల్లీ పోలీసులు అఫిడవిట్ దాఖలు చేశారు.

ప్రతి రైతుకు న్యాయం చేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

నష్టంపై గురువారం ప్రాథమిక నివేదిక ప్రకటించారు. తుఫాన్ ప్రభావంతో 12 జిల్లాల్లోని 179 మండలాల్లో పంట నష్టం వివరాలను బట్టి చూస్తే 2,82,379 ఎకరాల్లో వరి, 1,51,707 ఎకరాల్లో పత్తి నష్టపోయినట్లు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,30,200 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లగా, ఖమ్మం జిల్లాలో 62,400 ఎకరాల్లో, నల్లగొండలో 52,071 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వివరించారు. 2,53,033 మంది రైతులు నష్ట పోయారని, ప్రతి రైతును ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. వరద ప్రభావిత జిల్లాల్లో సీఎం రేవంత్ రెడ్డి పర్యటిస్తారని, రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తుమ్మల పేర్కొన్నారు. ఎకరాకు ఎంత పంట నష్ట పరిహారం ఇవ్వాలో సీఎంతో చర్చించి నష్ట పోయిన ప్రతి రైతుకు న్యాయం చేస్తామని అన్నారు.

రూటు మార్చారని బీమా ఆపరాదు

(మొదటిపేజీ తరువాయి)

ఢీకొట్టింది. ఆ ప్రమాదంలో బైక్‌పై ఉన్న వ్యక్తి అక్కడికక్కడే చనిపోయాడు. ఈ కేసులో బాధితుడికి వడ్డీతో కలిపి రూ.18.86 లక్షల పరిహారం ఇవ్వాలని మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్ తీర్పు ఇచ్చింది. ఈ పరిహారం సరిగ్గా లెక్కించలేదని పిటిషనర్, మరోవైపు ప్రమాదానికి కారణమైన వాహనం రూట్ పర్మిట్‌ను ఉల్లంఘించిందని బీమా కంపెనీ ఆరోపిస్తూ అక్కడి హైకోర్టును ఆశ్రయించాయి. విచారించిన హైకోర్టు బాధితుడికి పరిహారం చెల్లించాల్సిందేనని బీమా సంస్థకు స్పష్టం చేసింది. అయితే, దానిని వాహన యజమాని నుంచి రికవరీ చేసుకునేందుకు అనుమతిచ్చింది. దీనిని సవాలు చేస్తూ బీమా సంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. మరోవైపు రికవరీకి వీలు కల్పించడాన్ని సవాలు చేస్తూ వాహన యాజమాని కూడా సుప్రీంకు వెళ్లారు. విచారించిన జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాతో కూడిన ధర్మాసనం ఈ రెండు అప్పీళ్లను తోసిపుచ్చింది. సాంకేతిక కారణాలు చెప్పి బాధితుడికి పరిహారం నిరాకరించడం సరికాదని, అది సహజ న్యాయ భావనకు విరుద్ధమని అభిప్రాయపడింది. బాధితుడికి పరిహారం చెల్లించాలని, దాన్ని యజమాని నుంచి రికవరీ చేసుకోవడం సమర్థనీయమేనని పేర్కొంది.

వియత్నాం అతలాకుతలం

హనోయ్: భారీ వర్షాలు, వరదలతో వియత్నాం అతలాకుతలమైంది. పర్యాటక ప్రదేశాలకు సమీపంలో ఉన్న ఒక ప్రధాన నది నీటిమట్టం 60 ఏళ్ల గరిష్ఠ స్థాయికి చేరింది. ఇప్పటివరకు 10 మంది మరణించారు. ఈ మేరకు అధికారులు గురువారం తెలిపారు. యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశం హోరు యాన్ పురాతన పట్టణానికి నిలయమైన వియత్నాం తీరప్రాంత ప్రావిన్సులను వర్షాలు ముంచెత్తాయి. గడచిన 24 గంటల్లో రికార్డు స్థాయిలో 1.7 మీటర్ల వర్షపాతం నమోదైంది. ఇప్పటివరకు 10 మంది చనిపోగా, ఎనిమిది మంది ఆచూకీ లేదని పర్యావరణ శాఖ తెలిపింది. ఐదు ప్రావిన్స్‌లలో 128,000లకు పైగా ఇళ్లు నీటమునిగాయి. కొన్ని ప్రాంతాల్లో మూడు మీటర్ల లోతు నీరు నిలిచిపోయింది. హోరు యాన్ వీధుల్లో నడుమల్లోతు నీరున్నది. కింది అంతస్తులన్నీ నీట మునిగాయి. రోడ్లు ధ్వంసమయ్యాయి. కొండచరియలు విరిగిపడ్డాయి. ఐదు వేల ఎకరాల

హెక్టార్లలో పంట నష్టం జరిగింది. 16 వేల పశువులు చనిపోయాయి. ఈ ఏడాదిలో సంభవించిన ప్రకృతి విపత్తులతో ఇప్పటివరకు 610 బిలియన్ డాలర్ల ఆర్థిక నష్టం వచ్చినట్లు ప్రభుత్వం లెక్కతేల్చింది.

పోటెత్తిన వరద

- ప్రకాశం బ్యారేజి వద్ద 6 లక్షల క్యూసెక్కుల నీరు
- 70 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల
- రెండో ప్రమాద హెచ్చరిక
- తీర ప్రాంతాలను అప్రమత్తం చేసిన అధికారులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మొంథా తుపాను షాక్ నుంచి ప్రజలు కోలుకోకముందే కృష్ణా నదికి వరద ఉధృతి పెరిగింది. తుపాన్ ప్రభావానికి ఏపీతో పాటు, తెలంగాణలో భారీ వర్షాలు కురవడంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. మునేరు, కట్టలేరు, వైరా ఏరు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీనికితోడు కృష్ణానదిలో కూడా ప్రవాహం పెరగడంతో ప్రకాశం బ్యారేజీకి గురువారం రాత్రి 9 గంటల సమయానికి సుమారు 6లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ఈ వరద ప్రవాహం గంట గంటకూ పెరుగుతోంది. దీంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. తీర ప్రాంతాలను అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేపట్టారు. నాగార్జున సాగర్ నుంచి 2లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తుండగా, దిగువన ఉన్న పులిచింతలకు రెట్టింపు ప్రవాహం వచ్చి చేరుతోంది. దీనికి మరింత దిగువన మునేరు ప్రవాహం లక్షన్నర క్యూసెక్కులకు పైగా వచ్చి కలుస్తోంది. దీంతో ప్రకాశం బ్యారేజీకి ప్రవాహ తాకిడి తీవ్రమైంది. ఈ నేపథ్యంలో వరద తీవ్రతను తగ్గించేందుకు నీటిపారుదల శాఖ వ్యూహాత్మకంగా వ్యవహరించింది. ఎగువ నుండి వస్తున్న వరదలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, నాగార్జున సాగర్ నుండి విడుదల చేస్తున్న 2లక్షల క్యూసెక్కుల వరద నీటిని 1లక్ష క్యూసెక్కుల కు తగ్గించారు. అలాగే పులిచింతల ప్రాజెక్ట్ నుండి ఉదయం 4.85 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల చేయగా, దానిని మధ్యాహ్నానికి 3.85 లక్షలకు తగ్గించారు. అయినప్పటికీ ప్రకాశం బ్యారేజీ వద్ద రాత్రికల్లా వరద 6 లక్షల క్యూసెక్కులకు చేరింది. దీంతో 70 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

పర్యవేక్షించిన మంత్రి రామానాయుడు

వాగుల నుంచి వస్తున్న వరద ప్రవాహం ఎక్కువగా ఉండడంతో రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు, జలవనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి, కృష్ణాడెల్టా చీఫ్ ఇంజనీర్ రాంబాబు, ఇతర ఇరిగేషన్ అధికారులతో కలసి ప్రకాశం బ్యారేజ్ దగ్గర కృష్ణానది వరద ప్రవాహాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి మాట్లాడుతూ... నాగార్జున సాగర్, పులిచింతల, నుండి వచ్చే వరదతో ప్రకాశం బ్యారేజికి దాదాపు 6 లక్షల నుండి 6.5లక్షల క్యూసెక్కుల కు పైగా వరద వచ్చే అవకాశం ఉండటం తో, దిగువ ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు.కృష్ణాడెల్టా పరిధిలో అధికారులు అందరూ క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ, ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, ప్రకాశం,అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలో వాగులు పొంగుతుండంతో ఆయా జిల్లాల కలెక్టర్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే గుండ్లకమ్మకు వస్తున్న వరద నీరు, తగ్గుతుండటం తో 70 వేల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నామని తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో ఈరోజు అధిక వర్షాలను దృష్టిలో పెట్టుకుని అధికారులు వాగుల గట్లు, కాల్వ గట్లు పట్ల అప్రమతం గా ఉండాలని ఆదేశించామన్నారు. వర్షాలు, వరదల పట్ల ప్రభుత్వం అన్నిరకాల ముందస్తు జాగ్రత చర్యలు చేపట్టి, ఆస్తి, ప్రాణ నష్టం జరుగకుండా చర్యలు తీసుకుంటుందని, వైసీపీ సోషల్ మీడియా లో వరదల గురించి చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని మంత్రి కోరారు.

డ్రోన్ వినియోగంతో ప్రమాద నివారణ

విపత్తుల నిర్వహణలో డ్రోన్ల వినియోగం కీలకంగా మారింది. కృష్ణా నదిలో ఎగువ నుంచి కొట్టుకుని వస్తున్న బోటును గుర్తించి విపత్తుల నిర్వహణ సంస్థలోని కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందింది. హుటాహుటిన స్పందించిన విపత్తుల నిర్వహణ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దీపక్ స్వయంగా ఎస్డీఆర్ఎఫ్ డ్రోన్ల బృందంతో సమన్వయం చేసుకుని పర్యవేక్షించారు. డ్రోన్లతో తుమ్మలపాలెం వద్ద బోటుని గుర్తించి ఎస్‌డీఆర్ఎఫ్, గజ ఈతగాళ్ల సహాయంతో బోటును ఒడ్డుకు చేర్చి ప్రమాదం తప్పించారు. కృష్ణా నది వరద ఉధృతిలో ప్రకాశం బ్యారేజి గేట్ల దగ్గరకు వచ్చి ఉంటే తీవ్రముప్పు సంభవించేది.గత సంవత్సరం బుడమేరు వరదల్లో ప్రకాశం బ్యారేజి గేటులో చిక్కుకున్న బోటు తీయడానికి ఎనిమిది రోజులపాటు, అధికార యంత్రాంగం తీవ్రంగా శ్రమించిన విషయం తెల్సిందే.

13 ఏళ్లకు పట్టుబడ్డ నేరగాళ్లు

శ్రీనగర్: జమ్మూకశ్మీర్ పోలీసులు ఇద్దరు ఆర్థిక నేరగాళ్లను 13 ఏళ్ల తర్వాత అరెస్టు చేశారు. మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల్లో వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు అధికారులు గురువారం తెలిపారు. దోపిడీ, అపహరణ కేసుల్లో నిందితులు ముదాసిర్ అహ్మద్, ముస్తఖ్ అహ్మద్ వనీ 13 ఏళ్లుగా పరారీలో ఉండగా... కర్నాటక, మహారాష్ట్రలో ఉన్నట్లు తెలుసుకొని, రెండు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి వారిని గుర్తించి, పట్టుకున్నట్లు జమ్మూకశ్మీర్ పోలీసు ఉన్నతాధికారి ఖలీల్ అహ్మద్ పోస్వాల్ వెల్లడించారు. గందేర్బల్ జిల్లా వ్యాప్తంగా 91 మంది పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఇప్పటివరకు వీరిలో 24 మంది చిక్కారన్నారు. మిగతావారిని సాధ్యమైనంత త్వరలో పట్టుకుంటామని చెప్పారు.

కుదిరిన ఏకాభిప్రాయం

(మొదటిపేజీ తరువాయి)

సుంకాలపై 10 శాతం తగ్గింపునకు ట్రంప్ అంగీకరించారు. దీంతో చైనాపై అమెరికా విధించిన మొత్తం సుంకం 57 శాతం నుంచి 47 శాతానికి తగ్గింది. అమెరికా సోయాబీన్ సహా వ్యవసాయోత్పత్తుల కొనుగోళ్లను చైనా కూడా అంగీకరించింది. అమెరికాకు చైనా నుంచి అరుదైన ఖనిజాల ఎగుమతులకు ఈ సమావేశం క్రమంలో మార్గం సుగమమైంది. ఈ ఖనిజాలను ఏడాది పాటు అమెరికాకు ఎగుమతి చేసేలా ఒప్పందం కుదిరింది. అరుదైన ఖనిజాల కారణంగానే చైనాపై 100శాతం సుంకాల హెచ్చరికలను ట్రంప్ జారీ చేసిన విషయం విదితమే. ఇదిలావుంటే, త్వరలో చైనాతో వాణిజ్య ఒప్పందం చేసుకోనున్నట్లు ట్రంప్ సంకేతాలిచ్చారు. చైనా అధ్యక్షుడితో భేటీ అద్భుతంగా సాగిందని ట్రూత్ సోషల్ మాధ్యమంగా తెలిపారు. జిన్‌పింగ్ గొప్ప నాయకుడు అంటూ ప్రశంసించారు. ఆయనకు 10లో నుంచి 12 మార్కులు వేస్తానన్నారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధం ఆపేందుకు అమెరికాతో కలిసి పనిచేసేందుకు జిన్‌పింగ్ అంగీకరించినట్లు ట్రంప్ తెలిపారు. 2026, ఏప్రిల్‌లో చైనాలో పర్యటిస్తానని, ఆ తర్వాత జిన్‌పింగ్ కూడా అమెరికాకు వస్తారన్నారు. అరుదైన ఖనిజాలపై చైనా ఆంక్షలు విధించదని, తమ రెండు దేశాల మధ్య ఉన్న ప్రధాన ఆటంకాలన్నీ దాదాపుగా తొలగిపోయాయని ట్రంప్ వెల్లడించారు. ఇటీవల మలేసియా, జపాన్‌లో పర్యటించిన ట్రంప్... దక్షిణ కొరియా పర్యటనను ముగించుకొని అమెరికాకు తిరిగివెళ్లారు. తనకు అతిథ్యమిచ్చిన దేశాలకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, జిన్‌పింగ్-ట్రంప్ ఇద్దరూ బుసాన్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయం వేదికగా భేటీ అయిన అసాధారణ పరిణామం చర్చకు దారితీసింది. అయితే షెడ్యూల్ కుదరక చివరి నిమిషంలో ఈ భేటీకి ఏర్పాట్లు చేసినట్లు అధికార వర్గాలు వెల్లడించారు.

ఎస్డీఆర్ఎఫ్ నిధులు వినియోగించండి

(మొదటిపేజీ తరువాయి)

ట్రాన్స్‌ఫార్మర్‌లు 171 దెబ్బతినగా 49 ప్రాంతాల్లో పునరుద్ధరించినట్టు వివరించారు. 638 విద్యుత్ స్తంభాలు దెబ్బతినగా 304 విద్యుత్ స్తంభాలను తిరిగి ఏర్పాటు చేశారని డిప్యూటీ సీఎం తెలిపారు.

భోజన... అద్దె బకాయిలు రూ.92 కోట్లు చెల్లించండి

గురుకులాలు, కేజీబీవీ, బెస్ట్ అవైలబుల్ పాఠశాలల బకాయిలు మొత్తం వెంటనే చెల్లించాలని భట్టి విక్రమార్క ఆదేశించారు. గురువారం సాయంత్రం ప్రజాభవన్ లో ఆర్థిక శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గిరిజన సంక్షేమ పాఠశాలలు, గిరిజన, జనరల్ గురుకులాలు, కేజీబీవీ పాఠశాలలు విద్యార్థుల భోజన... అద్దె చార్జీలు, కాస్మోటిక్ పెండింగ్ బిల్లులపై చర్చించారు. రూ.92 కోట్లు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మెనూను తూచా తప్పక పాటించాలని, నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ప్రభుత్వ గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలు, కేజీబీవీలను సందర్శించాలని సూచించారు. ప్రభుత్వం విద్యకు పెద్ద పీట వేస్తోందన్నారు. గత ప్రభుత్వ బకాయిలను కూడా చెల్లిస్తున్నామని తెలిపారు. ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు.

అజార్‌ను అడ్డుకునేందుకు బీజేపీ కుట్ర: భట్టి

ఎమ్మెల్సీ మహమ్మద్ అజారుద్దీన్ ను రాష్ట్ర మంత్రి వర్గంలోకి తీసుకోకుండా బీజేపీ కుట్రలు చేస్తోందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారు. క్రికెట్‌లో దేశానికి ఎంతో సేవ చేశారని, దేశ కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పిన క్రీడాకారుల్లో అజారుద్దీన్ ఒకరని కొనియాడారు. విఖ్యాత క్రీడాకారుడికి మంత్రి వర్గంలో అవకాశం కల్పిస్తుంటే బీజేపీ అడ్డుకుంటోందని మండిపడ్డారు. అజారుద్దీన్ తో ప్రమాణ స్వీకారం చేయించకుండా రాష్ట్ర గవర్నర్ పైన బీజేపీ ఒత్తిడి తీసుకువస్తున్నట్లు తెలిసిందన్నారు. గాంధీభవన్ లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ తెరవెనుక బంధం గురించి ఇప్పటికే కల్వకుంట్ల కవిత స్పష్టం చేసిందన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సహకారంతోనే బీజేపీ రాష్ట్రంలో ఎనిమిది సీట్లు గెలుచుకుందని వివరించారు. జూబ్లీహిల్స్‌లో తమకు గెలిచే అవకాశం లేదని తెలుసుకున్న బీజేపీ... బీఆర్ఎస్ కు లాభం చేయడం కోసం బలహీనమైన అభ్యర్థిని ప్రకటించిందన్నారు.

'జూబ్లీహిల్స్'లో మాదే విజయం

విశాలాంధ్ర-జూబ్లీహిల్స్: జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో అంతిమ విజయం కాంగ్రెస్ పార్టీదేనని మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అన్నీ సర్వేలు హస్తం వైపే మొగ్గుచూపడం ఇందుకు తార్కాణమని ఆయన పేర్కొన్నారు. అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు నల్లేరు మీద నడకేనని స్పష్టం చేశారు. ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా గురువారం యూసుఫ్ గూడ డివిజన్ కృష్ణానగర్ లో సహచర మంత్రి పొన్నం ప్రభాకర్, షాద్‌నగర్ ఎమ్మెల్యే ఇదూలపల్లి శంకరయ్య, అజహరుద్దీన్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి,ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీత ముదిరాజ్ , బొల్లు కిషన్‌తో కలసి ఇంటింట ప్రచారం నిర్వహించారు. మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నియోజకవర్గ పరిధిలో నిరుపేదలు నిర్లక్ష్యానికి గురయ్యారని విమర్శించారు. ఒక్క తెల్ల రేషన్ కార్డు మంజూరు చేయలేక పోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. 20 నెలల కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన నిరుపేదలకు కోటి 15 లక్షల తెల్ల రేషన్ కార్డులు పంపిణీ చేశామన్నారు. ఒక్క జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలో 40 వేల తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేశామని గుర్తుచేశారు.

దేశ చరిత్రలోనే నిరుపేదలందరికి నాణ్యమైన సన్న బియ్యం పంపిణీని ప్రారంభించిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని అన్నారు. 3.15 కోట్ల మంది లబ్ధి పొందుతున్నారన్నారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, గృహ జ్యోతి పథకంతో అర్హులైన నిరుపేదలందరికి 200 యూనిట్ల విద్యుత్ ను ఉచితంగా అందిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. సంక్షేమ పథకాలను విస్మరించిన విపక్షాలు అధికార కాంగ్రెస్‌పై దుష్ప్రచారానికి పాల్పడడం విడ్డూరమని విరుచుకుపడ్డారు. పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఉప ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటయ్యాయని ఆరోపించారు. ఇదే నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ కేంద్ర మంత్రిగా పదవీబాధ్యతలు నిర్వర్తిస్తున్న కిషన్ రెడ్డి ... ఎంతమేర నిధులు విడుదల చేశారని ప్రశ్నించారు.

చిన్నారుల కిడ్నాప్... నిందితుడి ఎన్‌కౌంటర్

ముంబై: ముంబైలో ఆడిషన్స్ కోసం వచ్చిన చిన్నారులను బంధించిన కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. 17 మంది చిన్నారుల సహా 19 మందిని పోలీసులు రక్షించారు. నిందితుడిని ఎన్‌కౌంటర్ చేశారు. రెస్క్యూ ఆపరేషన్ సమయంలో నిందితుడు కాల్పులకు తెగబడినట్లు పోలీసులు వెల్లడించారు. ఎదురు కాల్పుల్లో అతనికి తీవ్ర గాయాలయ్యాయని, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయినట్లు సమాచారం. పవయీ ప్రాంతంలోని ఆర్ఏ యాక్టింగ్ స్టూడియోలో రోహిత్ ఆర్య అనే వ్యక్తి గత నాలుగు, ఐదు రోజులుగా ఆడిషన్స్ నిర్వహిస్తున్నాడు. గురువారం ఉదయం 8-14 ఏళ్ల వయసులోపు ఉన్న 100 మంది చిన్నారులు స్టూడియోకు వచ్చారు. కొంత సమయం తర్వాత చిన్నారులను బయటకు పంపించిన రోహిత్... కొందరిని బంధించాడు. దీంతో భయాందోళనలకు గురైన పిల్లలు స్టూడియో కిటికీల నుంచి సాయం కోసం అరిచారు. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. రంగంలోకి దిగిన పోలీసులు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. నిందితుడికి సర్దిచెప్పేందుకు యత్నించారు. పిల్లలను వదిలేందుకు తడు ఒప్పుకోలేదు. వారికి హాని కలిగిస్తానని బెదిరించాడు. దీంతో బాత్‌రూమ్ ద్వారా లోనికి ప్రవేశించి 17 మంది చిన్నారులు సహా 19 మందిని రెస్క్యూ టీమ్ రక్షించింది. ఆ సమయంలోనే నిందితుడు కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. ఘటనా స్థలం నుంచి ఎయిర్‌గన్, కొన్ని రసాయనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అంతకుముందు ఓ ఆడియో విడుదల చేసిన నిందితుడు... తన పేరు రోహిత్ అని, ఆత్మహత్యకు బదులు చిన్నారులను నిర్బంధించాలనే ప్లాన్ చేసినట్లు వెల్లడించాడు. తనకు డబ్బు వద్దని, కొంతమందితో మాట్లాడాలని, వారి నుంచి కొన్ని సమాధానాలు తెలుసుకోవాలని పేర్కొన్నాడు.

బాధితులను ఆదుకుంటాం

(మొదటిపేజీ తరువాయి)

చూడాలన్నారు. విద్యుత్తు పునరుద్ధరించేలా విద్యుత్ శాఖ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఖమ్మం జిల్లాలో ఒక వ్యాన్, డ్రైవర్ వాగులో కొట్టుకుపోవటం దురదృష్టకరమని సీఎం అన్నారు. బ్రిడ్జిలు, లో లెవల్ కాజ్ వేలు, కల్వర్టుల వద్ద అప్రమత్తంగా ఉంటే ఇలాంటి ఘటనలను నివారించవచ్చని సీఎం అన్నారు. రహదారులపైకి వరద నీళ్లు వచ్చే ప్రాంతాల్లో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. వాహనాలు అటువైపు వెళ్లకుండా పోలీసులు నిషేధాజ్ఞలు అమలు చేయాలన్నారు. కుంభ వృష్టి సమయంలో ప్రజలు రోడ్లపైకి రాకుండా అవగాహన కల్పించాలని అన్నారు. వైద్యారోగ్య శాఖ అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వరంగల్‌లో తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో హైదరాబాద్ నుంచి హైడ్రా టీమ్‌లను, అవసరమైన సామగ్రిని పంపించాలని సీఎస్, డీజీపీలను ఆదేశించారు. ఇప్పటికే తొమ్మిది పునరావాస శిబిరాలు ఏర్పాటు చేసి వరద ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని వెంటనే తరలించాలని, ఇళ్ల పైకప్పులు, భవనాలపై చిక్కుకున్న కుటుంబాలకు డ్రోన్ల ద్వారా తాగునీటితో పాటు, ఆహార పాకెట్లు సర ఫరా చేయాలని సూచించారు. కలెక్టరేట్లో టోల్ ఫ్రీ హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. రాష్ట్ర స్థాయిలోనూ కమాండ్ కంట్రోల్ సెంటర్లో హెల్ప్ లైన్ ఏర్పాటు చేసి వర్షాలు, వరదలు, విపత్తులు వచ్చినప్పుడు వెంటనే స్పందించేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు.

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, విపత్తుల నిర్వహణ విభాగం స్పెషల్ సెక్రటరీ అరవింద్ కుమార్, హైదరాబాద్ జలమండలి ఎండీ అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

బతికుండగానే మార్చురీకి...

(మొదటిపేజీ తరువాయి)

చిన్నగూడూరు మండలం జయ్యారం గ్రామానికి చెందిన రవిగా గుర్తించారు. ఈ ఘటనతో ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందిపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆధార్ కార్డు లేకపోతే చికిత్స చేయరా అంటూ నిలదీస్తున్నారు. ఈ ఘటనపై అధికారులు స్పందించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రాజెక్టు పరిసరాలకు వెళ్ళవొద్దు : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో నిర్మల్ జిల్లా : జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కడెం, స్వర్ణ ప్రాజెక్టుల పరిసరాలకు ఎవరూ వెళ్లరాదని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం తెలిపారు. నదీ పరివాహక ప్రాం తాలు, వాగులు, లోతట్టు ప్రదేశాలకు ఎవరూ వెళ్లవద్దని, ముఖ్యంగా పశువుల కాపరులు తమ పశువులను నదివాగుల దారుల్లోకి తీసుకెళ్లకూడదని కలెక్టర్ సూచించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులు రక్షణలో భాగంగా అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరద నీటితో కడెం, గడ్డెన్న, స్వర్ణ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తనున్న నేపథ్యంలో దిగువ గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని స్పష్టం చేశారు. నదీ పరివాహక ప్రాంతాల్లోకి చేపలు పట్టేవారు, రైతులు, ఇతరులు వెళ్లకూడదని హెచ్చరించారు. జిల్లా యంత్రాంగం 24 గంటలు అప్రమత్తంగా ఉందని, ఎన్‌డిఆర్ఎఫ్‌టీంలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నంబర్ 9100577132ను సంప్రదించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.

ధాన్యం సేకరణకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో మహబూబాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాలోని అధికారులు ధాన్యం సేకరణకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు తెలియజేశారు. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, సంబంధిత అధికారులతో రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కొండ సురేఖ, వాకాటి శ్రీహరి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, అధికారులు ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావులతో కలిసి హైదరాబాద్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెక్రటేరియట్ నుండి ప్రారం భమైన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ధాన్యం సేకరణ కేంద్రాల వద్ద క్షేత్ర స్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై పౌరసరఫరాల విభాగం ఎప్పటికప్పుడు కలెక్టర్లకు తగిన సూచనలు చేయాలన్నారు .ధాన్యం సేకరణకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలని, ప్రతీ కొనుగోలు కేంద్రానికి మండల స్థాయి అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించి బాధ్యతలు అప్పగించాలని అన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ సంయుక్తంగా ఒక మానీటరింగ్ సెంటర్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. దెబ్బతిన్న రోడ్ల పరిస్థితిని ఎప్పటికప్పుడు మానీటర్ చేస్తూ ట్రాఫిక్ ను డైవర్ట్ చేయాలని, చెరువులు, వాగులు, మేజర్, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు, లో లెవల్ కల్వర్టుల దగ్గర పరిస్థితులను గుర్తించి స్థానికులను ముందుగానే అలర్ట్ చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, (రెవెన్యూ) కె. అనిల్ కుమార్, తొర్రూరు, మహబూబాబాద్ ఆర్డీఓలు గణేష్, క్రిష్ణవేణి, జడ్పీ సీఈవో పురుషోత్తం, డిఏఓ విజయనిర్మల, డిపిఓ హరిప్రసాద్, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, ఆర్అండ్బి ఈఈ లు, డిఎస్ఓ ప్రేమ్ కుమార్, డిఎం సివిల్ సప్లై క్రిష్ణవేణి, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్,సంబధిత అధికారులతో కలిసి పాల్గొన్నారు.

ఏ విపత్కర పరిస్థితుల్లోనైనా ధైర్యంగా ఉండాలి

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి,సింగరేణి: వైద్యవృత్తిని ఎంచుకున్న విద్యార్థులు ఎటువంటి విపత్కర పరిస్థితిలోనైనా ధైర్యంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం గోదావరిఖని సింగరేణి వైద్య కళాశాలలో నిర్వహించిన వైట్‌కోట్ సేర్మనీలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య కోర్సును ఎంపిక చేసుకుని మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన వైద్య కళాశాలలో రామగుండం సింగరేణి వైద్య కళాశాలలో వద్ద మెరుగైన వసతులు ఉన్నాయని, అంకితభావంతో పనిచేసే ఫ్యాకల్టీ ఉందని, వైద్యులుగా ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా నిర్దేశించుకున్న లక్ష్యాలను వైట్ కోట్ సేర్మనీ గుర్తు చేస్తుందని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్‌నరేందర్, డా.లావణ్య, డా. ప్రదీప్ చంద్ర, డా.భాను లక్ష్మీ,డా. ఫరీద్, డా. అనూష సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు. రామగుండం నగర అభివృద్ధికి ప్రభుత్వం మరో రూ.50 కోట్లు మంజూరు చేసిందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యూఐడి.ఎఫ్ స్కీం క్రింద చేపట్టిన 2 అభివృద్ధి పనులకు నేషనల్ హౌసింగ్ బ్యాంకు రూ.40 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.10 కోట్లు విడుదల చేస్తుందని, ఈ పనులకు మార్చి 2026 నాటికి పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేశామని తెలిపారు.

తుపాన్ బాధిత రైతులకు భరోసా ఇవ్వాలి

విశాలాంధ్ర కారేపల్లి :మొంథా తుఫాన్‌తో చేతికి వచ్చిన పంట తుడిచిపెట్టకపోయిందని, తుఫాన్ బాధిత రైతులకు కేంద్ర,రాష్ట్రాలు భరోసా కల్పించాలని సీపీఐ(ఎం)పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు.గురువారం ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలో పంటలను రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ నాయకత్వంలో సీపీఐ(ఎం) బృందం పంటలను పరిశీలించారు.ఈసందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ తెలంగాణలో 10 జిల్లాలో తుపాన్‌తో పంటలు తీవ్ర నష్టపోయాయన్నారు. తుపాన్‌తో వీచిన గాలులు, వర్షానికి పంట పోలాలు నీటిలో మునగటం, నేలవారటం జరిగిందన్నారు. రాష్ట్రంలో తీతకు వచ్చిన పత్తి పంట చేనులోనే వర్షానికి తడిసి ముద్దఅయ్యిందన్నారు. రాష్ట్రంలో 30 వేల ఎకరాలలో వరి పంటకు నష్టం వాటిల్లిందన్నారు. తుపాన్‌తో రైతులు అతులాకుతలం అవుతున్న కేంద్ర,రాష్ట్ర పాలకులు నేటికి స్పందించక పోవటంతో విచారకరమన్నారు.రాష్ట్రం ప్రభుత్వం పంట నష్టంపై విచారించి కేంద్రానికి నివేధిక పంపాలన్నారు.కేంద్రం ప్రభుత్వం రైతుల విషయంలో తాత్సర్యం చేయకుండా వెంటనే ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇచ్చేలా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు,రాష్ట్ర కమిటీ సభ్యులు అబ్బాస్,రమావత్ శ్రీరాంనాయక్, స్కైలాబ్‌బాబు, ఎర్ర శ్రీనివాసరావు,మెరుగు రమణ,నవీన్‌రెడ్డి,మండల కార్యదర్శి కే.నరేంద్ర, నాయకులు పాల్గొన్నారు.

విశ్రాంతి ఉద్యోగులకు పెన్షన్, మెడికల్ కార్డ్ రెన్యువల్ చేయ్యాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం : విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ తోపాటు ప్రతి ఏటా నిర్వహించే డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ కార్యక్రమంలో మెడికల్ కార్డ్ రెన్యువల్ చెయ్యాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. గురువారం జీఎం (పర్సనల్) కు ఈ మేరకు కు వినతిపత్రం అందించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ పెన్షన్ రెన్యువల్ డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ 4.0 కార్యక్రమాన్ని సింగరేణి యాజమాన్యంతో కలసి చేపట్టడాన్ని తమ అసోసియేషన్ స్వాగతిస్తుందన్నారు. పెన్షన్ కొరకు కోల్ మైన్స్ ప్రావిడెంట్ శాఖకు, సిపిఆర్ఏంఎస్ కార్డు రెన్యువల్ కొరకు సింగరేణికి సమర్పించాలని వివరించారు. సిఎంపిఎఫ్ వారు నిర్వహించే డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ 4.0 కార్యక్రమంలో సిపిఆర్ఎంఎస్ కార్డు రెన్యువల్ చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంతంగి లింగయ్య, లక్ష్మీనారాయణ, వంగ వెంకట్, క్రిస్టోఫర్, హుమాయూన్, రాజేశ్వరరావు, బండారి మల్లయ్య, మధుకృష్ణ, అబ్బాస్, అలీ, షబ్బీర్, అల్లి మోహన్ పాల్గొన్నారు.

రైతాంగానికి కేంద్రం సాయం చేయాలి : మంత్రి పొన్నం

విశాలాంధ్ర - హుస్నాబాద్ : మొంథా తుఫాన్ ప్రభావంతో ఊహించని నష్టం వాటిల్లిందని కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుల కింద పరిగణించి నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని అకాల వర్షాలతో తడిసిన ధాన్యం, పంటనష్టం, ధ్వంసమైన రోడ్లను అధికారుల బృందంతో పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గం మూడు జిల్లాల పరిధిలో ఉందని తుపాన్ ప్రభావంతో వందలాది మెట్రిక్ టన్నుల ధాన్యం కొట్టుకుపోయిందని, వేలాది మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసి ముద్దయిందన్నారు. మొంథా తుఫాన్ ప్రభావంతో భారీగా రోడ్ల ధ్వంసం, చెక్ డ్యాములు తెగిపోవడమే కాకుండా తీవ్ర ఆస్తినష్టం, ప్రాణనష్టం, పశువులు మృత్యువాత పడ్డాయని కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తు కింద పరిగణించి ఆర్థిక సాయం అందించాలని ఆయన కోరారు. నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకునేందుకు కలెక్టర్లు, సంబంధిత అన్ని శాఖల అధికారులకు నష్టాన్ని అంచనా వేసి రికార్డు చేయాలని మంత్రి ఆదేశించారు. అన్నదాతలు అధైర్య పడొద్దని రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని బాధిత కుటుంబాలకు మనోధైర్యం నింపారు. వరదల్లో గల్లంతైన ముగ్గురి ఆచూకీ కోసం ఎన్డిఆర్ఎఫ్, ఎస్డిఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యల్లో పాల్గొన్నాయని ఇప్పటివరకు డెడ్ బాడీలు దొరకలేదన్నారు. రికార్డు స్థాయిలో కొట్టిన వర్షం తీవ్రతను పరిశీలించేందుకు సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం ఏరియల్ సర్వే చేయనున్నట్లు మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ హైమావతి, ఆర్డీవో రామ్మూర్తి, గ్రంధాలయ చైర్మన్ లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ శివయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బంక చందు, కాంగ్రెస్ పార్టీ మాజీ పట్టణ అధ్యక్షులు అక్కు శ్రీనివాస్, పలు శాఖల ఉన్నతాధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యం ముఖ్యం : ఎమ్మెల్యే జారే

విశాలాంధ్ర - దమ్మపేట : ఏజెన్సీ మారుమూల ప్రాంతాలు కలిగి ఉన్న అశ్వరావుపేట నియోజకవర్గంలో ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. గురువారం దమ్మపేట మండలంలోని గండుగులపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ పరీక్షా శిబిరం విజయవంతంగా కొనసాగింది. ఆయన ప్రయత్నంతో చేపట్టిన ఈ శిబిరంలో హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో- అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ రీసెర్చ్ సెంటర్ వైద్య బృందం పరీక్షలు, చికిత్సలు చేసారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం వరకు వైద్య సేవలు అందించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి పురుషులు, మహిళలు, వృద్దులు అధికంగా హాజరై ఉచిత పరీక్షలు చేయించుకున్నారు. క్యాన్సర్ ఎలా వస్తుంది.. దాని మొదటి లక్షణాలు ఏమిటి... తీసుకోవాల్సిన జాగ్రత్తలగురించి వైద్యులు వివరించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే జారే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే ఆలోచనతో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అధికంగా పేద దిగువ మధ్య తరగతి రైతాంగం ఉండే ఇక్కడ ఏజెన్సీ గ్రామాల ప్రజలు హైదరాబాదు లాంటి నగరాలకు వెళ్లి చికిత్సలు చేయించుకోలేరని, అందుకే తాను ఇలాంటి శిబిరాలు నిర్వహిస్తున్నానని చెప్పారు. ఆర్థిక భారం తొలగించడం కూడా ఇలాంటి శిబిరాల ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. బసవతారకం హాస్పిటల్ యాజమాన్యానికి, వైద్యులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

లక్షలాది మందితో సీపీఐ బహిరంగ సభ

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : రాబోయే డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సిపిఐ పార్టీ వంద వసంతాల జాతీయ సభకు లక్షలాదిమంది తరలివస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం అన్నారు. పాల్వంచ మండలంలోని పాండురంగాపురంలో గురువారం సిపిఐ ఇంటింటి ప్రచారంలో భాగంగా కరపత్రాలు పంచుతూ విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా విశ్వనాథం మాట్లాడుతూ1925 డిసెంబర్ 26న ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ భారత గడ్డపై 100 ఏళ్ళు పూర్తి చేసుకుంటున్నట్లు చెప్పారు. భారతదేశానికి సంపూర్ణ స్వతంత్రం కావాలని తొలత గర్జించిన ఏకైక పార్టీ సిపిఐ మాత్రమే అని గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా సిపిఐ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయన్నారు. ఆనాటి నుండి నేటి వరకు అనేక ప్రజా ఉద్యమాలు చేసి త్యాగాలు అర్పించిన ఏకైక పార్టీ సిపిఐ అన్నారు. ఖమ్మం నగరంలో జరిగే జాతీయ సభ రాజకీయాలు, కులమతాలకు అతీతంగా ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ ప్రచారంలో సిపిఐ నాయకులు వీసం శెట్టి పూర్ణచంద్రరావు, మన్నెం వెంకన్న, పెద్ద వెంకటరామయ్య,కోటి తిరుపతయ్య, వెంకటరత్నం, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

2కే రన్‌లో యువత పాల్గొనాలి : డీఎస్పీ

విశాలాంధ్ర తొర్రూరు : సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ పోలీస్ ఆధ్వర్యంలో తొర్రూరు మున్సిపల్ పట్టణ కేంద్రంలో ఇది ఉత్త 2కె రన్ నిర్వహించడం జరుగుతుందనీ తొర్రూరు డిఎస్పీ కె కృష్ణ కిషోర్ గురువారం తెలిపారు. తొర్రూరు సబ్ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల యువతి, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని రన్‌ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరనీ కోరారు. శుక్రవారం ఉదయం 6:45 గంటల కు అంబేద్కర్ సెంటర్ నుంచి యూనియన్ బ్యాంక్, అన్నారం రోడ్డు మీదుగా జెడ్పిహెచ్ఎస్ హైస్కూల్ వరకు నిర్వహించ బడుతుందన్నారు. దేశ ఐక్యత, సమగ్రతకు గుర్తుగా జరుపుకునే ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజాప్రతినిధులు, మీడియా మిత్రులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు హాజరై దేశ ఏకతా స్ఫూర్తిని మరింత బలపరచాలని డి.ఎస్.పి కృష్ణ కిషోర్ తెలిపారు.

పంట నష్టం పరిశీలన

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : జిల్లాలో మొంథా తుపాన్ వల్ల ఏర్పడిన పంట నష్టాన్ని కలెక్టర్ జితేష్ వి పాటిల్ క్షేత్రస్థాయికి వెళ్లి గురువారం పరిశీలించారు. టేకులపల్లి మండలంలోని తంగిళ్ళ తండా గ్రామంలో ఆయన భారీ వర్ష ప్రభావంతో దెబ్బతిన్న వరి, పత్తి పంటలను ప్రత్యక్షంగా సందర్శించి నష్టాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు గాంధీకి చెందిన వరి పొలాన్ని సందర్శించి పంట పరిస్థితిని చేసారు. పొలంలో నీరు నిల్వ ఉండటం వల్ల పంట మరింత నష్టానికి గురయ్యే అవకాశం ఉన్నందున వెంటనే నీటి నిల్వను తొలగించాలాన్నారు. వరి కోతను త్వరితగతిన చేపట్టాలని రైతులకు సూచించారు. పంట నష్టాన్ని తగ్గించుకోవడమే కాకుండా రైతుల ఆర్థిక స్థితి దెబ్బతినకుండా చూడటం అత్యవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన కలెక్టర్ పత్తి సాగు చేస్తున్న రైతులు మునగ సాగు వైపు దృష్టి సారించాలని సూచించారు. మునగ సాగు చేయడం ద్వారా ఇప్పటికే జిల్లాలో చాలామంది రైతులు అధిక లాభాలను ఆర్జిస్తున్నారని వివరించారు. రైతులకు పంట రక్షణ, సమీకృత వ్యవసాయం వైపు దృష్టి సారించాలని కలెక్టర్ రైతంగానికి సూచనలు చేసారు. మునగ సాగు ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందాలన్నారు. అదేవిధంగా వరి సాగు చేసే రైతులు, ముఖ్యంగా బోరు సౌకర్యం ఉన్న వారు సగం భూమిలో ఆయిల్ పామ్ సాగు చేయడం ద్వారా దీర్ఘకాలికంగా అధిక లాభాలు పొందవచ్చని వివరించారు. రైతులు వ్యవసాయం పట్ల సృజనాత్మక దృష్టితో ముందుకు సాగుతూ పంటలతో పాటు కౌజు పిట్టల పెంపకం, మేకల, గేదెల, చేపల, కూరగాయల సాగు వంటి అనుబంధ జీవనోపాధులను అభివృద్ధి చేసుకోవడం ద్వారా ఆదాయం పెరుగుతుందని సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు బాబురావు, అన్నపూర్ణ, ఏ డిఏ లాల్ చంద్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నష్టపోయిన పంట పొలాలు పరిశీలన

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో: మొంథా తుపాన్ వల్ల ఏటూరునాగారం మండలంలో నష్ట పోయిన పంట పొలాలను,గురువారం కాంగ్రెస్ పార్టీ ఏటూరునాగారం మండల కమిటీ ఆధ్వర్యంలో సందర్శించిన్నట్లు, కాంగ్రెస్ పార్టీ ఏటూరునాగారంమండల కమిటి అధ్యక్షులు రఘు తెలిపారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ మంత్రి సీతక్క, ఆదేశాలమేరకు,జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచన మేరకు తుపాన్ వల్ల నష్ట పోయిన పంట పొలాలను పరిశీలించామని, మంత్రి సీతక్క రైతులు ఎవరు ఆందోళన చెంద వద్దని తెలిపారరు. నష్ట పోయిన పంటలను, వ్యవసాయశాఖ అధికారులు సర్వే చేసి ఇస్తారని, వాటిని మంత్రి ద్రుష్టికి తెచ్చి న్యాయం చేస్తామన్నారు. జిల్లా అధికార ప్రతినిధి ముక్కేర లాలయ్య, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వావిలాల నర్సింహారావు,మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు చేల వినయ్ కుమార్, వంగపండ్ల రవి తదితరులు పాల్గొన్నారు.

నూతన సీసీ రోడ్లను పరిశీలన : మంత్రి ధనసరి సీతక్క ఆదేశాల మేరకు, జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనలమేరకు,ఏటూరునాగారం మండలంలోని ముళ్లకట్ట గ్రామంలో నూతన సైడ్ డ్రైనేజీ పనులను, కాంగ్రెస్ పార్టీ ఏటూరు నాగారం మండల కమిటీ అధ్యక్షులు రఘు పర్యవేక్షించి,పనులను నాణ్యతతో చేపట్టాలని అన్నారు. జిల్లా యూత్ కార్యదర్శి ఎండి గౌస్ పాషా, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ డొంగిరి మధుబాబు,మండల సహాయ కార్యదర్శి ఈసం జనార్ధన్, సోనప కిరణ్,జోడే నర్సయ్య,గ్రామ కమిటీ అధ్యక్షులు తోలెం అర్జున్ పాల్గొన్నారు.

గౌరికుంటతండా సందర్శన

విశాలాంధ్ర- కొండమల్లేపల్లి : రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండల పరిధిలోని గౌరికుంట తండాకు వచ్చిన వరదలవల్ల ఇండ్లు నీటిలో మునగడం జరిగింది విషయం తెలుసుకున్న దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ సందర్శించారు తండావాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం కొరకు కొండమల్లేపల్లి నుంచి నల్గొండకు పోయే రోడ్డు గుండా గౌరీకుంట తండాకు నీళ్లు రాకుండా రహదారి గుండా ఐదు ఫీట్ల వెడల్పు గల సీసీ కాలువను నిర్మించడానికి వెంటనే నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. డ్యామేజ్ అయిన చెక్ డాం నిర్మాణం చేపట్టాలని విజయలక్ష్మి ఫంక్షన్ హాల్ వల్ల వరదనీరు డైవర్షన్ అయ్యి తండా మీదకు రాకుండా కాలువని నిర్మించాలని సూచించారు. ఎన్నో సంవత్సరాలుగా ఇబ్బంది పడుతున్న గౌరికుంట తండావాసులు ఎమ్మెల్యే బాలు నాయక్ అధికారులకు పనులు ఆదేశించడంతో ధన్యవాదాలు తెలిపారు. ఆర్డిఓ రమణారెడ్డి, కొండమల్లేపల్లి తహసిల్దార్ నరేందర్, ఆర్ ఐ శ్రీను, పంచాయతీ సెక్రెటరీ డాకు నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డి, పిఎసిసి చైర్మన్ డాక్టర్ దూదిపాల వేణుధర్ రెడ్డి, ఉట్కూరు వేమన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం నివేదిక ఇవ్వాలి : కలెక్టర్

విశాలాంధ్ర-సూర్యాపేట బ్యూరో : జిల్లాలో భారీ వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం ఉంటే వెంటనే నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్‌పవార్ అధికారులను ఆదేశించారు.గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో ఆయన సమావేశమై పరిస్థితులను సమీక్షించారు. మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లాలో అధిక వర్షపాతం నమోదైనప్పటికీ, ముందస్తు అప్రమత్తతతో ధాన్యపు రాశులపై టార్పాలిన్ కప్పడం వల్ల పెద్ద నష్టం జరగలేదని కలెక్టర్ పేర్కొన్నారు. ఎక్కడైనా అడుగు భాగంలో లేదా అంచుల్లో ధాన్యం తడిస్తే వెంటనే మిల్లులకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి ప్రత్యేక అధికారిని ఇన్‌ఛార్జిగా నియమించి, తహసీల్దార్లు, మండల ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. ధాన్యం నిల్వ ఉన్న ప్రతి కేంద్రం నుంచి రోజువారీ నివేదిక తప్పనిసరిగా సమర్పించాలని కలెక్టర్ సూచించారు. తడిసిన లేదా కొట్టుకుపోయిన ధాన్యం పై వెంటనే సమాచారం అందించాలని చెప్పారు. కలెక్టరేట్‌లో 24 గంటల కంట్రోల్ రూమ్ (ఫోన్ నెంబర్: 6281492368) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులు తమ పరిధిలోని బ్రాయిలర్ మిల్లులను సందర్శించి తడిసిన ధాన్యాన్ని అక్కడికి తరలించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బి శాఖ అధికారులు రోడ్లు, కల్వర్టులు, బ్రిడ్జిలు దెబ్బతిన్న చోట తక్షణమే పునరుద్ధరణ పనులు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో 80 శాతం చెరువులు పూర్తిగా నిండిపోయాయని, మిగిలినవి 75 శాతం వరకు నిండినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ కే. నర్సింహ, అదనపు కలెక్టర్ కె. సీతారామరావు, జెడ్పీ సీఈవో వి.వి. అప్పారావు, వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, డిపిఓ యాదగిరి, ఆర్అండ్‌బి ఈఈ సీతారామయ్య, పంచాయతీరాజ్ ఈఈలు వెంకటయ్య, మాధవి, ఇరిగేషన్ ఎస్‌సీ శివధర్మ, డీఎస్ఓ మోహన్ బాబు, డీఎం రాము, డీసీఓ పద్మ, రవాణా అధికారి జయప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన పత్తి పంటకు మద్దతు ధర

విశాలాంధ్ర బ్యూరో నిర్మల్ జిల్లా : నాణ్యమైన పత్తి పంటకు రైతులందరికీ మద్దతు ధర లభిస్తుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం నిర్మల్ శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్‌రెడ్డితో కలిసి, పట్టణంలోని కేదార్నాథ్ జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పత్తి పంట కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని వివరించారు. పత్తి రైతులందరికీ ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం మద్దతు ధర అందివ్వాలని అన్నారు. రైతులు పండించిన పంటను మొత్తం సిసిఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ద్వారానే సేకరించాలని అన్నారు. రైతులు పంటను అమ్మిన వెంటనే వారి ఖాతాల్లోకి డబ్బులు జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని వివరించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లను చేయాలని సూచించారు. ప్రభుత్వం పత్తి పంటకు క్వింటాకు 8 వేల 110 రూపాయల మద్దతు ధర అందిస్తుందని అన్నారు. పత్తి పంట అమ్మకంలో రైతులకు ఇబ్బందులు కలగకూడదని నిర్మల్ శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. రైతులందరికీ ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధరను అందించాలని పేర్కొన్నారు. తేమ నిర్ధారణ పారదర్శకంగా జరగాలని చెప్పారు. రైతులకు తమ పంటను అమ్మేందుకుగాను కపాస్ కిసాన్ యాప్ స్లాట్ బుకింగ్ గురించి అవగాహన కల్పిస్తూ ఉండాలని చెప్పారు. పత్తి పంట కొనుగోలులో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. పత్తి పంట కొనుగోలు విధానాన్ని కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలించారు. అంతకుముందు పత్తి పంట కొనుగోలు ప్రారంభోత్సవానికి వచ్చిన కలెక్టర్, ఎమ్మెల్యేలకు జిన్నింగ్ మిల్లు నిర్వాహకులు పూల మొక్కలు అందజేసి స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి, వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్, వ్యవసాయ శాఖ అధికారి అంజిప్రసాద్, ఇతర అధికారులు, సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఎస్ఐ రాజకుమార్

విశాలాంధ్ర గూడూరు: కొత్తగూడ మండలంలోని కిష్టపురం గ్రామంలో గురువారం బూర్క ప్రశాంత్ గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతు మృతి చెందారు వారికి నేనున్నానంటూ ముందుకు వచ్చిన కొత్తగూడ ఎస్ఐ రాజుకుమార్ రూ.4వేల ఆర్థిక సహాయాన్ని ఆ కుటుంబానికి అందజేశారు. ప్రశాంత్‌కు ఒక కుమారుడు కుమార్తె ఉన్నారు. ఆర్థిక పరిస్థితుల రీత్య ఆ కుటుంబం కటిక పేదరికంలో ఉన్నదని తెలుసుకున్న ఎస్ఐ రాజకుమార్ తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ప్రజల కోసం రెయిన్ పగలు కష్టపడుతూ ప్రజల రక్షణ కోసమే ముందుండే ఎస్ఐ రాజకుమార్ పేద కుటుంబాలకు సహాయం చేయడంలో కూడా మరొక అడుగు ముందే ఉంటు న్నాడు. పజల రక్షణే కాకుండా వారి ఆకలి తీర్చే ఆపద్బాంధవుడు అయ్యాడనీ కొత్తగూడ మండలంలో ప్రతి ఒక్కరూ ఎస్ఐ రాజకుమార్ మృదుస్వభావి అయినవారుగా గొప్పగా చెప్పుకుంటున్నారు.

ధాన్యం కొనుగోలులో అవినీతికి పాల్పడితే క్రిమినల్ కేసులు

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల జిల్లా: ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరతో రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలు చేస్తుందని, ఈ ప్రక్రియలో అవినీతికి పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ (సి. ఎస్.) శశిధర్ రాజు తెలిపారు. 2024- 25 రబీ సీజన్ వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో జిల్లాలోని జైపూర్ మండలం నర్సింగాపూర్ గ్రామంలో డిసిఎంఎస్ ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో పాటు అవకతవకలలో భాగస్వామ్యులైన రామారావు పేట గ్రామంలోని సుముఖ అగ్రో ఇండస్ట్రీస్ యజమానులు, మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణాధికారి, 8 మంది రైతులు, ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్ లపై రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య ఆదేశాల మేరకు పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ జైపూర్ పోలీస్ స్టేషన్ లో 316 క్లాస్ 5, 318 క్లాస్ 4 సెక్షన్ల కింద క్రిమినల్ కేసు నంబర్ 207/25 నమోదు చేశారని తెలిపారు. ఈ కేసులో రూ. 1 కోటి 39 లక్షల ప్రజాధనం దుర్వినియోగం చేశారని, జిల్లాలో 740 ఎకరాలలో 6 వేల 322.6 క్వింటాళ్ల ధాన్యమును 8 మంది రైతుల వద్ద నుండి కొనుగోలు చేసి రూ.1 కోటి 39 లక్షల రూపాయలు జమ చేసినట్లుగా ఆన్లైన్ ప్యాడి ప్రొక్యూర్ మెంట్ మేనేజ్మెంట్ సిస్టంలో తప్పుడు సమాచారాన్ని నమోదు చేశారని, వీటితో పాటు రవాణా ఖర్చుల కింద రూ.1.90 లక్షల ట్రక్ చిట్టీలు సృష్టించి నమోదు చేశారని తెలిపారు. జైపూర్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయడం జరిగిందని, పోలీసు శాఖ ఆధ్వర్యంలో దర్యాప్తు కొనసాగుతుందని తెలిపారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో ఎవరైనా అవకతవకలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓ. ఎస్. డి. శ్రీధర్ రెడ్డి, ఇన్స్పెక్టర్ అజయ్ బాబు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు

విశాలాంధ్ర బ్యూరో -పెద్దపల్లి: పెద్దపల్లిజిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె. అరుణ శ్రీ, డి.సి.పి కరుణాకర్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ బి.వనజ లతో కలిసి రోడ్డు ప్రమాదాల నియంత్రణ పై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ గత సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం సుల్తానాబాద్, పెద్దపల్లి, బసంత్ నగర్, ఎన్.టి.పిసి, గోదావరిఖని 1 టౌన్ లో అధికంగా ప్రమాదాలు జరిగే 28 హాట్ స్పాట్ లను గుర్తించి 27 లక్షలతో ఎల్.ఈ.డి. హై మాస్ లైట్ లను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. బసంత్ నగర్ లో మరో 2 చోట్ల 5 లక్షల రూపాయలతో హై మాస్ లైటింగ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని పట్టణంలో 15 లక్షల ఖర్చుతో నూతన ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేశామని అన్నారు. రోడ్డు పై వాహనాల వేగాన్ని తగ్గించేం దుకు అవసరమైన మేర స్ప్రింక్లర్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. రోడ్డు పై పశువులు విడిచిపెట్టే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తూ రూ.10 వేలు జరిమానా విధించాలని, పశువులను గోశాలలకు తరలించాలని అన్నారు. ఈ సమావేశంలో పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి గంగయ్య, ఈఈ ఆర్ అండ్ బి భావ్ సింగ్ , పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, ఏసీపీలు రమేష్ ,కృష్ణ, కలెక్టరేట్ పర్యవేక్షకులు బండి ప్రకాష్, ట్రాఫిక్ ఏసిపి , సిఐ, ఎస్ఐ లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ కృషివల్లే జాబ్స్ అవకాశం



విశాలాంధ్ర - కొత్తగూడెం : సింగరేణిలో అనారోగ్యంతో మెడికల్ అన్ ఫిట్ ఐన మైనింగ్ స్టాఫ్, ట్రేడ్స్ మెన్‌లకు ఏఐటియుసి కృషి వల్ల సర్ఫేస్‌లో సూటబుల్ జాబ్ ఇచ్చేందుకు సింగరేణి యాజమాన్యం గురువారం ఆదేశాలు జారీ చేసిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటీయుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ ఒక ప్రకటన లో పేర్కొన్నారు. సింగరేణి సంస్థలో గతంలోను ఏఐటీయుసి హయాం లో ఈ సూటబుల్ జాబ్ ఇచ్చే వారని కానీ 2018 మార్చి నుంచి దానిని నిలిపి వేసి సర్ఫేస్‌లో జనరల్ మజ్దూర్, క్యాటగిరి వన్‌లో పోస్టింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. దీని వల్ల సింగరేణిలో చాలా మంది మైనింగ్ స్టాఫ్, ట్రేడ్స్ మెన్స్ చాలా మానసికంగా, ఆర్థికంగా నష్టపోయారని తెలిపారు. దీనికి కారణం అప్పటి గుర్తింపు సంఘంగా వున్న టిబిజికెఎస్ నేతలు సింగరేణి అవలంబించిన కార్మిక వ్యతిరేక విధానాలను అడ్డుకోవడంలో వైఫల్యం చెందినందుకే మైనింగ్ స్టాఫ్, ట్రేడ్స్ మెన్స్ కు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆయన ఆరోపించారు. అప్పట్లో ఎన్నో సార్లు వీరి గురించి ఏఐటియుసి అనేక విధాలుగా ఆందోళన కార్యక్రమాలు, పోరాటాలు చేపట్టినట్లు తెలిపారు. సింగరేణి లో 2023 లో జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో సూటబుల్ జాబ్ ఇప్పిస్తామని ఏఐటియుసి ఇచ్చిన హామీ మేరకు యాజమాన్యం పై ఒత్తిడి చేసిదన్నారు. నవంబర్ 28,2024 న జరిగిన డైరెక్టర్ ఫా స్థాయి స్ట్రక్చర్ కమిటీ సమావేశం, మార్చి 7, 2025 న సి అండ్ ఎండి స్థాయి సమావేశం లో పట్టుబట్టి గత ఒప్పందాన్ని అమలు చేయాలని డిమాండ్ చేయడం జరిగిందన్నారు. యాజమాన్యం దీనిపై అంగీకరించి ఒక కమిటీ వేసి ఇపుడు పరిష్కారం చేసినట్లు చెప్పారు. ఈ కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం మార్చి 2018 నుండి జూలై 2025 వరకు జరిగిన కార్పొరేట్ మెడికల్ బోర్డు లో అండర్ గ్రౌండ్ లో అన్ ఫిట్ ఐన మైనింగ్ స్టాఫ్, ట్రేడ్స్ మెన్స్ కు సర్ఫేస్ లో సూటబుల్ జాబ్ ఇచ్చేందుకు యాజమాన్యం గురువారం ఆదేశాలు జారీచేసిందన్నారు. ఇది గుర్తింపు సంఘంగా ఏఐటియుసి సాధించిన ఘన విజయమన్నారు. రాబోయే కాలంలో మిగతా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం జరుగుతుందని స్పష్టం చేసారు.

సంపాదకీయం

వ్యూహాత్మక తొలగింపులు!

ప్రపంచ సాంకేతిక రంగంలో ఉద్యోగ కోతలు, లేఆఫ్‌లు, స్వచ్ఛంద ఉద్యోగ విరమణలు అనూహ్యంగా పెరిగిపోయాయి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరుతో విదేశాలకు పరుగులు తీసిన భారతీయ యువత అంతేవేగంతో ఇప్పుడు ఇంటిముఖం పట్టాల్సి వస్తున్నది. టెక్ రంగంలో ఆర్థిక మాంద్యం, కృత్రిమ మేధ లక్షలాది ఉద్యోగుల తొలగింపునకు ప్రధాన కారణాలుగా నిలిచాయి. దిగ్గజ సంస్థల్లో ఒకటైన ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ యూట్యూబ్ తాజాగా వాలంటరీ ఎగ్జిట్ ప్లాన్‌ను ప్రకటించింది. అంటే ఉద్యోగులను బలవంతంగా తొలగించక ముందే, స్వచ్ఛందంగా వెళ్లిపోవడమన్నమాట! కృత్రిమ మేధ దూసు కొస్తున్న నేపథ్యంలో యూట్యూబ్ భారీ మార్పులకు సిద్ధమవుతోంది. అందులో భాగంగానే సీఈవో నీల్ మోహన్ స్వచ్ఛంద పదవీ విరమణ పథకాన్ని ప్రవేశపెట్టారు. అయితే ఎంతమంది ఉద్యోగులపై వేటుపడుతుందో ఇంకా నిర్ధారణకాలేదు. ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ అమెజాన్ తన గ్లోబల్ లేఆఫ్‌లో భాగంగా భారత్‌లో 800-1000 మంది ఉద్యోగులను తొలగించడానికి రంగం సిద్ధం చేసింది. తన కార్పొరేట్ విభాగంలో ప్రపంచవ్యాప్తంగా 14,000 మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ముఖ్యంగా ఫైనాన్స్, మార్కెటింగ్, మానవ వనరులు, టెక్ విభాగంలో తొలగింపులు ఉండొచ్చని తెలిసింది. ఇప్పటికే అమెజాన్ 2022 చివర్లో, 2023 ప్రారంభంలో సుమారు 27,000 మందికిపైగా ఉద్యోగులను తొలగించింది. ఇంకో దిగ్గజ కంపెనీ మెటా (ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్) 2022-23లో 21,000 మందిపై వేటువేసింది. ఆల్ఫాబెట్ (గూగుల్) 2023లో సుమారు 12,000 మందికిపైగా ఉద్యోగులను తీసేసింది. మైక్రోసాఫ్ట్ సంస్థ 2023లో 10,000 మందిని, 2024లో గేమింగ్ వంటి విభాగాల్లో వేలాది మందిని తొలగించింది. సిస్కో 2024లో సుమారు 10,000 మందిని, టెస్లా సుమారు 14,500 మంది ఉద్యోగులను ఇంటికి పంపించేసింది. 2025లో ఇవే కంపెనీలు తమ తదుపరి దశ లే-ఆఫ్‌లను ఇప్పటికే ప్రకటించాయి. ఏ క్షణాన్నయినా వేటు పడవచ్చు. 2023లో ప్రపంచవ్యాప్తంగా దాదాపు 1,193 టెక్ కంపెనీల్లో 2,64,220 మందికిపైగా ఉద్యోగులను తొలగించినట్లు లేఆఫ్స్ డాట్ ఫై డేటా చెపుతోంది. ఇక 2024లో సుమారు 551 టెక్ కంపెనీల్లో 1,52,922 మందికిపైగా ఉద్యోగులను తొలగించారు. ఇకపై సాంకేతిక రంగంలో ఉద్యోగుల తొలగింపు అనేది సర్వసాధారణ పదంగా మారనున్నదని నిపుణులు చెపుతున్నారు. ప్రపంచ టెక్నాలజీ రంగం ప్రస్తుతం తీవ్రమైన, నిర్మాణాత్మకమైన మార్పు దశను ఎదుర్కొంటోంది. 2022 నుంచి 2023 వరకు కేవలం ఆర్థిక మాంద్యం కారణంగా జరిగిన తాత్కాలిక తొలుగింపుల దశ నుంచి, 2024-2025 నాటికి ఈ రంగం పూర్తిగా వ్యూహాత్మకమైన, కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత పునర్నిర్మాణ దశకు మారింది. ఈ మార్పు కేవలం ఉద్యోగుల సంఖ్యను తగ్గించడం మాత్రమే కాదు, కంపెనీల నిర్వహణ నమూనాలను, భవిష్యత్తు కోసం మూలధనాన్ని కేటాయించే విధానాన్ని కూడా సమూలంగా మార్చేస్తోంది. కృత్రిమమేధకు అనుగుణంగా పదేళ్లలో తొలిసారి యూట్యూబ్ తన ప్రొడక్ట్ డివిజన్‌ను పునర్నిర్మిస్తున్నట్లు సిబ్బందికి పంపిన నోట్‌లో పేర్కొంది. బలవంతపు తొలగింపులు చేయకుండా, కంటెంట్ క్రియేషన్, యూజర్ ఎక్స్‌పీరియన్స్‌లో ఏఐ పాత్రను దృష్టిలో ఉంచుకొని వాలంటరీ ఎగ్జిట్ ప్లాన్‌ను తీసుకొచ్చినట్లు చెప్పుకుంది. ఇప్పటికే క్రియేటర్లు, భాగస్వాములకు 100 బిలియన్ డాలర్లకు పైగా చెల్లించిన యూట్యూబ్ ప్లాట్‌ఫామ్‌లో ప్రతి విభాగాన్ని మార్చగల సామర్థ్యం ఏఐకు ఉందని గుర్తించింది. దానిని అందిపుచ్చుకునేలా మార్పులు ఉండాలంటే ఉద్యోగుల తొలగింపు, లేదా తగ్గింపు అనివార్యంగా గూగుల్ భావిస్తున్నది. యూట్యూబ్ పునర్నిర్మాణంలో భాగంగా... ప్రొడక్ట్ డివిజన్‌ను వ్యూయర్ ప్రొడక్ట్స్, క్రియేటర్ అండ్ కమ్యూనిటీ ప్రొడక్ట్స్, సబ్‌స్క్రిప్షన్ ప్రొడక్ట్స్ వంటి మూడు విభాగాలుగా విభజించనుంది. కొత్త మార్పులు నవంబర్ 5 నుంచి అమల్లోకి రానున్నాయి. అంటే ఆ క్షణం నుంచే ఉద్యోగుల కోత మొదలవుతుంది. ఇప్పటికే అమెజాన్, మెటా, మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ సంస్థలు ఏఐపై భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. తమ శ్రామికశక్తి విషయంలో పునరాలోచిస్తున్నాయి. భారీ సంఖ్యలో లేఆఫ్‌లు ప్రకటిస్తున్నాయి. ఏఐ టూల్స్‌ను సమర్థవంతంగా వినియోగించి, ఉత్పాదకతను పెంచాలని గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ తన బృందాలకు సూచించడంలోనే లే-ఆఫ్‌లు ఏ స్థాయిలో ఉంటాయో అర్థం చేసుకోవచ్చు.

2022 ప్రారంభం నుంచి 2025 అక్టోబర్ వరకు అమెరికా సాంకేతికరంగ ఉద్యోగులు 400,000 మందికి పైగా ఉద్యోగాలు కోల్పోయారు. ఇది డాట్-కామ్ బస్ట్ తర్వాత పరిశ్రమ ఎదుర్కొంటున్న అతిపెద్ద ఉద్యోగ కోతగా నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రస్తుత ఉద్యోగ కోతలు కేవలం ఖర్చుల తగ్గింపు కోసం కాకుండా, మరింత సమర్థవంతంగా పనిచేయడానికి, సంస్థల్లోని అనవసరమైన పొరలను (ఉద్యోగ శ్రేణులను) తొలగించడానికి, ఏఐ, క్లౌడ్ మౌలిక సదుపాయాలలో భారీగా పెట్టుబడులు పెట్టడానికి ఉద్దేశించిన రక్షణ చర్యలుగా ఆయా కంపెనీలు చెప్పుకుంటున్నాయి. అమెజాన్ మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలు బలమైన ఆర్థిక పనితీరును కొనసాగిస్తూనే కోతలను ప్రకటిస్తున్నాయి. ఈ తొలగింపులు వెనుక మాంద్యం భయం కంటే వ్యూహాత్మక మార్పు అధికంగా ఉందని చెపుతున్నాయి. అయితే, భారతీయ మార్కెట్ వైరుధ్యం కాస్త విస్తుగొలిపే అంశమే. భారతీయ ఐటీ సేవల రంగంలో, 'సైలెంట్ లేఆఫ్‌లు' (నిశ్శబ్ద తొలగింపులు) అనే పద్ధతి విస్తృతంగా వ్యాపించింది. ఇవి ఉద్యోగులను రాజీనామా చేయమని ఒత్తిడి చేయడం లేదా పనితీరు సమీక్షల పేరుతో రహస్యంగా తొలగించడం వంటి పద్ధతులు అవలంబిస్తున్నారు. 2021లో వెంచర్ ఫండింగ్ శిఖరస్థాయికి చేరింది. ఆ తర్వాత అది పతనమైంది. అప్పటినుంచి వెంచర్ తోడ్పాటుగల స్టార్టప్ కంపెనీలు తమ నగదు నిల్వలను కాపాడుకోవడానికి, ఖర్చులు తగ్గించుకోవడానికి ఉద్యోగులను తొలగిస్తున్నాయి. ఈ పరిణామం ప్రమాదకర హేతువు. రెండేళ్లలో సుమారు 95 భారతీయ స్టార్టప్‌లు దాదాపు 31,965 మంది ఉద్యోగులను తొలగించాయి. నిజానికి, సామూహిక తొలగింపులకు సంబంధించిన కఠినమైన చట్టపరమైన నిబంధనల నుంచి తప్పించుకోవడానికి, అధిక-డిమాండ్ నైపుణ్యాలు లేని మిగులు సిబ్బందిని తగ్గించడానికి ఈ వ్యూహాన్ని ఉపయోగించడం పరిపాటిగా మారింది. ఏదేమైనప్పటికీ, నిర్మాణాత్మక పునర్వ్యవస్థీకరణ పేరుతో భారీ తొలగింపులు చేపట్టడం బాధాకరం. రానున్న రోజుల్లో సాంకేతిక రంగంతోపాటు ఏఐ ప్రభావితమయ్యే ప్రతి రంగంలోనూ ఉద్యోగుల తొలగింపు అనివార్యమవుతుందని చెపుతూ ఉండటం ఆందోళనకరం. ఉద్యోగ కోతలకు చోదకశక్తులుగా పరిణమించిన కృత్రిమ మేధ, ఆటోమేషన్‌లను ఇప్పటికిప్పుడు ఆపలేకపోయినప్పటికీ, తొలగింపులపై కార్మిక, ఉద్యోగ అనుకూల విధానాలు అవశ్యం. జనరేటివ్ ఏఐ సృష్టించిన నయా విపత్తుపై ప్రపంచ కార్మిక, ఉద్యోగ సంఘాలు ప్రత్యేకంగా దృష్టిపెట్టి, కార్యాచరణకు పూనుకోవాల్సిన తరుణం ఆసన్నమైంది.

కలలో దేవుడు

ఇక ఆపవయ్యా నువు అడిగితే నేను చెప్పాలా చాలు గాని ఇక ఆపు. ఏంటి బావ ఎవరిని ఇక చాలు ఆపు అంటున్నావు. ఎవరా ఆయనెవరో రాత్రి కలలోకొచ్చి నే చెప్పినట్లు చెయ్యడం లేదు అందుకే కష్టాల ననుభవిస్తున్నావు అంటాడు. నువు ఎవరివయ్యా అంటే నేనే నువ్వు, నువ్వే నేను నిన్ను లాలించి పాలించి ఆడించేది నేనే అంటాడు. నాకు కోపమొచ్చి నీ పేరేమిటో చెప్పకుండా నీ సొద ఏమిటయ్యా అంటే నా పేరు దేముడు అన్నాడు. అయితే ఇప్పుడు నన్నేం చెయ్యమంటావు. చూడు చేసేది నీవు చేయించేది నేను అన్నాడు. సరే ఇక వెళ్లవయ్యా. అంటే ఎక్కడికి వెళ్లాలి. నేను నీలోనే ఉన్నాను. ప్రతి మనిషిలో ఉన్నాను. ఆ జగత్తులో ప్రతి అణువణువునా ఉన్నానంటాడు. అయితే ప్రతి మనిషిలో ఉన్నావా. మళ్లీ అదేమి ప్రశ్న అణువణువునా ఉన్నానంటే ప్రతి మనిషిలోనే కాదు. ప్రతి జీవిలో ఉన్నాను. అలాగా అయితే ఇన్ని దుర్మార్గాలు చేయించేది చేసేది నీవేనన్న మాట. అవును ఈ చరాచర జగత్తుకు మూల కారకుడిని నేనే. నాకు తెలియకుండా ఏమీ జరగదు. నవ్వించేది నేనే, ఏడిపించేది నేనే. మంచి చేయించేది నేనే, తప్పులు, దుర్మార్గాలు చేయించేది నేనే. నీలో ఉన్నది నేనే. నువ్వు ఏం చేసినా చేయించేది నేనే. అలారా దారికి. మా ఇక్కట్లకు కారణం నీవే అన్న మాట. నీ కసలు వేరే పని లేదా మా వెంట పడ్డావు. ముల్లోకాలలో మా భూలోకమే దొరికిందా నీకు. మేము పిచ్చివాళ్లం కనుక దేముడంటే అందరి కష్టాలు తొలగించి కాపాడేవాడని చేతిలో పైసలు లేకపోయినా నీకు మొక్కడానికి తిరుపతి ఇతర దేవాలయాల చుట్టూ తిరుగుతున్నాం. కాని నువు డబ్బున్న వాళ్ల పక్షపాతివని వాళ్లిచ్చే డబ్బులు, ఆభరణాలు తీసుకొని వాళ్లకే ఉపయోగపడతావని మాకు అర్థమయింది. అదిసరే భక్తా అసలు నీ బాధ

ఏంటి. బాధేమిటని చిన్నగా, నెమ్మదిగా అడుగుతావేంటి. సర్వాంతర్యామిని అన్నావుగా. మేమెలా బతుకుతున్నామో నీకు కనబడటం లేదా.

ఆగవయ్యా అంత కోపమెందుకు. ప్రతి మనిషి నొసటన రాసేది నేనే. దాన్ని బట్టి మీ కార్యాచరణ ఉంటుంది. అయితే మమ్మల్ని ఈ గుడిసెలో, కొందరిని అయిదు అంతస్థుల భవనాలలో ఉంచి మాకు తిండి లేకుండా చేసి ఆనందపడటంలో ఆంతర్యమేమిటి. అందరిలో ఉన్నాను. ఎవరితో ఏమి చేయించాలో నాకు తెలుసు అంటావు. మరి మా అవసరాలు తీర్చమని ఎన్నుకున్న శాసనసభ్యులు మంత్రులు ప్రజల సొమ్ముతో జల్సాలు చేస్తూ కోట్ల రూపాయలు ప్రజా ధనం దోచుకుంటుంటే నువ్వు చోద్యం చూస్తున్నావా. మరిచాను ఆ పని కూడా నీవే చేయిస్తున్నానన్నావుగా. నువు నిమిత్తమాత్రుడువనుకొని మా ఖర్మకొద్ది మేం అనుభవిస్తున్నామనకొంటున్నాం. కాని ఓ దేవుడా తమరే సెలవిచ్చారుగా ప్రతి మనిషిలో నీవే ఉండి అన్ని పనులు నీవే చేయిస్తున్నావని చెప్పావుగా. మాకే బుద్ధి లేక నీవు మా ఆశలు నెరవేర్చే వాడివని గుడ్డిగా నమ్మి రోజూ గుడిలోనో, ఇంట్లోనో నీకు ముకుళిత హస్తాలతో నమస్కరించి కాపాడమని కోరుతున్నాం. ఎంత అమాయకులమో. నిన్ను గుడ్డిగా నమ్మి మేమేదో తప్పులు చేసి అనుభవిస్తున్నామని మమ్మల్ని దోచుకునే వాళ్ల మాటలు, సర్వ రక్షకుడవయిన నీ మాటలు నమ్మి తింటానికి తిండిలేకపోయినా నిన్ను కొలిచినందుకు మా చెంపలు మేము వాయించుకుంటూనే ఉన్నాం.

ప్రతి గ్రామంలో ప్రభుత్వం మా సొమ్ముతో ఒక గుడి కట్టి అందులో నిన్ను ప్రతిష్ఠించి ప్రతిరోజు నీకు మొక్కి మా ఖర్మ ఇంతే అనుకోమని నేతలు చెబుతుంటే నీవు వాళ్లతో అలా చెప్పిస్తున్నావని ఇప్పుడు నీవు చెబితే తెలిసింది. ఈ దుర్మార్గాలన్ని నీవే చేయిస్తున్నా ఇంకా గుడ్డిగా నిన్ను నమ్మి నీకు మొక్కడం మా బుద్ధిలేని పని. ఎవర్నీ నమ్మవద్దు నీ కష్టానికి తగిన కూలి ఇవ్వకపోతే తిరగపడండని చెప్పే వాళ్ల మాట పెడచెవిని పెట్టి వామపక్ష పార్టీలను దూరంపెట్టి నీవు చెప్పినట్లు మోసగాళ్లను ఎన్నుకున్నందుకు మా చెంపలు మేమే వాయించుకోవాలి. ఇక నిన్ను నమ్మం. మాకు ద్రోహం చేసే దేవుడ్ని మేము ఎందుకు నమ్మాలి. ఇక దేవుడు లేడని మన కోసం మనం పోరాడాలని ప్రతి గ్రామం తిరిగి మాకు అన్యాయం చేసే వాళ్లపై తిరగబడతాం. అందుకు సహకరించే పార్టీలను ఆహ్వానిస్తాం. ఇక ఈ ప్రభుత్వాలతో నీవు చేయించే దుర్మార్గాలకు స్వస్తి పలుకుతాం. అంతేకాదు దేవుడున్నాడని నమ్మవద్దు అని మన చేతులు, కాళ్లే మన దైవాలని మన శక్తిని మనం విస్మరించి దేవుని మీద భారం వేసి మోసపోయామని ప్రచారం మొదలుపెడతాం. దేవున్ని అడ్డం పెట్టుకుని మోసగించే వారి భరతం పడతాం. ఎవర్ని నమ్మకుండా మా శక్తిని మేమే నమ్ముకుని ముందుకు సాగుతాం. అంతేకాదు మనకు ఇతరంగా ఏ శక్తి లేదని ప్రచారం చేస్తాం. అయినా మాలోనూ నీవు ఉన్నావని చెప్పినా, గుళ్ల చుట్టూ తిరగడం మాదే తప్పు. ఉన్న కష్టాలు చాలక తుపాన్లు సృష్టించి ఉన్న పూరి గుడిసెలు కూలుస్తావు. ప్రభుత్వం మా సొమ్మే మాకు బిక్ష వేసినట్లు ఇవ్వడం దాంతో నిన్ను కొలిచినట్లు వారి ఫొటోలు పెట్టుకుని వారిని కొలవడం ఇదంతా నీ పనే అని మా కర్థమయింది. ఇక మా హృదయాల్లో నీకు స్థానం లేదు. ఇక నడువ్. కలలో కొచ్చి మా కళ్లు తెరిపించినందుకు ధన్యవాదాలు.

సెల్: 9885569394

వేతన, పెన్షన్ల నియంత్రణకే ఆ నిబంధనలు!

సంగిరెడ్డి హనుమంత రెడ్డి.

పదినెల్ల తర్వాత అక్టోబరు 28న కేంద్ర మంత్రివర్గం 8వ వేతన యంత్రాంగ సూచన నిబంధనలను నిర్ణయించింది. ఈ ఏడాది జనవరి16 న కేంద్ర మంత్రివర్గం వేతన యంత్రాంగాన్ని ప్రకటించింది. కాని సభ్యులను నియమించలేదు. సూచన నిబంధనలను నిర్ణయించలేదు. ఈ పనికి 10 నెలలు ఎందుకో దేవపుత్రులకే తెలుసు. కేవలం వేతన యంత్రాంగ ప్రకటన ఎందుకో ఏలినవారికే ఎరుక. 8 వ వేతన యంత్రాంగ తాత్కాలిక సంస్థ అధ్యక్షురాలిగా న్యాయమూర్తి రంజన ప్రకాశ్ దేశాయ్, పాక్షిక సమయ సభ్యులుగా పులక్ ఘోష్, సభ్య కార్యదర్శిగా పంకజ్ జైన్ వ్యవహరిస్తారు. 18 నెల్లలో సిఫారసులను అందిస్తారు. అవసరమనిపిస్తే ఏవైనా విషయాలపై మధ్యంతర నివేదికలను ఇవ్వచ్చు. ఆధునిక సాంకేతిక యుగంలో ఈ పనులకు 18 నెల్లకాలం ఎక్కువ. న్యాయమూర్తి రంజన ప్రకాశ్ దేశాయ్ రాజ్యాంగ, పౌర, నేర చట్టాల, లింగ న్యాయ, మానవ హక్కుల నిపుణురాలు. ఆమెకు ఆర్థిక అంశాల్లో పట్టులేదు. బాంబే హైకోర్టులో న్యాయవాది కాలమంతా ఆమె ప్రభుత్వ న్యాయ పదవుల్లో ఉన్నారు. పదవీ విరమణ తర్వాత 2014 డిసెంబరు 1 నుంచి జమ్మూ, కశ్మీర్ నియోజకవర్గ పునర్విభజన, లోక్‌పాల్ నియామకాల అధ్యక్షురాలు వంటి ప్రభుత్వ పదవుల్లో పనిచేశారు. ప్రస్తుతం గుజరాత్ ఏకీకృత పౌర స్మృతి నిపుణుల కమిటీ అధికారి. ఈమె ఉద్యోగుల జీతాలు, పెన్షన్లలో ప్రభుత్వ పక్షం వహించకుండా ఉండగలరా? బెంగళూరు భారతీయ నిర్వహణ సంస్థలో పనిచేస్తున్న ఆచార్య పులక్ ఘోష్ సాంకేతిక ఆర్థికవేత్త. గతంలో ప్రధాని ఆర్థిక సలహా మండలి సభ్యులు. జీవితమంతా బహుళజాతి సంస్థలకు, ప్రభుత్వ సంస్థలకు సలహాదారుగా వ్యవహరించారు. ఆయన ఉద్యోగుల అనుకూల సిఫారసులు చేయలేరు. ఈ ఏడాది డిసెంబరు 30 న పదవీ విరమణ చేయనున్న ఐఏఎస్ అధికారి పంకజ్ జైన్ ఇప్పుడు పెట్రోలియం, సహజవాయు శాఖ కార్యదర్శి. గతంలో మోదీ ప్రభుత్వంలో అనేక ఆర్థిక పదవులు నిర్వహించారు. ఆయన ఎవరి పక్షం వహించగలరో అమాయకులు కూడా ఊహించగలరు. వేతన యంత్రాంగ సూచన నిబంధనలు ఉద్యోగుల జీతభత్యాల, పెన్షన్ల మార్పునకట. పెంపునకు కాదు. గతంలో సవరణ అన్న ద్వంద్వార్థ పదాన్ని వాడేవారు. ఇప్పుడు మార్పు అని తమ ఉద్యోగ వ్యతిరేకతను చాటారు. ఇక నిబంధనలను పరిశీలిద్దాం.

దేశంలోని ఆర్థిక పరిస్థితులు, ఆర్థిక జాగ్రత్త అవసరాలు. దేశ ఆర్థిక స్థితి ఆకాశానికి ఎగిసిందని పాలకులు ప్రచారం చేస్తున్నారు. ఆర్థిక అధోగతిని సూచించే ఆర్థిక జాగ్రత్తను పాటించమని వేతన యంత్రాంగానికి నిబంధన విధిస్తారు. ఇవి పరస్పర విరుద్ధాలు. అయినా ఆర్థిక పరిస్థితిని పరిశీలించవలసిన, పొదుపును పాటించవలసిన బాధ్యత వేతన యంత్రాంగానిదా? ప్రభుత్వానిదా? వేతన యంత్రాంగం ఉద్యోగుల, పెన్షనర్ల ఆర్థిక స్థితులు, ద్రవ్యోల్బణం, జీవన వ్యయం వంటి అంశాలను పరిగణించాలి. ఈ నిబంధనలు వేతన, పెన్షన్ల నియంత్రణకే.

అభివృద్ధి ఖర్చులకు, సంక్షేమ చర్యలకు సరిపడా వనరుల నిర్ధారణ. బహుళజాతి సంస్థలు, సంపన్నులు చెల్లించవలసిన పన్నులు రాబట్టి, బ్యాంకుల నిరర్థక ఆస్తులను తగ్గించి ఆర్థిక వనరులను అభివృద్ధి చేయవలసిన బాధ్యత ప్రభుత్వానిది. ఈ పనిని వేతన యంత్రాంగానికి అప్పజెప్పడం అంటే వేతనాలను, పెన్షన్లను అదుపు చేయమనే.



(ఉద్యోగుల) వాటా, నిధులు లేని పెన్షన్ పథకాల ఖర్చు (తగ్గింపు). పాత పెన్షన్ పథకంలో కూడా ఉద్యోగుల జీతాల నుంచి కొంత సొమ్మును పెన్షన్ నిధికి జమచేస్తారు. పెన్షన్ చెల్లింపులో ప్రభుత్వ బాధ్యతను, పౌరుల హక్కును సుప్రీం కోర్టు అనేక సార్లు నొక్కి చెప్పింది. ఈ నియమం కొద్దిగా కొనసాగుతున్న పాత పెన్షన్ పథకాన్ని ఆపడానికే.

కేంద్ర వేతన సిఫారసులను అనుసరించే రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక స్థితులపై కేంద్ర వేతన యంత్రాంగం సిఫారసుల ప్రభావం. దేశమంతా ఒకే పనికి ఒకే స్థాయి వేతనాలు ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగుల వేతన, పెన్షన్లను అదుపు చేయడానికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతన, పెన్షన్లను నియంత్రించమనడం కేంద్ర ప్రభుత్వ రాజ్యాంగ విరుద్ధ చర్య.

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల, ప్రైవేటురంగ ఉద్యోగుల వేతన పొందిక, ప్రయోజనాలు, పని పరిస్థితులు. ప్రైవేటు రంగంలో శ్రామికుల శ్రమ దోపిడి ఎక్కువ. వేతనాలు తక్కువ. పని పరిస్థితులు అధ్వాన్నం. ఉద్యోగుల ప్రయోజనాల కంటే యాజమాన్యాల లాభాలకు ప్రాముఖ్యత ఉంటుంది. వాటితో కేంద్ర ప్రభుత్వ రంగాన్ని పోల్చడం, ప్రభుత్వరంగ ఉద్యోగుల వేతనాలను, పెన్షన్లను తగ్గించడానికే.

8 వ వేతన యంత్రాంగ సిఫారసులు 2026 జనవరి1 నుంచి అమలు కావాలి. ఈ గడువుకు రెండునెల్లే ఉంది. సిఫారసులు అందగానే ప్రభుత్వం వాటిని అమలు చేయదు. పరిశీలనలు, విశ్లేషణలు, మంత్రివర్గ ఆమోదాలు ఉంటాయి. కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, అశ్విని వైష్ణవ్ మంత్రి వర్గం నిర్ణయించిన నాటి నుంచి సిఫారసులు అమలు అవుతాయన్నారు. ఉద్యోగుల జీతాలు, పెన్షన్ల న్యాయమైన పెంపును కొంత కాలం ఆపడం తగదు. వయో రోగ మరణాలకు గురయ్యే పెన్షనర్ల కుటుంబాలు ఇబ్బందులకు గురవుతాయి. మన ప్రజాప్రతినిధులు తమ జీతభత్యాలను, పెన్షన్లను తామే పెంచుకుంటారు. వేతన యంత్రాంగ నిబంధనలను ప్రకటించిన వెంటనే నేటి ప్రభుత్వ బాకా అయిన రిపబ్లిక్ టీవీ ఈ నిబంధనలతో కోటి మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెద్ద ఉపశమనం అని ఊదింది. కనీస వేతనం 18 వేల నుంచి 30 వేలకు పెరుగుతుందని, 13 శాతం జీతాలు పెరుగుతాయని, కేంద్ర ఖజానాపై 2.4 నుంచి 3.2 లక్షల కోట్ల భారం పడుతుందని మరి కొన్ని పత్రికలు ఆ సాయంత్రమే ఘోషించాయి. వీటిని తెలుసుకున్న బడుగు జీవులు తమ అధోగతికి పాలకులు కారణం అని తెలుసుకోకుండా, ఈ ఉద్యోగులపై కోపద్వేషాలు వెళ్లగక్కుతారు. సమాజంలో అనవసర అంతర్గత విరోధభావాలు తలెత్తుతాయి.

జాతీయ కార్యదర్శి, ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం
సెల్: 9490204545

పోరాటాలకు ఏఐటీయూసీ అంకితం

వెలుగూరి రాధాకృష్ణమూర్తి.

బొంబాయి నగరంలో 1920 అక్టోబర్ 31 వ తేదీన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు లాలా లజపతిరాయ్ అధ్యక్షతన ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) ఏర్పడింది. నాటి నుంచి కార్మికవర్గ హక్కుల కోసమేగాక దేశ స్వాతంత్ర్యం కోసం అనేక పోరాటాలు చేసింది. ఆ తర్వాత ఆధునిక భారతదేశ నిర్మాణం కోసం అద్వితీయమైన కృషి చేసింది. అసాధారణ త్యాగాలు, బలిదానాలు, పోలీసు దాష్టీకాలు, పెట్టుబడుదార్ల గూండాల దాడులు, యావత్ జీవిత శిక్షలు, మరణ దండనలతో ఏఐటీయూసీ చరిత్ర యావత్తు ఎరుపెక్కింది. కోట్లాది మంది కార్మికవర్గ గొంతుకగా వారి గుండెల్లో స్థానం సంపాదించుకుంది. ఏఐటీయూసీ ఒకానొక చారిత్రక నేపథ్యంలో ఏర్పడింది. రష్యాలో అక్టోబర్ సోషలిస్టు మహావిప్లవం విజయవంతమై కార్మికవర్గం నాయకత్వాన ప్రభుత్వం ఏర్పడిన సందర్భం అది. జలియన్ వాలాబాగ్‌లో 1919 ఏప్రిల్ లో వైశాఖీ పండుగ సందర్భంగా వేలాది మంది ప్రజలపై బ్రిటీష్ పోలీసులు విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లో కొన్ని వందల మంది మరణించిన సంఘటన పట్ల దేశ మంతటా ఆగ్రహజ్వాలలు ఎగిసిపడ్డాయి. దేశం నాలుగు చెరగులా ప్రజలు ఉవ్వెత్తున ఉద్యమిస్తున్న రోజులవి. వివిధ నగరాలలో 16,17గంటల పని దినం అమలు జరిగేది. దీర్ఘకాలిక కాంట్రాక్టులపై కార్మికుల చేత పని చేయించుకునేవారు. పెట్టుబడిదారుల దాష్టికాన్ని భరించలేక కార్మికులు కాంట్రాక్టు షరతులను ఉల్లంఘించేవారు. తక్షణమే కార్మికులపై పెట్టుబడిదారులు హింసకు పాల్పడేవారు. అరెస్టులు, దౌర్జన్యాలు సర్వసాధారణం. తమకు తామే ఒక సమూహంగా ఏర్పడి కార్మికులు కార్యాచరణకు పూనుకున్నారు. తీవ్ర దోపిడీ, అణిచివేతలే కార్మికవర్గ తిరుగుబాటులకు కారణమయ్యాయి. బ్రిటీష్ పెట్టుబడిదారుల అవసరాల కోసం రైల్వే, ఓడరేవులు లాంటి మౌలిక సౌకర్యాల నిర్మాణం ప్రారంభమైంది. దేశంలోని అనేక నగరాలలో జనపనార, వస్త్రమిల్లులు ఏర్పడ్డాయి. తేయాకు, కాఫీతోటల పెంపకం పెరిగింది. పారిశ్రామిక కార్మిక వర్గం ఏర్పడింది. 1913 నుంచి 1920 మధ్యకాలంలో వివిధ రంగాలలో అనేక కార్మిక సంఘాలు ఏర్పడ్డాయి. 1900 సంవత్సరం నుంచి కార్మిక సంఘాల ఆవిర్భావ వెల్లువతో, పెట్టుబడిదారీవర్గం బెంబేలెత్తింది. కార్మిక సంఘాలను అణిచివేసేందుకు, ఇండియన్ పీనల్ కోడ్ (1913) కు బ్రిటీష్ ప్రభుత్వం సవరణలు చేసింది. బ్రిటీష్ ప్రభుత్వ ఈ దుష్ట చర్యలకు వ్యతిరేకంగా కార్మికవర్గం మరింత దృఢంగా నిలబడింది. సమరశీల పోరాటాలకు సిద్ధపడింది. దీనితో అనేక నూతన కార్మిక సంఘాలు ఏర్పడ్డాయి.

ఏఐటీయూసీ ఏర్పాటు సందర్భంగా 10 వేల మంది కార్మికులతో బొంబాయి నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మహాసభకు 1,40,854 మంది సభ్యులకు ప్రాతినిధ్యం వహించే 101 మంది ప్రతినిధులు హాజరయ్యారు. స్వయంగా పాల్గొనలేకపోయినప్పటికీ, 43 కార్మికసంఘాలు ఏఐటీయూసీ ఏర్పాటుకు మద్దతు తెలిపాయి. మోతిలాల్ నెహ్రూ, మహమ్మదాలీ జిన్నా, అనిబిసెంట్ లాంటి ఉద్దండులు ఈ వ్యవస్థాపక మహాసభకు హాజరయ్యారు. ఏఐటీయూసీ ఏర్పాటును మహాత్మాగాంధీ వ్యతిరేకించారు. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా ఏఐటీయూసీ కార్య కలాపాలు అభివృద్ధి చెందాయి. ఝూరియాలో 1921 లో జరిగిన ఏఐటీయూసీ రెండో మహాసభలో భారతదేశానికి "సంపూర్ణ స్వాతంత్ర్యం" డిమాండ్ చేస్తూ తీర్మానించింది. ఈ డిమాండ్‌ను రాజకీయ ఎజెండాపైకి మొదటిసారిగా తీసుకువచ్చి, ప్రజానీకాన్ని మేల్కొల్పిన ఘనత ఏఐటీయూసీకే దక్కింది. 1928లో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ పార్టీ మహాసభల ప్రాంగణంలోకి 50 వేల మంది కార్మికులు చొచ్చుకువెళ్లి "సంపూర్ణ స్వాతంత్ర్య" డిమాండ్‌ను ఆమోదిస్తూ తీర్మానించాలని నినాదాలు చేశారు. ఆ తర్వాత 1929 లో లాహోర్ కాంగ్రెస్ సభలలో సంపూర్ణ స్వాతంత్ర్య తీర్మానాన్ని ఆమోదించారు. ఏఐటీయూసీ లేవనెత్తిన ఈ డిమాండ్‌ను ఆమోదించటానికి కాంగ్రెస్ పార్టీకి 8 సంవత్సరాలు పట్టింది. స్వాతంత్ర్య పోరాటంలో ఏఐటీయూసీ గణనీయమైన పాత్ర పోషించింది.

నేడు ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినం

1919 నుంచి 1922 వరకు జాతీయ పోరాటాల వెల్లువ కాలంలో ఏఐటీయూసీ పెద్ద ఎత్తున పాల్గొంది. స్వతంత్ర భారతదేశం సోషలిస్ట్ రిపబ్లిక్‌గా ఉండాలని ఏఐటీయూసీ 1924లో తీర్మానించి రాజకీయ ఏజెండాపైకి తీసుకు వచ్చింది. 1925 డిసెంబర్ 26 వ తేదీన భారత కమ్యూనిస్టుపార్టీ ఆవిర్భవించింది. రౌలత్ చట్టానికి వ్యతిరేకంగానూ, వేల్స్ యువరాజు భారతదేశ సందర్శన సమయంలోనూ, సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగానూ లక్షల సంఖ్యలో కార్మిక వర్గం నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. గాంధీజీ అరెస్టుకు నిరసనగా 1930 మే 5 వ తేదీన షోలాపూర్ బట్టల మిల్లుల కార్మికులు 50 వేలమంది సమ్మె చేశారు. ఇతర కార్మికులతో కలిసి షోలాపూర్‌ను వారం రోజులపాటు తమ అధీనంలోకి తెచ్చుకున్నారు. తిరిగి పట్టు సాధించేందుకు బ్రిటీష్ పాలకులు షోలాపూర్‌పై మే 12 వ తేదీన "మార్షల్" లా విధించాల్సి వచ్చింది. సామ్రాజ్యవాద యుద్ధాలకు వ్యతిరేకంగా బాంబేలో 90 వేల మంది కార్మికులు పనులు నిలిపివేశారు. భారత ప్రభుత్వం 1935 చట్టానికి వ్యతిరేకంగా ఏఐటీయూసీ 1937 ఏప్రిల్ 1 వ తేదీన ఒకరోజు సమ్మె నిర్వహించింది. సామ్రాజ్యవాదులు విధించిన నూతన రాజ్యాంగ చట్టానికి బదులుగా "వయోజన ఓటింగ్" హక్కుతో ఒక "రాజ్యాంగ సభ"ను ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. ఈ డిమాండ్‌ను మొదటి సారిగా లేవనెత్తిన ఘనత ఏఐటీయూసీకే దక్కుతుంది. ఈ కాలంలోనే కార్మిక సంఘాల ప్రముఖ నాయకులపై బ్రిటీష్ ప్రభుత్వం అణచివేతలకు పాల్పడింది. "డిఫెన్స్ ఆఫ్ ఇండియా" నిబంధనల కింద కార్మిక సంఘాల ప్రముఖ నాయకులను అరెస్టు చేసింది. కార్మిక సంఘాల కార్యాలయాలపై దాడులు చేసి మూసివేయించింది.

ఇండియన్ నేషనల్ ఆర్మీకిచెందిన కెప్టెన్ సెహగల్, ధిల్లాన్ షానవాజ్ ఖాన్ల విచారణకు వ్యతిరేకంగా కార్మికవర్గం భారీ ప్రదర్శనలు నిర్వహించిం ది. దిల్లీలో మకాంవేసి ఉన్న రాయల్ ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఉద్యోగులు కూడా జాతి వివక్షతకు వ్యతిరేకంగా సమ్మె చేశారు. కలకత్తాలోనూ అటువంటి సమ్మె జరిగింది. 1946 ఫిబ్రవరి 18 వ తేదీన రాయల్ ఇండియన్ నావికులు తిరుగుబాటు చేశారు. తిరుగుబాటుదారుల విజ్ఞప్తి మేరకు బొంబాయిలో 3 లక్షల మంది కార్మికులు సంఘీభావ సమ్మె చేశారు. ఈ సందర్భంగా నావికులు కొన్ని ఓడలను సైతం స్వాధీనం చేసుకున్నారు. బ్రిటీష్ సైనికులు కాల్పులు జరపగా, అధికారుల లెక్కల ప్రకారమే 250 మంది కార్మికులు మరణించారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటం ప్రతి ఘట్టంలోనూ కార్మికవర్గం సముచిత పాత్ర పోషించింది. అణచివేతకు గురైంది. అసాధారణ త్యాగాలు చేసింది. స్వాతంత్ర్య పోరాటంలో కీలక భాగంగా వ్యవహరించింది. అందువల్లనే, స్వాతంత్ర్యానంతరం ఏర్పడిన తర్వాత రాజ్యాంగంలో కొన్ని కార్మిక హక్కులకు కొద్దిపాటి హామీలు కల్పించారు. గత 105 సంవత్సరాలుగా కార్మిక వర్గం అనేక పోరాటాలు, త్యాగాలు చేసి మరి కొన్ని హక్కులను సాధించుకోగలిగింది. కానీ వాటి అమలులో మాత్రం ప్రభుత్వాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. న్యాయస్థానాలలోనూ కార్మికులకు సరైన న్యాయం దొరకటం లేదు. కేంద్రంలో నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత, 29 కార్మిక చట్టాలను రద్దుచేసి, 4 'కార్మిక కోడ్స్'ను అమల్లోకి తీసుకు వస్తున్నారు. కార్మిక వర్గాన్ని బ్రిటీష్ కాలం నాటి దుర్భర పరిస్థితికి నెట్టేస్తున్నారు. ఇప్పుడేమో నాలుగు కార్మిక కోడ్ల కొనసాగింపుగా "శ్రమ్ శక్తి ఎన్‌ఐటీఐ 2025" పేరుతో నూతన జాతీయ కార్మిక విధానాన్ని ముందుకు తీసుకొస్తున్నారు. జాతీయ కార్మిక సంఘాలతో ఒక్క మాటైనా చెప్పకుండానే, ఎటువంటి సంప్రదింపులు జరుపకుండానే ఈ పని చేయటం గర్హనీయం. జాతీయ లేబర్ కాన్ఫరెన్స్‌ను 10 సంవత్సరాలుగా పక్కన పెట్టేశారు. త్రైపాక్షిక సంస్థలన్నిటిని ఉనికిలో లేనట్టుగా మార్చేశారు. ఈ విధానాలను భారతదేశంలోని యావత్ కార్మిక వర్గం సంఘటితంగా ప్రతిఘటిస్తోంది. 1930వ దశకంలో ఏఐటీయూసీ నుంచి బయటికి వెళ్లిన సంఘాలను ఏఐటీయూసీలోకి తిరిగి తీసుకురావడం ద్వారా ట్రేడ్ యూనియన్ ఐక్యతకు పెద్దపీట వేసింది. ఏఐటీయూసీ 106 వ వ్యవస్థాపక దినోత్సవ సందర్భంగా పోరాటాలకు అంకితం కావాలని తన శ్రేణులకు ఏఐటీయూసీ పిలుపునిస్తోంది.

ఏఐటీయూసీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు,
సెల్: 9490193263.

'ఇండియా' ఓటమి ఖాయం

అమిత్‌షా



లఖిసరాయ్: బీహార్ ఎన్నికల్లో ఇండియా ఐక్యసంఘటన తుడిచిపెట్టుకుపోవడం ఖాయమని కేంద్ర హెూం మంత్రి అమిత్ పేర్కొన్నారు. షా గురువారం (అక్టోబర్ 30, 2025) బీహార్ ఎన్నికల్లో భారత కూటమి తుడిచిపెట్టుకుపోతుందని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తల్లిని అవమానించినందుకు, రాహుల్ గాంధీ ప్రధానమంత్రిని, 'ఛఠీ మైయ్యా'ను అవమానించినందుకు ప్రజలు ప్రతీకారం తీర్చుకుంటారన్నారు. లఖిసరాయ్ జిల్లాలో జరిగిన ఎన్నికల సభలో ప్రసంగించిన ఆయన, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ 'ఛఠీ మయ్యా'ను అవమానించారని, దేవతను పూజించే వారు నాటకం ఆడుతున్నారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీని ఎగతాళి చేస్తూ, ఎన్‌డీఏ మూడు చిహ్నాలు ఉన్న ఈవీఎం బటన్లను "ఇటలీలో కూడా" ప్రకంపనలు కలిగేంత కోపంతో నొక్కాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. బీహార్‌కు లాలూ ప్రసాద్, రబ్డీ దేవి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో బీహార్ 'ఆటవిక రాజ్యం' చూసిందని,"ఎన్‌డీఏ వేసే ప్రతి ఓటు రాష్ట్రానికి అభివృద్ధిని తెస్తుందని షా పేర్కొన్నారు. 10 సంవత్సరాల పాలనలో యూపీఏ ప్రభుత్వం 12 లక్షల కోట్ల విలువైన కుంభకోణాలకు పాల్పడిందని, అయితే అవినీతి విషయంలో మోదీ మరియు ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌లను ఎవరూ వేలు చూపలేరని ఆయన ఆరోపించారు. "లాలూ ప్రసాద్ పశుగ్రాసం, ఉద్యోగాల కోసం భూమి, బిటుమెన్, వరద సహాయ కుంభకోణాలలో పాల్గొన్నారు...అయితే బీహార్ నితీశ్‌కుమార్ పాలనలో అభివృద్ధి మార్గంలో పయనించింది మరియు కేంద్రం వ్యవసాయ ఉత్పత్తులకు ఎంఎస్‌పీని ని పెంచింది మరియు మౌలిక సదుపాయాలను బలోపేతం చేసింది" అని ఆయన అన్నారు. ఎన్‌డీఏ పాలనలో భారతదేశంలో ఉగ్రవాదులు ఎటువంటి పరిణామాలు లేకుండా అల్లకల్లోలం సృష్టించారని, మోదీ పాలన పాకిస్థాన్ లోపల దాడులతో ప్రతి దాడికి ప్రతిఫలమిచ్చిందని ఆయన పేర్కొన్నారు. "పేద ప్రజల ఆహార ధాన్యాలు, ఉపాధిని దోచుకునే , దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే చొరబాటుదారులను బీహార్ నుండి తరిమివేస్తాము" అని అమిత్‌షా పేర్కొన్నారు.

అదానీ, అంబానీ, మోదీదే భారత్

- ట్రంప్ వ్యాఖ్యల్ని ఖండించే ధైర్యం ప్రధానికి లేదు
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ

నలందా(బీహార్): ఆపరేషన్ సిందూర్ నిలిపివేత విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యలను ఖండించే ధైర్యం ప్రధాని నరేంద్రమోదీకి లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. గురువారం బీహార్‌లోని నలందాలో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాహుల్ గాంధీ ప్రసంగిస్తూ... ప్రధాని మోదీపై ఈ మేరకు విరుచుకుపడ్డారు. నితీశ్‌కుమార్ పాలనలో బీహార్ పేపర్ లీకేజీలు, పేలవమైన ఆరోగ్య మౌలిక సదుపాయాలకు నిలయంగా మారిందని మండిపడ్డారు. బీహార్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు భూమి లేదని హెూంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపైనా రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అదానీ లాంటి వ్యాపారవేత్తలకు రూపాయికే భూమి ఎలా కేటాయిస్తున్నారని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటు చోరీ ద్వారానే ఎన్‌డీఏ అధికారం చేపట్టిందని పునరుద్ఘాటించారు. ' 'ఒక హిందూస్థాన్ అదానీ, అంబానీ, ప్రధాని మోదీలది. రెండో హిందూస్థాన్ మీది (ప్రజలు). రెండో దాంట్లో ఏమి చేసినా మీకు (ప్రజలు) ఉద్యోగాలు రావు. ఎందుకంటే ప్రధాని మోదీ అదానీ, అంబానీల చేత చైనా వస్తువులను విక్రయించాలని చూస్తున్నారు. వాటిని దేశ పౌరులతో పాటు బీహారీలు కొనుగోలు చేసేలా చూస్తున్నారు. ప్రధాని మోదీ ఇక్కడకు (బీహార్) వచ్చి యువతకు ఒక్క మాట చెప్పారు. బీజేపీ మొబైల్ డేటా చార్జీలను తగ్గించిందని చెప్పారు. తద్వారా యువత ఫేస్‌బుక్, ఇన్‌స్టాలో రీల్స్ చేసుకుంటున్నారని చెప్పారు. నేను బీహార్ యువతను ఒక్కటి అడుగుతున్నాను. రీల్స్, ఇన్‌స్టా చూడటం ద్వారా ఏమైనా ప్రయోజనం ఉందా? ఇన్‌స్టా చూస్తే మీ జేబులోకి డబ్బు చేరుతుందా? మీరు ఇన్‌స్టా, ఫేస్‌బుక్ చూస్తే అంబానీ జేబులోకి డబ్బు వెళుతుంది" అని రాహుల్ గాంధీ అన్నారు.

మోదీకి మహిళల్ని ఓట్లడిగే హక్కులేదు: కాంగ్రెస్

బీహార్‌లోని "ట్రబుల్-ఇంజిన్ ఎన్డీఏ ప్రభుత్వం" హయాంలో మహిళలపై నేరాలు తారాస్థాయికి చేరుకున్నాయని కాంగ్రెస్ మండిపడింది. రాష్ట్రంలో మహిళల్ని ఓట్లటడిగే నైతిక హక్కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేదని పేర్కొంది. బీహార్ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, అసెంబ్లీ ఎన్నికలలో తమ ఓట్ల ద్వారా ఈ ప్రభుత్వాన్ని కూల్చివేయాలని నిర్ణయించుకున్నారని తెలిపింది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ఎక్స్' వేదిక పోస్ట్ చేశారు. ప్రధానమంత్రి మోదీ బీహార్ ఎన్నికల ప్రసంగాలలో ఏ ముఖం పెట్టుకుని రాష్ట్ర మహిళలను తనకు ఓటు వేయమని విజ్ఞప్తి చేస్తున్నారని ప్రశ్నించారు. "నిజం ఏమిటంటే...బీహార్‌లో, ట్రబుల్-ఇంజన్ ప్రభుత్వం కింద, రాష్ట్ర మహిళలు పూర్తిగా నిస్సహాయంగా ఉన్నారు. లైంగిక హింసతో సహా మహిళలపై నేరాలు గరిష్ట స్థాయికి చేరుకున్నాయి" అని జైరామ్ పేర్కొన్నారు. రోజురోజుకూ మహిళలపై లైంగిక నేరాల గ్రాఫ్ పెరుగుతోందని... ఈ సంవత్సరం మేలో అది మరింత దారుణంగా మారిందన్నారు. అనారోగ్యానికి గురైన 11 ఏళ్ల దళిత బాలికను చికిత్స కోసం విషమ స్థితిలో పట్నా మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తీసుకురాగా... ఆమెకు ఎనిమిది గంటలు ఆసుపత్రిలో మంచం ఇవ్వకపోవడంతో అంబులెన్స్‌లోనే తుది శ్వాస విడిచిందని జైరామ్ వివరించారు. 'ప్రధానమంత్రి వస్తారు. తన ఎన్నికల ప్రసంగాలను తప్పుడు వాగ్దానాలతో నింపుతారు. కొన్ని క్షణాలు ప్రజలను అలరించి వెళ్లిపోతారు' అని ఆయన పేర్కొన్నారు. మహిళలపై జరుగుతున్న దారుణాల గురించి ప్రధాని ఒక్క మాట కూడా మాట్లాడరని...ఆయన సొంత ప్రభుత్వంలోని మంత్రులపైనే దారుణమైన ఆరోపణలు వచ్చినప్పుడు ఆయన ఎలా ఆ పని చేస్తారని ఎద్దేవా చేశారు. "2018లో ముజఫర్‌పూర్ షెల్టర్ హెూమ్ కుంభకోణంలో ఒక దారుణమైన, మానవత్వాన్ని కదిలించే కేసు వెలుగులోకి వచ్చింది, అక్కడ 34 మందికి పైగా మైనర్ బాలికలు దీర్ఘకాలిక లైంగిక దోపిడీకి గురయ్యారు" అని జైరామ్ అన్నారు. దర్యాప్తులో అప్పటి మంత్రి మంజు వర్మ భర్తపై కేసు నమోదు కాగా, ఆమె రాజీనామా చేశారని తెలిపారు. అయితే 2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఆమెకు టికెట్ ఇచ్చారని...ఇప్పుడు ఆమె కొడుకును అదే ప్రాంతం నుండి అభ్యర్థిగా నిలబెట్టారని తెలిపారు. "ఈ నెల బెగుసరాయ్‌లోని చెరియా బరియార్‌పూర్‌లో, మాజీ మంత్రి మంజు వర్మ నివాస సముదాయం వెనుక ఉన్న చెరువు నుండి 13 ఏళ్ల బాలిక అర్ధనగ్న మృతదేహం కనుగొనబడింది. హత్యకు ముందు మైనర్ లైంగిక హింసకు గురైనట్లు ప్రాథమిక ఆధారాలు సూచిస్తున్నాయి" అని జైరామ్ ఆరోపించారు. ఇలాంటి అనేక సంఘటనల తర్వాత బీహార్ గడ్డపై ఉన్న మహిళల నుండి ఓట్లు అడిగే నైతిక హక్కు ప్రధానికి ఉందా అని ఆయన ప్రశ్నించారు. ఈసారి రాష్ట్ర ప్రజలు తమ ఓట్ల ద్వారా ఈ ప్రభుత్వాన్ని కూల్చివేసేందుకు నిశ్చయించుకున్నారని స్పష్టం చేశారు.

ఆర్‌జేడీ-కాంగ్రెస్‌తో ఆటవిక రాజ్యం

ప్రధాని మోదీ విమర్శలు

ముజఫర్‌పూర్: ఆర్‌జేడీ, కాంగ్రెస్ పార్టీల మధ్య ఉన్న సంబంధం నీళ్లు, నూనె లాంటిదని ప్రధాని మోదీ విమర్శించారు. ఈ పార్టీలు బీహార్‌ను ఎన్నటికీ అభివృద్ధి చేయలేవని... ఆ పార్టీలు దశాబ్దాలుగా బీహార్‌ను పాలించినా కేవలం ద్రోహం, తప్పుడు వాగ్దానాలు మాత్రమే ఇచ్చాయని ఆరోపించారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ముజఫర్‌పూర్‌లో నిర్వహించిన సభలో పాల్గొన్న ప్రధాని మోదీ, ఆర్‌జేడీ-కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. 'బీహార్ మధురమైన భాషను, సంస్కృతిని ప్రపంచంలోని ప్రతి మూలకు వ్యాప్తి చేయడం, గౌరవాన్ని పెంచడం, అభివృద్ధి చేయడం ఎన్‌డీఏ, బీజేపీకి అతి పెద్ద ప్రాధాన్యత. వికసిత్ భారత్ కోసం వికసిత్ బీహార్ చాలా అవసరం' అన్నారు. ఆర్‌జేడీ, కాంగ్రెస్ బీహార్‌ను ఎప్పటికీ అభివృద్ధి చేయలేవన్నారు.

ఆర్‌జేడీ- కాంగ్రెస్ పార్టీలు ఎక్కడ ఉంటే అక్కడ ఆటవిక రాజ్యం వస్తుందని ప్రధాని మోదీ విమర్శించారు. ఎక్కడైతే ఆర్‌జేడీ, కాంగ్రెస్ పార్టీల దుష్పరిపాలన ఉంటుందో అక్కడ అభివృద్ధి జాడ కనిపించదన్నారు. ఎక్కడ అవినీతి ఉంటుందో అక్కడ సామాజిక న్యాయం జరగదని చెప్పారు. పేదల హక్కులు దోచుకుంటారని, కొన్ని కుటుంబాలు మాత్రమే అభివృద్ధి చెందుతాయని తెలిపారు. అలాంటి వ్యక్తులు బీహార్‌కు ఎప్పటికీ మంచి చేయలేరని ఆరోపించారు. ఆర్‌జేడీ అధికారంలో ఉన్న సమయంలో షోరూంలో నుంచి వాహనాలను దోచుకెళ్లారని చెప్పుకొచ్చారు. ఛఠ్ పూజను కాంగ్రెస్-ఆర్‌జేడీ డ్రామాగా పేర్కొన్నాయని, ఈ అవమానాన్ని బీహార్ ప్రజలు ఎన్నేళ్లయినా మర్చిపోరని ప్రధాని చెప్పారు.

ఎల్‌జీ ఆదేశాలతో ఇద్దరు ముస్లిం ఉద్యోగుల తొలగింపు

శ్రీనగర్ : ఉగ్రవాదులతో సంబంధాలున్నాయని ఆరోపిస్తూ ఇద్దరు ముస్లిం ఉద్యోగులను లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్‌జీ) ఆదేశాలతో అక్రమంగా తొలగించిన ఘటన జమ్మూకశ్మీర్‌లో జరిగింది. ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న గులాం హుస్సేన్, మాజిద్ ఇక్బాల్ దార్‌లను తొలగించాల్సిందిగా జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆదేశించినట్లు అధికారులు గురువారం తెలిపారు. హుస్సేన్ రియాసి జిల్లాలోని మహెూర్ తహసీల్‌లోని కల్వా ములాస్ నివాసి కాగా, దార్ రాజౌరీ జిల్లాలోని ఖియోరా ప్రాంతంలో వార్డ్‌నెం. 1లో నివసిస్తున్నారని అన్నారు. కేసు వివరాలు, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న తర్వాత, అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా, ఇద్దరు ముస్లిం ఉద్యోగుల కార్యకలాపాలు వారిని విధుల నుంచి తొలగించేలా ఉన్నాయని లెఫ్టినెంట్ గవర్నర్ పేర్కొన్నట్లు వేర్వేరు ఉత్తర్వులు తెలిపాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 311లోని క్లాజ్ (2) నిబంధనల్లోని సబ్‌క్లాజ్ (సి) ప్రకారం... రాష్ట్ర భద్రత దృష్ట్యా, ఈ కేసులపై విచారణ చేపట్టడం సముచితం కాదని గవర్నర్ ఆదేశించినట్లు ఉత్తర్వులు పేర్కొన్నాయి.

బీజేపీ,ఈసీ తోడు దొంగలు

ఓటర్ల జాబితాల్లో నిశ్శబ్ద రిగ్గింగ్: టీఎంసీ

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో ఎస్ఐఆర్ కోసం ఎన్నికల సంఘం సన్నాహాల వేళ అధికార టీఎంసీ తీవ్రస్థాయిలో ఆరోపణలు చేసింది. ఓటర్ల జాబితాల్లో నిశ్శబ్ద రిగ్గింగ్ జరుగుతోందని బాంబు పేల్చింది. 2002 నాటి జాబితాలకు తాజాగా ఎన్నికల సంఘం తమ వెబ్‌సైట్‌లో పొందుపర్చిన వాటికి పొంతన లేదని తేల్చింది. కొన్ని వేల పేర్లను ఓటర్ల జాబితాల్లో నుంచి తొలగించారని, ఇదంతా ప్రణాళికాబద్ధంగా జరిగిందని విమర్శించింది. ఎన్నికల సంఘం, బీజేపీ కుమ్మక్కై పథకం ప్రకారం అర్హులైన ఓటర్ల పేర్లను జాబితాల్లో తొలగించినట్లు టీఎంసీ అధికార ప్రతినిధి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కునాల్ ఘోష్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయన గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈసీ, బీజేపీ తోడు దొంగలన్నారు. 'ఇది నిశ్శబ్ద రిగ్గింగ్. ఒక చోట 2002 నాటి జాబితాలో 717 మంది ఓటర్లు ఉంటే, తాజా జాబితాలో 140 మంది మాత్రమే ఉన్నారు. ఈ ఓటర్లంతా చనిపోయారా!' అని అన్నారు. అనేక బూత్‌లలో వందల మంది ఓటర్ల పేర్లు అకారణంగా తొలగించినట్లు తెలిపారు. 'అశోక్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని గుమా-1 గ్రామ పంచాయతీ బూత్ 159లో నమోదైన ఒక్క ఓటరు కూడా లేరని ఈసీ వెబ్‌సైట్ చెబుతోంది. 2002 నాటి జాబితా చూస్తే దాదాపు 900 మంది ఓటర్లు ఉన్నారు. కూచ్ బెహార్‌లో కూడా ఇదే పరిస్థితి ఉంది. 400 నుంచి 900 మంది వరకు ఓటర్ల పేర్లు జాబితాల నుంచి మాయమయ్యాయి' అని ఘోష్ వెల్లడించారు. బీజేపీ కార్యాలయాల్లో రచించిన వ్యూహాన్ని ఎన్నికల సంఘం పోర్టల్ ఆచరణలో పెట్టిందని వ్యాఖ్యానించారు. అలా కాకపోతే, లక్షలాది మంది పేర్లు తొలగిస్తారని బీజేపీ నేతలకు ముందే ఎలా తెలుసంటూ ప్రశ్నించారు. ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసే ప్రమాదకర ప్రయత్నాలపై పూర్తిస్థాయి విచారణ కోరుతూ ఈసీకి టీఎంసీ ఫిర్యాదు చేసిందని చెప్పారు. అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగించనివ్వమని ఘోష్ సంకల్పించారు. ఇందుకోసం బూత్‌ల వారీగా ఓటర్ల వివరాలను తమ పార్టీ కూడా సేకరిస్తోందని, వీటిని ఈసీకి సమర్పిస్తుందని అన్నారు. కొన్ని ప్రాంతాల్లో బీజేపీ మద్దతుదారులు సైతం జాబితాల్లో వారి పేర్లు లేకపోవడాన్ని గుర్తించారని, ఈ పరిస్థితి ఆ పార్టీ వర్గాల్లో చిచ్చు పెట్టిందని ఘోష్ చెప్పారు. ఎస్ఐఆర్ భయంతో ఉత్తర బెంగాల్ జిల్లాల్లో ఆత్మహత్యలు వంటి ఘటనల క్రమంలో టీఎంసీ తాజా ఆరోపణలకు ప్రాధాన్యత ఏర్పడింది.

ఓటర్ల జాబితాల్లో అక్రమాలను వ్యతిరేకిస్తూ

రేపు ముంబైలో విపక్షాల భారీ ర్యాలీ

ముంబై: ఓటర్ల జాబితాల్లో అక్రమాలను వ్యతిరేకిస్తూ మహారాష్ట్రలో ప్రతిపక్ష మహా వికాస్ అగాధీ అధ్వర్యంలో శనివారం ర్యాలీ జరగనుంది. శివసేన (యూబీటీ), ఎన్‌సీపీ (ఎస్‌పీ) అధినేతలు ఉద్ధవ్ ఠాక్రే, శరద్ పవార్‌తో కలిసి మహారాష్ట్ర నవ నిర్మాణ్ సేన అధ్యక్షుడు రాజ్ ఠాక్రే పాల్గొనున్నారు. సంయుక్తంగా భారీ నిరసన ప్రదర్శన ఏర్పాటునకు సంబంధించి గురువారం వైబీ చవాన్ వద్ద ఠాక్రే సోదరులు, పవార్ భేటీ అయ్యారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నసీం ఖాన్, కర్షకులు, కార్మికుల పార్టీ (పీడబ్ల్యూసీ) నాయకుడు జయంత్ పాటిల్ సహా వామపక్ష నాయకులు చర్చల్లో పాల్గొన్నారు.

సమావేశం అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించారు. శివసేన (యూబీటీ) నాయకుడు అనిల్ పరబ్ మాట్లాడుతూ దక్షిణ ముంబైలోని ఫ్యాషన్ స్ట్రీట్ నుంచి బీఎంసీ కేంద్ర కార్యాలయం వరకు ర్యాలీ జరుగుతుందని చెప్పారు. నవంబరు 1వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4 గంటల లోపు ప్రదర్శన శాంతియుతంగా నిర్వహిస్తామని తెలిపారు. ఓట్ల చోరీ, ఓటర్ల జాబితాల్లో అక్రమాలను లేవనెత్తుతామన్నారు. ర్యాలీకి కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది.

ఎస్ఐఆర్‌తో లక్షల ఓట్లు తొలగించాలని బీజేపీ కుట్ర

స్టాలిన్

చెన్నై : ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ (సర్) ద్వారా లక్షలాది ఓటర్లను తొలగించాలని బీజేపీ కుట్ర పన్నుతోందని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ విమర్శించారు. దీనిపై కార్యాచరణను నిర్ణయించేందుకు నవంబరు రెండో తేదీన అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహిస్తామని ప్రకటించారు. మామల్లపురంలో పార్టీ కార్యకర్తల శిక్షణ శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు, ఎస్సీలు, మైనారిటీలు, మహిళలను లక్ష్యంగా చేసుకొని వారి ఓట్లను తొలగించడం ద్వారా ఎన్నికల్లో విజయం సాధించాలని బీజేపీ, అన్నా డీఎంకే ప్రయత్నిస్తున్నాయని ధ్వజమెత్తారు. ఇలాంటి ప్రక్రియ చేపట్టి బీహార్‌లో ఎన్నికల కమిషన్ 65 లక్షల మంది ఓటర్ల హక్కులను కాలరాసిందని స్టాలిన్ గుర్తు చేశారు. రాబోయే శాసనసభ ఎన్నికలు డీఎంకేకు, ఢిల్లీ ముందు మోకరిల్లిన బానిసలకు మధ్య జరుగుతున్న పోరుగా అభివర్ణించారు. తమిళనాడు ఆత్మ గౌరవాన్ని, వ్యక్తిత్వాన్ని కాపాడేందుకు పోరు జరగబోతోందని చెప్పారు. హిందీ, సంస్కృతం, జీఎస్టీ, గవర్నర్ రూపంలో తమను ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. ఆర్ఎస్ఎస్ కుట్రలు ఇక్కడ సాగవని చెప్పారు. డీఎంకే బలమేమిటో బీజేపీకి తెలుసునని, అందుకే తమను ఇబ్బంది పెట్టడానికి కొత్త దారులు వెతుకుతోందని అన్నారు. 'ఎన్నికల కమిషన్ సర్‌ను ప్రకటించి దానితో మనల్ని బెదిరించాలని ప్రయత్నిస్తోంది. కానీ తాము తలవంచే ప్రసక్తే లేదు. శాసనసభ ఎన్నికలు బీజేపీ-అన్నా డీఎంకే కూటమి నుంచి రాష్ట్రాన్ని కాపాడతాయి' అని స్టాలిన్ చెప్పారు.

కోటికి పైగా 'సైబర్' దోపిడీ

ఒత్తిడితో రిటైర్డు ఉద్యోగి మృతి

పూణె: సైబర్ నేరగాళ్లు సరికొత్త ఎత్తుగడలతో అమాయకులను మోసం చేస్తూ అందిన కాడికి దోచుకుంటున్నారు. ఇటీవల డిజిటల్ అరెస్టుల పేరుతో రెచ్చిపోతున్నారు. తాజాగా పూణెలో ఓ రిటైర్డ్ అధికారిని డిజిటల్ అరెస్టు పేరుతో మోసం చేసి రూ.1.19 కోట్లు కాజేశారు. తన జీవిత కాలంలో దాచుకున్న సొమ్ము మొత్తాన్ని కొల్లగొట్టారు. సైబర్ నేరస్తుల వేధింపులు, ఆర్థిక నష్టం ఒత్తిడి కారణంగా బాధితుడు ఇంట్లో కుప్పకూలిపోయాడు. వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించగా ఆసుపత్రిలో మరణించినట్లు ప్రకటించారు. మృతుడి భార్య సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎఫ్ఐఆర్ ప్రకారం ఆగస్టు 16న రిటైర్డ్ అధికారికి ఫోన్ కాల్ రావడంతో ఈ ఘోరానికి తెరలేచింది. కాల్ చేసిన వ్యక్తి తనను తాను ముంబై పోలీసులలో 'ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్'గా పరిచయం చేసుకున్నాడు. రిటైర్డ్ అధికారి బ్యాంకు ఖాతాలు, ఆధార్ నంబర్‌ను ఒక ప్రైవేట్ ఎయిర్‌లైన్ కంపెనీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఉపయోగిస్తున్నారని ఆరోపించాడు. ఆ మోసగాడు తరువాత తనను తాను సీబీఐ ఢిల్లీ కార్యాలయం నుండి వచ్చిన ఐపీఎస్ అధికారిగా పరిచయం చేసుకుని... సహకరించకపోతే ఆ జంటను 'హెూమ్ అరెస్ట్' లేదా 'జైలు అరెస్ట్' చేస్తానని బెదిరించాడు. నిందితుడు వృద్ధుడి ఫోన్ కెమెరాను ఆన్ చేసి... ఆ జంటను మూడు రోజుల పాటు 'డిజిటల్ అరెస్ట్'లో ఉంచాడని పూణె సైబర్ పోలీస్ డీసీపీ వివేక్ మసల్ తెలిపారు. సైబర్ నేరగాళ్లు ఆ దంపతుల నుంచి సున్నితమైన ఆర్థిక, వ్యక్తిగత సమాచారం పొందారు. దర్యాప్తు ముసుగులో దంపతులను పదే పదే ప్రశ్నించారు. వేధింపులు, ఆర్థిక నష్టం కారణంగా భర్త తీవ్ర ఒత్తిడికి గురయ్యాడని, అది అతని మరణానికి కారణమై ఉండవచ్చని డీసీపీ మసల్ నిర్ధారించారు.

వేతన కమిషన్ చైర్‌పర్సన్‌గా జస్టిస్ రంజనా ప్రకాష్ దేశాయ్

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల వేతన నిర్మాణంలో మార్పులను సమీక్షించి సిఫార్సు చేయడానికి ఉద్దేశించిన 8వ కేంద్ర వేతన సంఘం చైర్‌పర్సన్‌గా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రంజనా ప్రకాష్ దేశాయ్ నియమితులయ్యారు. దాదాపు 50 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 69 లక్షల మంది పెన్షనర్ల అలవెన్సులు, పింఛన్ల అంశాలను ఈ కమిషన్ సమీక్షిస్తుంది. సాధారణంగా ప్రతి పదేళ్లకు ఒకసారి వేతన సంఘాన్ని ఏర్పాటు చేస్తారు. 8వ వేతన సంఘం సిఫార్సులు జనవరి 1, 2026 నుంచి అమలులోకి వచ్చే అవకాశం ఉంది. కమిషన్ తన తుది నివేదికను త్వరలో సమర్పించాలని భావిస్తున్నారు. కేంద్ర వేతన సంఘం చరిత్రలో మహిళా చైర్‌పర్సన్‌గా జస్టిస్ రంజనా ప్రకాష్ దేశాయ్ నియమితులవ్వడం విశేషం. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పనిచేసి 2014లో ఆమె పదవీ విరమణ చేశారు. ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌర స్మృతి ముసాయిదా కమిటీకి చైర్‌పర్సన్‌గా నేతృత్వం వహించారు. ఆ కమిటీ సమర్పించిన నివేదిక ఆధారంగా ఉత్తరాఖండ్ యూసీసీని అమలు చేసిన తొలి రాష్ట్రంగా నిలిచింది. జమ్మూకశ్మీర్ నియోజకవర్గాల పునర్విభజన కమిషన్‌కు కూడా అధ్యక్షురాలిగా పనిచేశారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు చైర్‌పర్సన్‌గా సేవలు అందించారు.

నటుడు ప్రభు నివాసానికి బాంబు బెదిరింపు

చెన్నై: తమిళనాడు రాజధాని చెన్నైలో మరోసారి బాంబు బెదిరింపులు కలకలం రేపాయి. గురువారం యూఎస్ కాన్సులేట్‌తోపాటూ ప్రముఖ నటుడు ప్రభు నివాసానికి ఇలాంటి బెదిరింపులు వచ్చాయి. డీజీపీ కార్యాలయానికి ఈ బెదిరింపు మెయిల్ వచ్చింది. అప్రమత్తమైన పోలీసులు రెండు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సాయంతో క్షుణ్ణంగా సోదాలు చేశారు. అయితే, ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలూ, అనుమానాస్పద వస్తువులూ లభించలేదు. దీంతో దాన్ని నకిలీ బెదిరింపుగా తేల్చారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కారు బానెట్‌పై ఈడ్చుకెళ్లి...

గాంధీనగర్: ఓ టీచర్ మద్యం మత్తులో బీభత్సం సృష్టించాడు. బైక్‌ను ఢీకొట్టి... దానిపై ఉన్న వారిని కిలోమీటర్ల మేర ఈడ్చుకెళ్లాడు. ఆపై ప్రాణం తీశాడు. ఈ ఘటన గుజరాత్‌లోని మోడస లునావాడ వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించే టీచర్, అతడి సోదరుడు అధికంగా మద్యం సేవించారు. కన్ను మిన్ను కానకుండా రెచ్చిపోయి డ్రైవింగ్ చేశారు. మద్యం తాగి ఒళ్లు తెలియని మైకంలో కారు నడిపిన టీచర్... ఓ బైక్‌ను ఢీకొట్టాడు. బైక్‌ను ఢీకొట్టిన విషయాన్ని గుర్తించకుండా బానెట్‌పై పడిన వ్యక్తిని 1.5 కిమీ మేర ఈడ్చుకెళ్లాడు. మితిమీరిన వేగం ధాటికి బానెట్‌పై ఉన్న బాధితుడు కిందపడ్డాడు. ఈ హిట్ అండ్ రన్ కేసు ప్రమాదంలో ఓ వ్యక్తి మరణించాడు. మరో వ్యక్తి చావు బతుకుల మధ్య ఆస్పత్రిలో చికిత్స పొంతున్నట్లు తెలుస్తోంది. ఇక ప్రమాదానికి సంబంధించి సోషల్ మీడియాలో వెలుగులోకి రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. సోషల్ మీడియాలో వైరల్ వీడియో ఆధారంగా ఈ దుర్ఘటన మహిసాగర్ జిల్లాలోని మోడాసా-లునావాడ నేషల్ హైవే 48లో జరిగినట్లు గుర్తించారు. హిట్ అండ్ రన్ నిందితుల్ని అదుపులోకి తీసుకున్నారు. నిందితులు మనీశ్ పటేల్, మెహుల్ పటేల్‌గా పోలీసులు గుర్తించారు. గాయపడిన ఇద్దరు బాధితులను లునావాడాలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి... చికిత్స అందించినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

క్రికెటర్‌ను కాదు... నటుడిని

ఐటీశాఖకు సచిన్ వివరణ

ముంబై: ఆదాయ పన్ను నుంచి మినహాయింపు పొందేందుకు తాను నటుడిని అని చెప్పుకున్న క్రికెటర్ సచిన్ టెండూల్కర్‌కు ఆ శాఖ రూ.58 లక్షల పన్ను మినహాయింపు కల్పించింది. ట్యాక్స్‌బడ్డీ సుజిత్ బంగర్ ఈ విషయాన్ని తన సోషల్ మీడియాలో పోస్టు చేశారు. 2002-03 సీజన్‌లో ఇది జరిగినట్లు ఆయన చెప్పారు. ఆ ఏడాది విదేశీ వాణిజ్య ప్రకటనల్లో నటించిన సచిన్‌కు సుమారు రూ.5.29 కోట్ల ఆదాయం వచ్చింది. ఈఎస్పీఎన్, పెప్సీ, వీసా వంటి యాడ్స్‌లో సచిన్ నటించాడు. ఆ ఆదాయాన్ని క్రికెట్ ఆదాయంగా చూపించుకోలేదు. నటులు, రచయితలు, కళాకారులు ఉపయోగించే సెక్షన్ 80 ఆర్ఆర్ ట్యాక్స్ ప్రయోజనం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. 30 శాతం అంటే 1.77 కోట్లకు పన్ను మినహాయింపు ఇవ్వాలని సచిన్ అభ్యర్థించాడు. వాస్తవానికి ఆదాయపన్ను శాఖ అధికారులు మినహాయింపు ఇచ్చేందుకు తొలుత అంగీకరించలేదు. క్రికెటర్లకు యాడ్స్‌లో నటించే అవకాశం వస్తుందని, దీన్ని మరో ఆదాయంగా పరిగణించలేమని, 80ఆర్ఆర్ రూల్ వర్తించదు అని ఆ శాఖ చెప్పింది. కానీ సచిన్... యాడ్స్ కోసం మోడలింగ్ చేశానని, ఇది నటుల వృత్తి అని, దీనికి 80ఆర్ఆర్ నిబంధన వర్తిస్తుందని వాదించాడు. చివరకు సచిన్ వివరణతో సంతృప్తి చెందిన ఆదాయపన్ను అధికారులు పన్ను మినహాయింపు కల్పించారు. దీంతో సచిన్‌కు రూ.58 లక్షల పన్ను మినహాయింపు వచ్చింది.

నకిలీ బార్క్ సైంటిస్ట్ అరెస్ట్

ముంబై: దేశంలో ప్రముఖ అణు పరిశోధనా సంస్థ అయిన బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్)కు చెందిన నకిలీ శాస్త్రవేత్తను పోలీసులు అరెస్టు చేశారు. అనుమానాస్పద అణు డేటా, 14 మ్యాప్‌లను అతడి నుంచి స్వాధీనం చేసుకున్నారు. సున్నితమైన అణు సమాచారాన్ని విదేశీ నెట్‌వర్క్‌లకు అతడు చేరవేసినట్లు అనుమానిస్తున్నారు. గత వారం ముంబైలోని వెర్సోవాలో అక్తర్ హుస్సేనిని ముంబై పోలీసులు అరెస్టు చేశారు. వివిధ పేర్లుతో కూడిన ఐడీలతో శాస్త్రవేత్తగా అందరిని నమ్మించినట్లు తెలుసుకున్నారు. నకిలీ బార్క్ ఐడీలు, నకిలీ ఆధార్, పాన్ కార్డులు, నకిలీ పాస్‌పోర్టులు స్వాధీనం చేసుకున్నారు. ఒక ఐడీలో అలీ రజా హుస్సేన్, మరో ఐడీలో అలెగ్జాండర్ పామర్ అని ఉన్నట్లు గుర్తించారు

. అక్తర్ హుస్సేని కొన్ని నెలలుగా అనేక అంతర్జాతీయ కాల్స్ చేసినట్లు, మరోవైపు తన గుర్తింపును మార్చుకుని మారువేషంలో జీవించినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. నకిలీ పాస్‌పోర్ట్‌లతో దుబాయ్, టెహ్రాన్‌తో పాటు ఇతర దేశాలకు అతడు ప్రయాణించినట్లు పోలీసులు తెలుసుకున్నారు. అక్తర్ హుస్సేని జార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్‌కు చెందినవాడు.

చాబహార్ పోర్ట్‌పై భారత్‌కు ఊరట

ఆంక్షల మినహాయింపు పొడిగించిన అమెరికా

న్యూఢిల్లీ: ఇరాన్‌లోని చాబహార్ పోర్టు విషయంలో భారత్‌కు ఊరట లభించింది. వచ్చే ఏడాది ప్రారంభం వరకు అమెరికా ఆంక్షల నుంచి దీనికి మినహాయింపు దొరికింది. అమెరికా గతంలో ఇచ్చిన మినహాయింపునకు గురువారంతో గడువు ముగిసింది. మళ్లీ ఈ గడువు పొడిగింపు రావడంతో భారత్‌కు ఊరట లభించింది. దీంతో చాబహార్ పోర్ట్‌లోని షహీద్ బెహెస్తీ టెర్మినల్ అభివృద్ధి, నిర్వహణ పనులకు భారత్‌కు వీలు కలిగింది. మధ్య ఆసియా దేశాలతో భారత్ వాణిజ్యం నెరపడానికి చాబహార్ పోర్టు ప్రధాన మార్గంగా ఉంది. ఈ పోర్టు అభివృద్ధి, నిర్వహణలో భారత్‌దే కీలక పాత్ర. ఇప్పటికే న్యూఢిల్లీ ఈ ప్రాజెక్టులో భారీగా పెట్టుబడులు పెట్టింది. కజకిస్థాన్, కిర్గిజ్ రిపబ్లిక్, తజికిస్థాన్, తుర్క్‌మెనిస్థాన్, ఉజ్బెకిస్థాన్ వంటి దేశాలకు భారత్ ఇక్కడి నుంచి సరకు రవాణా చేస్తోంది. పాకిస్థాన్‌తో సంబంధం లేకుండా అఫ్గానిస్థాన్‌కు భారత్ అందించే ఆహార ధాన్యాలను ఈ మార్గంలోనే పంపిస్తున్నారు. ఇదిలాఉంటే... ఈ ఓడరేవులో పదేళ్ల పాటు టెర్మినల్ నిర్వహణ కోసం గత ఏడాది భారత్-ఇరాన్ మధ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం తర్వాత భారత్‌కు అమెరికా హెచ్చరికలు చేసింది. 'ఇరాన్‌పై అమెరికా కొన్ని ఆంక్షలు విధించింది. వాటి అమలు కొనసాగుతూనే ఉంటుంది. ఏ సంస్థ అయినా, దేశమైనా టెహ్రాన్‌తో వ్యాపార లావాదేవీలు జరిపితే... వారు కూడా వాటి పరిధిలోకి వస్తారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి' అని హెచ్చరించింది. ఆ ఒప్పందాన్ని సంకుచిత దృష్టితో చూడకూడదని అప్పట్లో విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ అన్నారు.

విశాలాంధ్ర
హైదరాబాద్

రక్తదానం మరొకరికి ప్రాణదానం

విశాలాంధ్ర , కాప్రా : రక్తదానం చేసి ప్రాణాపాయంలో ఉన్న వారిని ఆదుకోవాలని మల్కాజిగిరి డీసీపీ పద్మజా అన్నారు. మల్కాజిగిరిజోన్ పరిధిలోని 11పోలీసు స్టేషన్ల ఆద్వర్యంలో గురువారం నాచారంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతో మంది ప్రమాదాలకు గురవడమే కాకుండా, ఇతరత్రా ఆరోగ్య సమస్యలను ఎదుర్కొం టున్నారని, ఇలాంటి వారికి సరైన సమయానికి రక్తం అందక, రక్తదాతలు లభించక అకాల మరణం పొందుతున్నారన్నారు. ఇలాంటి ఆపద సమయాల్లోమనం చేసేరక్తదానం ఎంతో మంది ప్రాణాలుకాపాడు తుందన్నారు. ప్రతి ఒక్కరు రక్త దానం చేయాలని, రక్తదానంపై అవగాహన కలిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 529 మంది పౌరులు, పోలీస్ అధికా రులు పాల్గొని రక్తదానం చేశారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, సమాజానికి సేవ చేయడం ద్వారా వారి స్ఫూర్తిని కొనసాగించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని డీసీపీ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు చక్రపాణి,వెంకట్ రెడ్డి, మల్కాజిగిరి జోన్పరిధిలోని 11 పోలీసు స్టేషన్లకు చెందిన సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అక్బరుద్దీన్ షా దర్గాలో ఉర్సుఉత్సవాలు

విశాలాంధ్ర షాద్నగర్ రూరల్ : రంగారెడ్డి జిల్లా షాద్నగర్ ఫరూక్నగర్లోని నాగులపల్లి రోడ్డులో ఉన్న సయ్యద్ అక్బరుద్దీన్ షా ఖాద్రి దర్గాలో ఉర్సు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సయ్యద్ షాబుద్దీన్, సయ్యద్ అజహారుద్దీన్ హాఫెజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రిజ్వాన్ పాషా ఖాద్రీ, అజిత్ ఉల్లాఖాద్రి, మునవర్ హాఫెజ్, ఎతేషాం, నదీమ్ హాఫెజ్, షోయబ్ హాఫెజ్లు హాజరయ్యారు. ఇందులో భాగంగా ఫరూక్ నగర్ లోని జామియా మస్జీద్ దగ్గర నుంచి ర్యాలీగా గంధాన్ని తీసుకువెళ్లి అక్బరుద్దీన్ షా దర్గాలో పూలతో, చాదర్లతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మీలాద్, నాతే షరీఫ్, భక్తి గీతాలు ఆలపించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా అతిథులకు ఘనంగా సన్మానించారు.

తప్పిన పెను ప్రమాదం

విశాలాంధ్ర, మల్కాజిగిరి : గౌతమ్ నగర్-మల్లికార్జున నగర్ ప్రధాన రహదారి పక్కల ఉన్న కొండ మీద నుంచి పెద్ద బండరాయి జారీ పడి అక్కడే నిలిపిన చెత్త ఆటో మీద పడింది. ఆ రాయి దాటికి మున్సిపల్ వాళ్ళు ఇచ్చిన చెత్త ఆటో నుజ్జు నుజ్జు అయ్యింది. బండ పెద్దగా ఉండి రోడ్ కు మధ్యలో పడడం వల్ల ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడింది. ప్రతి శనివారం ఇక్కడ కూరగాయల మార్కెట్ నిర్వహిస్తుంటారు. ఆ సమయంలో జరిగి ఉంటే ప్రాణ నష్టం జరిగేదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఇంకా కొన్ని బండ రాళ్ళు ప్రమాద స్థాయిలో ఉన్నాయి. అవి కూడ ఇలా పడే స్థితిలో ఉన్నాయని, వాటిని కూడ తొలగించాల్సిన అవసరం వుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. 1985 ప్రాంతంలో పెద్ద రాళ్లను తొలగించి రోడ్ ఏర్పాటు చేసి గౌతమ్ నగర్ వరకు బస్లను ఏర్పాటు చేయడం జరిగిందని, కాలనీ వాసులు, రాజకీయ నాయకులు, జిహెచ్ఎంసి అధికారులు స్థలం పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని ట్రైన్ బస్ ట్రావెల్లర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నూర్ విజ్ఞప్తి చేశారు.

విజిలెన్స్ పాత్ర, బాధ్యతలపై అవగాహన

విశాలాంధ్ర, హైదరాబాద్ : 2025 విజిలెన్స్ అవేర్నెస్ వీక్ను దృష్టిలో ఉంచుకుని, హైదరాబాద్ సిటీ-I యూనిట్లోని విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ విభాగం గురువారం తెలంగాణలోని హైదరాబాద్లోని ఆర్టీసీ రోడ్లోని నాబార్డ్ (నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్మెంట్) ప్రాంతీయ కార్యాలయంలో కార్యక్రమాన్ని నిర్వహించింది. సమావేశానికి ఆర్. గణపతి. నాబార్డ్ జనరల్ మేనేజర్, ఎం.వి.ఎస్.ఎస్. శ్రీనివాస్, డిజిఎం (అడ్మిన్), జి. శ్రీనివాస్, హైదరాబాద్ సిటీ-1 ప్రాంతీయ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి, నాబార్డ్ డిజిఎంలు, సిబ్బంది హాజరయ్యారు. సమావేశంలో, రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ విభాగం యొక్క ప్రాముఖ్యత, పాత్ర , బాధ్యతల గురించి అందరి భాగస్వామ్య బాధ్యత గుర్తు చేశారు. విధి నిర్వహణలో నిబద్ధత, జవాబుదారితనం మరియు పారదర్శక ప్రాముఖ్యతని నాబార్డ్ అధికారులకు వివరించారు.

ముంపు ప్రాంతాల్లో శాశ్వత చర్యలు చేపట్టాలి

- ముంపు శాశ్వత పరిష్కారానికి వెయ్యి కోట్లు కేటాయించాలి
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు
- ముంపు ప్రాంతాల్లో పర్యటించిన సీపీఐ బృందం

విశాలాంధ్ర, హనుమకొండ : వరంగల్ నగరంలోని ముంపు ప్రాంతాల్లో శాశ్వత చర్యలు చేపట్టాలని అందుకు ప్రభుత్వం వెయ్యి కోట్లు కేటాయించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మొంథా తుపాన్ ప్రభావంతో నీట మునిగిన నగరంలోని పలు ప్రాంతాలను సీపీఐ బృందం గురువారం సందర్శించింది. నగరంలోని హనుమకొండ బస్టాండ్, ములుగు రోడ్, హనుమాన్ నగర్, పలువేల్పుల, గోపాల్ పూర్, సమ్మయ్య నగర్, వరంగల్ లోని హంటర్ రోడ్ తదితర ప్రాంతాలను సీపీఐ నాయకులు సందర్శించి స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ముంపు ప్రాంతాలను పరిశీలించిన అనంతరం సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతీ ఏటా వర్షాకాలంలో భారీ వర్షాలకు వరంగల్ నగరం అతలాకుతలం అవుతున్న దని, లోతట్టు ప్రాంత కాలనీలతో సహా రోడ్లు అన్నీ నీట మునుగుతున్నాయని అన్నారు. ఈ సారి మొంథా తుపాన్ ప్రభావం కారణంగా అత్యంత భారీ వర్షాలు కురియడంతో వరంగల్, హనుమకొండ, కాజీపేట ట్రైసిటీస్ పూర్తిగా నీట మునిగి ప్రజలు ఇండ్లలో నుండి బయటికి రాలేని పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. గతంలో వరంగల్ను రెండవ రాజధానిగా చేస్తామని ప్రగల్భాలు పలికిన పాలకులు నగరాన్ని పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశారని అన్నారు. ప్రతీ ఏటా కాలనీలు నీట మునుగుతున్నా గత ప్రభుత్వాలు శాశ్వత పరిష్కారం కోసం నిధులను కేటాయించలేదని, దీంతో అదే పరిస్థితి ప్రతి ఏటా పునరావృతం అవుతున్నదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అయినా ముంపు ప్రాంతాల శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని, అందుకు రూ. 1000 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ సిటీ, హెరిటేజ్ సిటీగా ప్రకటించిన కేంద్రం ప్రకటనలకే పరిమితం అయింది తప్ప నిధుల కేటాయింపులో సవతి తల్లి ప్రేమను కనబరుస్తూ వస్తున్నదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యదర్శి సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు అశోక్ స్టాలిన్, మునిగాల బిక్షపతి, ఏదునూరి వెంకట్రాజం, బాషబోయిన సంతోష్, బత్తిని సదానందం, గుంటి రాజేందర్, అలువాల రాజు, జూకంటి పద్మ, పొనుగోటి రాములు, గోపాల్ చారి, పూజారి అమృతయ్య, రమ పాల్గొన్నారు.

రైతాంగాన్ని ఆదుకోవాలి : రాష్ట్ర రైతు సంఘం

విశాలాంధ్ర, హైదరాబాద్ : మొంథా తుపాన్ ప్రభావంతో ఏకధాటి వర్షాల వల్ల పంటలు నష్టపోవటంతో పాటు జనజీవనం స్తంభించిపోయింది. ఉమ్మడి నల్లగొండ, వరంగల్, ఖమ్మం, జిల్లాలలో వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలు నేలపాలయ్యాయి. నీటిలో మునిగి పూర్తిగా దెబ్బతిన్నాయి. ఐదు లక్షలకు పైగా ఎకరాలలో పంటలు ఉద్యానపంటలు దెబ్బతిన్నాయి. విపరీతమైన గాలికి చేతికి వచ్చిన వరిపంట వంగిపోవడం పూర్తిగా నీటి పాలవటం జరిగింది. కామారెడ్డి పెద్దపల్లి జిల్లాలలో మార్కెట్ యార్డులలో ఆరబెట్టిన ధాన్యం కొట్టుకపోయింది. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో వరి, పత్తి పంటలను కాపాడటానికి తగు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించడం సంతోషకరమైనది. త్వరితగతిన నష్టపోయిన పంటలను సర్వే చేసి వరికి ఎకరాకు రూ.30000, పత్తికి ఎకరాకు 50 వేలు మొక్కజొన్నకు ఎకరాకు రూ.20 వేలు, ఉద్యాన పంటలకు ఎకరాకు రూ.50 వేలు నష్టపరిహారం ఇచ్చి రైతాంగాన్ని ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఏఐకేఎస్) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి భాగం హేమంతరావు, పశ్యపద్మ డిమాండ్ చేశారు. గతంలో దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం కేంద్ర పాలకులు ఇవ్వలేదు. అదే పరిస్థితి నేడు ఏర్పడకుండా కేంద్రపాలకులపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడిని తీవ్రతరం చేయాలని రైతులకు నష్టపరిహారం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్ చేస్తుందన్నారు. తుపాన్ వల్ల ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబానికి కోటి రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని, పశువులు ఇతర జీవాలు ప్రాణాలు కోల్పోతే ఆ బాధిత కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్ చేసింది.

ఏసీబీ వలలో రామారావు

విశాలాంధ్ర - హైదరాబాద్ : యాదాద్రి యాదగిరిగుట్ట దేవస్థానం సీనియర్ ఇంజనీర్ ఉడేపు రామారావును లంచం కేసులో ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. ఒక ప్రైవేట్ కాంట్రాక్టర్ నుండి రూ.1.90 లక్షల లంచం స్వీకరిస్తుండగా హైద్రాబాద్లోని ఉప్పల్లో దుకాణంలో ఆయనను రెడ్హ్యాండెడ్గా పట్టుకున్నారు. విచారణ నిమిత్తం రామారావును యాదగిరిగుట్టకు తీసుకువెళ్లిన ఏసీబీ అధికారులు, ఆయనకు చెందిన పలు ఆస్తులు, అలాగే బంధువుల ఇళ్లలో సోదాలు చేస్తున్నారు. ఇదివరకే రామారావుపై అనేక ఆరోపణలు ఉన్నాయని, పలుమార్లు కేసులు నమోదు అయ్యాయని సమాచారం. ప్రస్తుతం సిటీ సివిల్ కోర్టులో కొందరిని మోసం చేశారన్న సివిల్ కేసు కూడా నడుస్తోంది. వందల ఎకరాల భూములను బంధుమిత్రుల పేర్లపై సమకూర్చారనే ఆరోపణలు కూడా యాదగిరిగుట్ట స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి.

ఏసీబీకి పట్టుబడ్డ టీఎస్ ట్రాన్స్ కో డీఈ

మెదక్ జిల్లా ట్రాన్స్కో కార్యాలయంలో సంగారెడ్డి ఏసీబీ అధికారులు రైడ్ చేయగా డీఈ మహమ్మద్ షరీఫ్ ఖాన్ రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డారు. పాపన్నపేట మండలం సీతానగరం గ్రామానికి చెందిన వ్యక్తి కొత్త పౌల్ట్రీ ఫారం ఏర్పాటు చేసుకొనుగా అందుకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చుటకు డీఈ రూ.40 వేల రూపాయలు డిమాండ్ చేయగా 30వేల ఇచ్చుటకు ఒప్పందం కుదిరింది. ముందుగా తొమ్మిది వేలు చెల్లించినారు. గురువారం 21 వేల రూపాయలు లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.

నైపుణ్యాభివృద్ధి శిక్షణ

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ ఆధ్వర్యంలో, వారధి ట్రస్ట్ సహకారంతో ఉద్యోగావకాశాలతో కూడిన నైపుణ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయనీ రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి, ఎన్ ఏసి వైస్ చైర్మన్ కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సివిల్ సూపర్వైజర్ ఎలక్ట్రిషియన్ కోర్సులు అందుబాటులో ఉన్నాయనీ, శిక్షణతో పాటు ఉచిత భోజనం,నివాసం మరియు వసతి సదుపాయాలు కల్పించబడతాయన్నారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన అభ్యర్థులకు సర్టిఫికేట్ తో పాటు ఉద్యోగావకాశాలు అందించబడుతాయని,ఈ శిక్షణ కార్యక్రమం నవంబర్ 3 నుండి నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ హైదరాబాద్ లో ప్రారంభమవుతుందనీ మంత్రి తెలిపారు. శిక్షణకు సంబంధించిన మరిన్ని వివరాలకు 8008937800 / 9032504507 సంప్రదించాలన్నారు.

ఓటు వేసేందుకు ప్రత్యేక గుర్తింపు కార్డు తీసుకురావాలి

విశాలాంధ్ర, హైదరాబాద్ : నవంబర్ 11న జరగనున్న జూబ్లీ హిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక పోలింగ్లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఓటరు జాబితలో పేరుండి, ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్ కార్డు) కాకుండా ఈ క్రింద చూపిన 12 ప్రత్యామ్నాయ ఫోటో ఐడిలలో దేనినైనా ఒకటి పోలింగ్ సిబ్బందికి చూపి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చునని జిహెచ్ఎంసి కమిషనర్ , జిల్లా ఎన్నికల అధికారి ఆర్ వి కర్ణన్ తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేసారు. ఆధార్, ఉపాధిహామీ జాబ్ కార్డు, బ్యాంకు, తపాల కార్యాలయం జారీ చేసిన ఫోటోతో కూడిన పాస్ బుక్, కేంద్ర కార్మికశాఖ జారీచేసిన ఆరోగ్యబీమా స్మార్ట్ కార్డు లేదా ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, నేషనల్ పాపులేషన్ రిజిస్టర్(ఎన్ఎఐ) కింద రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సెస్ కమిషనర్ ఇండియా జారీ చేసిన స్మార్ట్ కార్డు, భారతీయ పాస్ పోర్ట్, ఫోటోతో కూడిన పెన్షన్ పత్రాలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, పీఎస్ యూలు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు జారీ చేసిన ఉద్యోగ గుర్తింపు కార్డులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు జారీ చేసిన అధికారిక గుర్తింపు కార్డులు, కేంద్ర సామాజిక న్యాయ సాధికారత మంత్రిత్వ శాఖ జారీ చేసిన యూనిక్ డిజేబుల్ గుర్తింపు కార్డు (యూడీఐడీ)లు కలిగి ఉండాలనీ జిల్లా ఎన్నికల అధికారి చెప్పారు. ఓటరు జాబితాలో పేరు ఉండి ఓటరు గుర్తింపు కార్డు లేకున్నా, ఈ 12 ఫోటో కార్డులో ఏ గుర్తింపు కార్డు ఉన్న ఓటు వేయవచ్చునని జిహెచ్ఎంసి కమిషనర్ , జిల్లా ఎన్నికల అధికారి ఆర్ వి కర్ణన్ తెలిపారు.

ప్రజలకు పారదర్శక సేవలు : శిఖాగోయల్

విశాలాంధ్ర, హైదరాబాద్ : ప్రతీ వ్యక్తి కేవలం వృత్తి జీవితంలోనే కాకుండా నిత్య జీవితంలోనూ నీతి, నిజాయతీల అత్యున్నత ప్రమాణాలను పాటించినప్పుడే అన్ని వ్యవస్థలు సక్రమంగా పనిచేయడమే కాకుండా ప్రజలకు పారదర్శక సేవలు అందించడం సాధ్యమవుతుందని రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ జనరల్, ఎక్స్ అఫీషియో ప్రిన్సిపల్ సెక్రటరీ శిఖా గోయల్ పేర్కొన్నారు. భారతీయ ఇతిహాసాలతోపాటు శతాబ్దాలుగా వస్తున్న వారసత్వ విలువల్లోనూ సత్య, ధర్మ మార్గంలో వెళ్లాల్సిన ఆవశ్యకతను ప్రబోధించిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా హైదరాబాద్ సింగరేణి భవన్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. విజిలెన్స్ వారోత్సవాలను కేవలం వారం రోజులకు పరిమితం చేయకుండా అన్ని రోజులు నిబద్ధతతో పనిచేయాలన్నారు. నీతి, నిజాయతీ, పారదర్శకత పాటించడం వల్ల కష్టాలు మాత్రమే మిగులుతాయి, పనులు పూర్తి కావన్న అపనమ్మకాన్ని దూరం చేసుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరూ ప్రతీ అంశాన్ని మానవీయ కోణంతో చూడాలన్నారు. నిజాయతీతో పనిచేయడం ద్వారా ఢిల్లీ మెట్రో రైలును సకాలంలో, తక్కువ ఖర్చుతో పూర్తి చేయగలమని శ్రీధరన్ నిరూపించారని, సహకార రంగంలో పారదర్శకతను పాటించడం ద్వారా అమూల్ ద్వారా క్షీర విప్లవాన్ని సృష్టించిన కురియన్లు నైతిక విలువలకు గొప్ప నిదర్శనమని పేర్కొన్నారు. విజిలెన్స్ అంటే ప్రతీ ఒక్కరినీ నేరస్థులుగా చూడటం, నేరస్థులను పట్టుకోవడం కాదని, నేరం జరగకుండా, ఎవరూ నేరం చేయడానికి సిద్ధపడకుండా పకడ్బందీ వ్యవస్థను ఏర్పాటు చేయడమే విజిలెన్స్ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. దేశానికి వెలుగులు పంచుతున్న సింగరేణి ఉద్యోగులను ఉద్దేశించే అవకాశం కల్పించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి సీఎండీ ఎన్.బలరామ్ అధ్యక్షోపన్యాసం చేస్తూ.. సింగరేణి 136 ఏళ్ల ప్రస్థానంలో సాధించిన విజయాలను, సింగరేణి ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో చేపడుతున్న విస్తరణ ప్రణాళికలను, సింగరేణిలో మహిళా సాధికారత కోసం చేపట్టిన చర్యలను వివరించారు. అనంతరం శిఖా గోయల్ను ఘనంగా సన్మానించారు. సంస్థ డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ, కె వెంకటేశ్వర్లు, గౌతమ్ పొట్రు, తిరుమల రావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూవ్ మెంట్ మరియు చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి.వెంకన్న, జీఎం(కో ఆర్డినేషన్) టి.శ్రీనివాస్, అన్ని ఏరియాల జీఎంలు, కార్పోరేట్ జీఎంలు, వివిధ విభాగాల అధిపతులు, అధికారులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు పార్టీ పరంగా ఇస్తే ఒప్పుకునేది లేదు : ఎంపీ

విశాలాంధ్ర, బషీర్ బాగ్ : లీగల్ గానే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ల కల్పించాలని, పార్టీ పరంగా ఇస్తే ఒప్పుకునేది లేదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య స్పష్టం చేశారు. రిజర్వేషన్లు అమలు అయ్యే వరకు పోరాటం ఆగదని ఆయన అన్నారు. లక్డీకాపూల్లోని ఓ ప్రైవేట్ హోటల్ లో బీసీ నేతలు గుజ్జ సత్యం, రాంమూర్తి గౌడ్, రామకోటి అధ్యక్షతన 130 బీసీ కుల సంఘాలతో బీసీ జాక్ చైర్మన్ రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ జాక్ రాష్ట్ర కో కన్వీనర్గా గుజ్జ సత్యం, పలు బీసీ సంఘాల నాయకులను కన్వీనర్లుగా నియమించారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ నవంబర్ రెండో వారం నుండి రాష్ట్ర వ్యాప్తంగా రథయాత్ర నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ సమావేశానికి గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాలువచ్చాయని పేర్కొన్నారు. మొన్న జరిగిన బంద్లో 350 మందిని అక్రమంగా అరెస్ట్ చేశారని, దేశం మన వైపు చూస్తుందన్నారు. భారత దేశంలో బీసీ కులాల ఉద్యమం తెలంగాణ నుండి ప్రారంభమైందని అభివర్ణించారు. బీసీ ఉద్యమానికి ప్రభుత్వాలు భయబడుతున్నాయని, కేసులు పెట్టడం అన్యాయం అని మండిపడ్డారు. పోరాడుతుంటే నాయకత్వం అదే వస్తుందని, బీసీలకు చట్టపరంగా రిజర్వేషన్లు అమలు అయ్యాకే నాజీవి పోతదని చెప్పారు. వేరే రాష్ట్రాలలో బీసీ ఉద్యమం లేదని, రాష్ట్రాలకు కూడా ఉద్యమం తీసుకెళదాం అన్నారు. బీసీ బిల్లు పార్లమెంటులో పెట్టి, రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం ఆగదని, ఇక సాధించవలసింది రాజ్యాధికారం మాత్రమేనని ఆయన చెప్పారు. మన బిడ్డలు ఎమ్మెల్యేలు అయ్యే స్థాయికి ఉద్యమాన్ని తీసుకెళ్లాలని సూచించారు. రెడ్డి జాగృతి వాళ్ళు కేసు వేసి ఆపడం ఎంత వరకు న్యాయం అని ఆయన ప్రశ్నించారు. ఉస్మానియా యూనివర్సిటీ మరొకసారి వీరవిజృంభణ చేయాలన్నారు. రాజ్యాధికారం సాధించడమే నా చివరి కోరిక అని ఆర్ కృష్ణయ్య వెల్లడించారు. సమావేశంలో సంఘాల నాయకులు నీల వెంకటేష్, శంకర్, అనంతయ్య, రాజ్ కుమార్, విజయ్ కుమార్, కొండా దేవయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా తెలంగాణ స్టాల్

విశాలాంధ్ర - హైదరాబాద్ : గురువారం న్యూఢిల్లీలోని భారత్ మండపం హాల్ నెం.14లో నిర్వహించిన భారత్ ఇంటర్నేషనల్ రైస్ కాన్ఫరెన్స్లో తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంతో కలిసి ఒక స్టాల్ను ఏర్పాటు చేసింది. తెలంగాణ బియ్యం ఎగుమతి సామర్థ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేసే ఉద్దేశంతో ఈ కాన్ఫరెన్స్ లో పాల్గొనట్టు.. తెలంగాణ రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ కమిషనర్, స్టీఫెన్ రవీంద్ర వివరించారు. ఈ సమావేశానికి వచ్చిన వివిధ దేశాల ప్రతినిధుల దృష్టిని తెలంగాణ స్టాల్ ఆకర్షించింది. కువైట్, ఆఫ్రికా దేశాల ప్రతినిధి.. ఎన్సీఈఎల్ ఎండీ ఉనుపోమ్ కౌసిక్, ఇండియన్ రైస్ ఎక్స్పోర్టర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు ప్రేమ్ గార్గ్, దేశవ్యాప్తంగా ఉన్న అనేక మంది ప్రముఖ బియ్యం ఎగుమతిదారులు తెలంగాణ స్టాల్ను సందర్శించారు. ఎంటీయూ 1010, ఆర్ఎన్ఆర్ 15048, బీపీటీ 5204, కేఎన్ఎం 1638, కేఎస్ఎం 118 - జై శ్రీరామ్, హెచ్ఎంటీ సోనా, చిట్టిముత్యాలు వంటి ప్రీమియం రకాల బియ్యాన్ని తెలంగాణ స్టాల్లో ప్రదర్శించారు. ఈ సందర్భంగా స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ తెలంగాణలో పండించే బియ్యాన్ని ఇప్పటికే పిలిప్పిన్స్కు ఎగుమతి చేస్తున్నాం. అలాగే మిడిల్ ఈస్ట్, ఆఫ్రికా దేశాలకు ఎగుమతి చేసేలా ప్రయత్నాలు చేస్తున్నాం. బియ్యం ఎగుమతి పెరిగితే.. తెలంగాణ రైతులకు చాలా మేలు జరుగుతుంది' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ కమిషనర్, ఎక్స్-అఫీషియో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎం. స్టీఫెన్ రవీంద్ర, సెక్రెటరీ కోఆర్డినేషన్ డాక్టర్ గౌరవ్ ఉప్పల్, తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ అదనపు డైరెక్టర్ రోహిత్ సింగ్ ,ఇతర పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు .

అవకతవకలపై చర్యలు తీసుకోవాలి

ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్

విశాలాంధ్ర, హైదరాబాద్ : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నర్సింగ్ స్కూళ్లు, కళాశాలల అవకతవకలపై పూర్తి స్థాయి విచారణ జరిపి,చర్యలు తీసుకోవాలని, డీఎంఈ, నర్సింగ్ రిజిస్ట్రార్, సీనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్ లను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో కోఠిలోని మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కార్యాలయం ముందు నిరసన ధర్నా నిర్వహించి, అనంతరం డైరెక్టర్ నరేంద్ర కుమార్ పేషీలో ఏఐవైఎఫ్ రాష్ట్ర బృందం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ. కల్లూరు ధర్మేంద్ర. మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నర్సింగ్ స్కూళ్లు, కళాశాలల అవకతవకలపై విచారణ జరపాలి. 5 సంవత్సరాలుగా ప్రభుత్వం ఇచ్చినటువంటి జీవో ప్రకారం సంబంధిత చిరునామాల్లో నర్సింగ్ స్కూల్స్, కళాశాలలు నిర్వహించ కుండా ఇతర ప్రాంతాల్లో, జిల్లాల్లో నిర్వహిస్తున్నారని, ఒకే భవనంలో 2 నుండి 6 ఇన్స్టిట్యూషన్స్ నిర్వహించడం, భవనాలు, ఫ్యాకల్టీ, మౌలిక వసతులు, విద్యార్థులు క్లినికల్ సైడ్ ప్రాక్టీస్ చేస్తున్నారా లేదా అనే విషయాల పట్ల బాధ్యతా రహితంగా వ్యవహరిస్తున్నారని వారు ధ్వజమెత్తారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించి విద్యార్థుల భవిష్యత్తును, ప్రభుత్వ వ్యవస్థని భ్రష్టు పట్టించిన ఈ అధికారుల పైన, మరియు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ లో నర్సింగ్ ఎడ్యుకేషన్ సెక్షన్ సీనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న దాసు కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాస్ ల పైన ఏసీబీ ద్వారా విచారణ చేయించి కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నర్సింగ్ కళాశాలల్లో లెక్చరర్ ప్రమోషన్లలో తీవ్ర జాప్యం చోటు చేసుకుంటున్నదని, ఏడాదిగా ప్రమోషన్లు చేపట్టకపోవడంతో దాదాపు 200 మందికిపైగా నర్సింగ్ ఆఫీసర్లు తీవ్ర ఆందోళన చెందు తున్నారన్నారు. స్టాఫ్ నర్సులుగా పనిచేస్తూ ఎంఎస్సీ నర్సింగ్ చేసిన వారికి ఈ పదోన్నతులు ఇవ్వాల్సి ఉండగా.. అధికారుల అలసత్వం కారణంగా ఈ ప్రక్రియ ముందుకు సాగడం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 560 లెక్చరర్ పోస్టులు ఖాళీగా ఉండగా, ఇటీవల 93 మందికి అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పించారని, దీంతో ఖాళీల సంఖ్య 653కు చేరిందన్నారు. అదే విధంగా నర్సింగ్ ఆఫీసర్లకు లెక్చరర్ పోస్టులు ఇప్పిస్తానని చెప్పి డీఎంఈ కార్యాలయంలో పని చేసే ఓ మహిళాధికారి గతంలో 100 మంది వద్ద ఒక్కొక్కరి నుంచి రూ.10 వేలు వసూలుచేసినట్టు ఆరోపణలున్నాయన్నారు. ఇటీవల 12 మందికి అర్హత లేకున్నా.. ప్రమోషన్లు కల్పిస్తానని చెప్పిన సదరు మహిళాధికారి ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.2 లక్షలు వసూలు చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో నర్సింగ్ విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ.. తగిన సంఖ్యలో బోధనా సిబ్బంది లేకపోవడంతో తరగతుల నిర్వహణలో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. కొత్తగా ఏర్పాటుచేసిన ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల్లో శాశ్వత అధ్యాపకులు లేకపోవడం వల్ల క్లినికల్ శిక్షణ సజావుగా సాగడంలేదన్నారు. రాష్ట్రం లోని కొన్ని నర్సింగ్ కాలేజీల్లో 20 మంది అధ్యాపకులు ఉండాల్సి ఉండగా.. కేవలం ఇద్దరు చొప్పున ఉన్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా వెంటనే స్పందించి ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి. సత్య ప్రసాద్, శ్రీమాన్ రాష్ట్ర సమితి సభ్యులు ఆర్. బాలకృష్ణ, పి. శివ కుమార్, షేక్ మహమూద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రచారంలో దూకుడు పెంచిన బీఆర్ఎస్

విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ :ప్రత్యర్థుల అంచనాలను తలకిందులు చేస్తూ భారీ మెజార్టీ దిశగా వ్యూహ, ప్రతి వ్యూహాలు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేడి రాజేసింది. ప్రత్యర్థుల అంచనాలు తలకిందులు చేస్తూ బీఆర్ఎస్ ఊహ ప్రతి వ్యూహాలకు పదును పెట్టి ముందుకు దూసుకెళ్తుంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీత గోపినాథ్ గురువారం మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎమ్మెల్సీ తాత మధు, మాజీ జడ్పీ చైర్ పర్సన్ తుల ఉమా, స్థానిక కార్పొరేటర్ దేదీప్య విజయ్, బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ అహ్మద్ గారి సతీమణి అయేషా తో కలిసి వెంగళరావు నగర్ డివిజన్ లోనీ వికాస్ పురి కాలనీ, సిద్ధార్థ నగర్, ఏజీ కాలనీలలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. కాలనీవాసులు అడుగడుగునా మాగంటి సునీతమ్మపై ఆధరాభిమానాలు చూపిస్తూ విజయం ఎప్పుడో నిర్ణయించబడిందని, మెజార్టీ ఏ మిగిలిందని తెలిపారు. భారీ మెజార్టీతో జూబ్లీహిల్స్ గడ్డపై బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలన్నారు. మీ ఆకాంక్షల మేరకు అభివృద్ధి పథంలో మీ వెనక నడవడానికి సిద్ధంగా ఉన్నామని భరోసానందించారు. అనంతరం ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావులు కృష్ణ కాంత్ పార్క్ సమీపంలో జెండా ఊపి పైకి మహిళా బైక్ ర్యాలీ ప్రారంభించారు.మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తానన్న ప్రతినెల రూ.2500 , కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ రూ 1 లక్ష చెక్కుతోపాటు ఒక తులం బంగారం ఇస్తామన్న హామీ, చదువుకునే యువతులకు స్కూటీలు ఇస్తామన్న మరో హామీ నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను ముఖ్యంగా మహిళలను ఇబ్బందుల గురిచేస్తున్న నేపథ్యంలో ఈ ర్యాలీ నిర్వహించడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

నవీన్ యాదవ్‌కి మద్దతుగా ఇంటింటి ప్రచారం

విశాలాంధ్ర, జూబిలీహిల్స్ : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సందర్భంగా ఇంటింటి ప్రచారం నిర్వహించిన చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ ఇంకా గిరిధర్ వారితో పాటు యూసుఫ్ గూడా మాజీ కార్పొరేటర్ గుర్రం సంజయ్ గౌడ్, గురువారం లక్ష్మీ నరసింహ నగర్, శ్రీకృష్ణ నగర్ మొదలైన ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వి. నవీన్ యాదవ్ ని గెలిపించాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో వారితోపాటు పాల్గొన్నారు.

బీజేపీకి ఓటువేయండి : మంత్రి కిషన్ రెడ్డి

విశాలాంధ్ర, జూబిలీహిల్స్ : జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా గురువారం యూసఫ్ గూడా డివిజన్, శ్రీకృష్ణ నగర్ బి బ్లాక్, సి బ్లాక్‌లో బిజెపి అభ్యర్థి శ్రీలంకల దీపక్‌రెడ్డికి మద్దతుగా కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జీ. కిషన్‌రెడ్డి ప్రచారం చేశారు, ఈ ప్రచార కార్యక్రమంలో వివిధ కుల సంఘ నాయకులు, మేధావులను కలిసి బిజెపికి ఓటేయాల్సిందిగా కోరారు. ప్రచార కార్యక్రమంలో శ్రీకృష్ణ నగర్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు బుడుగు రవీందర్‌ని కలిసి వారి కుల సంఘం మద్దతు ఇవ్వాల్సిందిగా కిషన్‌రెడ్డి కోరారు, ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి,, జూబ్లీహిల్స్ అసెంబ్లీ బీజేపీ సీనియర్ నాయకులు గంగరాజు, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నేతలు

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేర్లింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్, మంత్రి జూపల్లి కృష్ణారావు,, మంత్రి వివేక్ వెంకటస్వామి, మంత్రి వాకిటి శ్రీహరి , జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కలిసి శ్రీమతి శిరీష సత్తుర్ జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎర్రగడ్డ, మోతీ నగర్, షేక్పేట్ తదితర ప్రాంతాలలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యావంతులైన నవీన్ యాదవ్ గెలుపుతో ప్రజలకు చాలా ఉపయోగకరమని, జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలు ఎంతగానో ఉపయోగపడతాయని ప్రతి ఒక్కరూ నవీన్ యాదవ్ గెలుపు కోసం కృషి చేయాలని ఆమె కోరారు. ఈ ప్రచారంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు, మైనారిటీ నేతలు, యువజన కాంగ్రెస్ సభ్యులు భారీగా పాల్గొన్నారు.

హార్ట్ టూ హెల్ప్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

విశాలాంధ్ర -మొయినాబాద్ : విద్యార్థుల విద్యాభివృద్ధికి హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ అందించే సేవలు అభినందనీయమని అమ్డాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కల్పన అన్నారు. అమ్డాపూర్ గ్రామ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల వార్షిక సంవత్సరం పరీక్ష ఫీజు రూ.3375లను హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ చెల్లించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు రేణుక మాట్లాడుతూ.. విద్యార్థుల అభివృద్ధికి ఇలాంటి స్వచ్ఛంద సంస్థలు మరిన్ని ముందుకు రావాలని కోరారు. అనంతరం దాత బి. సుచిత్ర, ట్రస్ట్ అధ్యక్షులు మూడే రవి నాయక్ లను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుంది : మంత్రి తుమ్మల

విశాలాంధ్ర బ్యూరో ఖమ్మం : మొంథా తుఫాన్ కారణంగా పేద ప్రజలు కోల్పోయిన ఇండ్లు, పశువులు, పంట, ఇతర నష్ట పరిహారం అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. గురువారం తుఫాన్ ప్రభావిత ప్రాంతాలైన కాల్వ ఒడ్డు బ్రిడ్జ్, నయాబజార్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రం, వెంకటేశ్వర నగర్, బొక్కలగడ్డ లలో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ వాతావరణ శాఖ మొంథా తుఫాన్ పై సమాచారం అందించిన వెంటనే జిల్లా కలెక్టర్, యంత్రాంగంను అప్రమత్తం చేసి ముందస్తు చర్యలో భాగంగా లోతట్టు ప్రాంతాల ప్రజలను రిలీఫ్ క్యాంపులకు తరలించడం జరిగిందని అన్నారు. రిలీఫ్ క్యాంపులో ఉన్న లోతట్టు ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన భోజన సౌకర్యాలు కల్పించామని అన్నారు. రాత్రి నిద్ర పోకుండా ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదను ప్రతి అరగంటకు ఒకసారి మానిటర్ చేస్తూ జిల్లా యంత్రాంగం పని చేసిందని మంత్రి ప్రశంసించారు. మున్నేరు నది 26 అడుగుల ఎత్తులో ప్రవహించిందని, నెమ్మదిగా నీటి ప్రవాహం తగ్గుతుందని మంత్రి అన్నారు. మున్నేరు నది పరివాహక ప్రాంతంలో ప్రాణ నష్టం జరగకుండా ప్రజలను కాపాడిన కలెక్టర్, పోలీసులకు, మున్సిపల్ కమీషనర్, ఇతర యంత్రాంగానికి మంత్రి అభినందనలు తెలియజేశారు. మొంథా తుఫాన్ వల్ల దెబ్బతిన్న పంట నష్టం అంచనాలను తయారు చేయాలని ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని మంత్రి తెలిపారు. జరిగిన పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పక్కా రిపోర్టు అధికారులు తయారు చేస్తారని మంత్రి తెలిపారు. తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకరించక పోయిన నష్టపోయిన ఎకరానికి 10 వేల రూపాయల పరిహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం, 11 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలుకు చర్యలు చేపట్టామని మంత్రి తెలిపారు. ప్రస్తుత సీజన్ లో మున్నేరు నది రిటైనింగ్ వాల్ పనులు పూర్తి చేస్తే భవిష్యత్తులో ఖమ్మం నగరానికి ఎటువంటి ప్రమాదం ఉండదని మంత్రి తెలిపారు. రిటైనింగ్ వాల్ పూర్తి చేయడంలో ప్రజలు సహకారం అందించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. అనంతరం మంత్రి దంసలాపురం వరద ప్రభావిత ప్రాంతంలో పర్యటించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలి :ఎమ్మెల్యే

విశాలాంధ్ర - మొయినాబాద్ : ప్రతీ ఒక్కరూ దైవ చింతన అలవర్చుకున్నప్పుడే మనసుకు ప్రశాంతత కలుగుతుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలోని నవాబ్ పేట మండలం చిట్టిగిద గ్రామంలో శ్రీశ్రీశ్రీ దత్తాత్రేయ స్వామి విగ్రహ, గ్రామ నాభిశిల బొడ్రాయి పునః ప్రతిష్ట మహోత్సవంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య పాల్గొని ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... శ్రీశ్రీశ్రీ దత్తాత్రేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మరియు గ్రామ నాభిశిల బొడ్రాయి పునః ప్రతిష్టాపన మహోత్సవంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని, గ్రామంలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. ఎమ్మెల్యేతో పాటు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు

విశాలాంధ్ర - మొయినాబాద్ : అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పామెన భీమ్ భరత్ అన్నారు. చేవెళ్ల నియోజకవర్గం షాబాద్ మండల పరిధిలోని కుమ్మరిగూడ గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేసి ఇళ్ల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతీ గ్రామానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో షాబాద్ మండలం వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నయ్య , షాబాద్ మండల మాజీ సర్పంచ్ తమ్మాలి రవీందర్, షాబాద్ ఎంపీటీసీ అశోక్, షాబాద్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సురేందర్ , మన్మరి మాజీ సర్పంచ్ సత్యనారాయణ , నర్సిములు , నవీన్ , ఆనంద్ , వెంకటేష్ , రవీందర్ రెడ్డి , సమీర్ పాషా, లక్ష్మి నారీ, మల్లయ్య, నరేష్, మల్లారెడ్డి, అనంతయ్య, పెద్దేటి మహేందర్, ఆయా గ్రామా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు గుడిసె రంగయ్య, గ్రామ ప్రజలు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక పోటీలు

విశాలాంధ్ర -మొయినాబాద్ : నవంబర్ 1,2,3వ తేదీల్లో ఎన్టీఆర్ విద్యాసంస్థల స్కూల్, జూనియర్, డిగ్రీ మహిళా కళాశాలలో క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఎన్టీఆర్ విద్యాసంస్థల డీన్ డా. రామారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...నవంబర్ 1, 2, 3 తేదీలలో క్రీడా మరియు సాంస్కృతిక పోటీలు ఎన్టీఆర్ విద్యాసంస్థలు హిమాయత్ నగర్ గండిపేట్ ఆవరణలో నిర్వహించబడుతాయన్నారు. ఈ పోటీలలో 50 పాఠశాలలు, 15 జూనియర్ మరియు డిగ్రీ కళాశాలలో నుండి 2000 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొంటాయని తెలిపారు. ఈ విభాగంలో కబడ్డీ, కోకో, వాలీబాల్ , కరాటే క్రీడలలో పోటీలు నిర్వహించబడతాయన్నారు. అన్ని కళాశాల విభాగంలో క్విజ్, ఉపన్యాసం, నృత్యం, గానం, చిత్రలేఖనం ,వర్ణ చిత్రకళ మొదలైన పోటీలు నిర్వహించబడుతాయని వివరించారు. ఎన్టీఆర్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ ఫెస్ట్ "లోక ధార" ప్రారంభోత్సవానికి ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ నారా భువనేశ్వరి , కె .రాజేంద్రకుమార్, సిఈఓ ఏ . గోపి, సి ఓ ఓ హాజరవుతారన్నారు. ముగింపు ఉత్సవానికి సౌమ్య మిశ్రా ఐపీఎస్, డైరెక్టర్ జనరల్ ప్రీసన్స్ తెలంగాణ ముఖ్యఅతిథిగా కె రాజేంద్ర కుమార్ సీఈవో అధ్యక్షత వహిస్తారని వెల్లడించారు. పూర్వా విద్యార్థినుల ప్రతిభను గురించి 25 మంది విద్యార్థినులను నారా భువనేశ్వరి సన్మానించనున్నారని వెల్లడించారు.

పెండింగ్ బిల్లులు, వేతనాలు విడుదల చేయాలి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : తెలంగాణ మధ్యాహ్న భోజనం పథకంలో పనిచేస్తున్న కార్మికులకు పెండింగు బిల్లులు, వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షుడు ఉన్నికృష్ణన్ కె.కార్యదర్శి ప్రేమలత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహిస్తూ అనంతరం అడిషనల్ కలెక్టర్ కి వినతి పత్రాన్ని అందించారు. ఉన్నికృష్ణన్ మాట్లాడుతూ పథకంలో పనిచేస్తున్న కార్మికులు పాఠశాలలు ప్రారంభం కానుంచి ఇప్పటివరకు ఎలాంటి బిల్లులు వేతనాలు అందక దసరా పండగ రోజు తమ కుటుంబాలను పస్తులించిన పరిస్థితి, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం లో దాపరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. నెలల తరబడి బిల్లులు వేతనాలు రాకపోతే ఎలా వంట వండి పెడతారని ప్రశ్నించారు. వెంటనే పెండింగ్ లో ఉన్న బిల్లులను విడుదల చేసి కార్మికులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. బిల్లులు సకాలంలో వచ్చిన రాకపోయినా ఎవరు ఎన్ని ఇబ్బందులకు గురిచేసిన విద్యార్థిని విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన భోజనం అందిస్తున్నారని పిల్లలని తమ కుటుంబ సభ్యుల వలె భావిస్తున్నారని అన్నారు. కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలను పెంచాలని అంగన్వాడి కేంద్రాల మాదిరిగా గుడ్లు సరఫరా ప్రభుత్వమే చేయాలని వంటకు సరిపడా గ్యాస్ను ప్రభుత్వమే పూర్తిగా ఉచితంగా ఇవ్వాలని కాటన్ దుస్తులు యూనిఫామ్ గా ఇవ్వాలని కనీస వేతనం 26 వేల రూపాయలు అమలు చేయాలని ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్ మధ్యాహ్న భోజన పథకం యూనియన్ నాయకులు విజయలక్ష్మి మంజుల జయతో పాటు కార్మికులు పాల్గొన్నారు..

బాధితులకు శ్రీకాంత్ పరామర్శ

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి: హైదరాబాద్ నుంచి బెంగుళూరు వెళ్తున్న వోల్వో బస్ కర్నూల్ వద్ద దగ్ధం అయినా ప్రమాదంలో గాయపడిన మియాపూర్ డివిజన్ పరిధిలోని ప్రజా షెల్టర్ అపార్ట్మెంట్స్ లో నివాసితులైన సూర్యను స్థానిక నాయకులు అపార్ట్మెంట్స్ అసోసియేషన్ సభ్యులతో కలసి మియాపూర్ డివిజన్ గౌరవ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పరామర్శించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రీకాంత్ మాట్లాడుతూ.. బస్ ప్రమాదంలో గాయపడిన సూర్యను ఈ రోజు స్థానిక నాయకులతో కలిసి పరామర్శించడం జరిగిందన్నారు. ప్రమాద సమయంలో సూర్య తనకు గాయాలు అయినా తోటి వారిని కాపాడినందుకు సూర్యను అభినందించారు, వారిని రక్షించే సమయంలో తన రెండు కళ్ళకు గాయాలు కావడం జరిగినది అని, సరైన వైద్యం తీసుకోవాలని సూచించారు, ప్రభుత్వం తరుపున సూర్యకు కావలసిన సహాయ సహకారాలు అందిస్తామని కార్పొరేటర్ శ్రీకాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ప్రతాప్ రెడ్డి, దామోదర్ రెడ్డి,నరేందర్ రెడ్డి, కాసర్ల శ్రీనివాస్,గోపాల కృష్ణ, శివారెడ్డి,శంకర్, శివయ్య, శివ ముదిరాజ్, రాయుడు, జయమ్మ,తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్స్,ఫీజురియంబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలి

విశాలాంధ్ర - మొయినాబాద్: అక్రమ పోలీసుల నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు అరుణ్ కుమార్ శ్రీనివాసులు అన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా పెండింగ్‌లో వున్నటువంటి రూ. 8500 కోట్ల స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలోని ఇంజనీరింగ్ కళాశాలలు శాంతియుతంగా బంధు నిర్వహిస్తున్నా ఎస్ఎఫ్ఐ నాయకులను కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యంతో కుమ్మక్కై పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి ఎస్ఎఫ్ఐ నాయకులను అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తరలించడం సరైంది కాదన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు స్కాలర్షిప్, ఫీజ్ రియంబర్స్మెంట్ చెల్లించకుండా చెలగాటమాడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి ఉద్యమాల ద్వారానే తెలంగాణ రాష్ట్రం వచ్చిందని ఇప్పుడు విద్యార్థి ఉద్యమాలను చూసి రాష్ట్ర ప్రభుత్వం భయపడుతుందన్నారు. తక్షణమే కాలర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన పోరాటాలు ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరిం చారు. ఎస్ఎఫ్ఐ చేవెళ్ల మండల కార్యదర్శి చందు ఎస్ఎఫ్ఐ నాయకులు రిషి, ఆకాష్, విష్ణు, కైఫ్,వినయ్ ,లోకేష్ ,శివకుమార్ ,శ్రీనివాస్ విద్యార్థుల పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ జయప్రదం చేయండి

విశాలాంధ్ర బ్యూరో, సంగారెడ్డి. ఆత్మగౌరవంతో జీవించాలని కోరుకునే దళిత ప్రజలు అలాగే న్యాయ వ్యవస్థ మీద గౌరవాన్ని నిలబెట్టడం, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడడం కోసం కులాలు, మతాలు, పార్టీలతో సంబంధం లేకుండా ప్రజలు పెద్ద ఎత్తున ఈ ర్యాలీకి తరలిరావాలి అని మందకృష్ణ మాదిగ కోరారు. గురువారం రెడ్డాస్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ స్థానంలో ఉన్న దళితుడికే రక్షణ లేకపోతే దేశంలో సామాన్య దళితులకు రక్షణ ఎలా ఉంటుందని అన్నారు. ఈ దాడి జరిగి నేటికి 20 రోజుల గడుస్తున్నా ఇప్పటికీ కేసు నమోదు చేయకపోవడం దారుణమన్నారు. జస్టిస్ గవాయ్ స్థానంలో ఉన్నత కులాలకు చెందిన జడ్జీ ఉంటే కేసు నమోదు చేయడంలో ఇలా నిర్లక్ష్యం చేసి ఉండే వారా? తను దళితుడు కాబట్టే స్పందించాల్సిన రాజ్యాంగ వ్యవస్థలు కూడా మౌనంగా ఉన్నాయని ప్రశ్నించారు. తక్షణమే దాడి ఘటన మీద కేసు నమోదు చేయాలి. నిందితుడిని అరెస్టు చేసి జైలులో పెట్టాలి. చీఫ్ జస్టిస్ గవాయిపై దాడి విషయంలో న్యాయాన్ని కోరుతూ నవంబర్ 1న లక్షలాది మందితో ఛలో హైదరాబాద్ పేరుతో దళితుల ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహిస్తామని , ఈ ర్యాలీలో జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో రామారాపు శ్రీనివాస్ మాదిగ రాష్ట్ర ఉపాధ్యక్షులు జిల్లా ఇంచార్జిపీఎస్ రాజు మాదిగ ఎమ్మెస్పీ రాష్ట్ర నాయకులు జిల్లా ఇన్చార్జ్ పెద్ద గీత మాదిగ ఎంఎంఎస్ రాష్ట్ర నాయకురాలు,అబ్రహాం మాదిగ ఎంఎస్పి జిల్లా అధ్యక్షులు, దేవరంపల్లి అశోక్ మాదిగ ఎం జె ఎఫ్ ఉమ్మడి జిల్లా ఇంచార్జ్, జిల్లా కన్వీనర్, నల్లోల్ల ప్రవీణ్ కుమార్ మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి వెలమల ప్రమోద్ మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి, రామ్ చందర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రా రాష్ట్ర అధ్యక్షుడిగావెంకటేష్ గుప్తా నియామకం

విశాలాంధ్ర, బషీర్ బాగ్ : ఆశ్రా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా నాగమల్ల వెంకటేష్ గుప్తాను నియమించారు. హైదరాబాద్‌లోని జూబ్లీ హిల్స్‌లోని జింఖానా క్లబ్‌లో అధికారిక ఆశ్రా రాష్ట్ర సమావేశం జరిగింది. ఆశ్రా విజయాలు, కొనసాగుతున్న కార్యక్రమాలు భవిష్యత్తు విస్తరణ ప్రణాళికలను సమీక్షించడానికి తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి ప్రతినిధులు విచ్చేశారు. ఆశ్రా ఇప్పటివరకు 275 వినియోగదారుల కేసులను గెలుచుకుందని, మధ్యవర్తిత్వం ద్వారా 10,000 కంటే ఎక్కువ ఫిర్యాదులను పరిష్కరించిందని, తెలుగు రాష్ట్రాలలో 500 కంటే ఎక్కువ వినియోగదారుల అవగాహన శిబిరాలను నిర్వహించినట్లు వెంకటేష్ గుప్తా వెల్లడించారు. గత ఎనిమిది సంవత్సరాల క్రితం స్థాపించిన ఆశ్ర కు ఇప్పుడు భారతదేశం అంతటా తొమ్మిది రాష్ట్రాలకు తన ఉనికిని విస్తరించింది, ఈ కార్యక్రమానికి ఆశ్ర వ్యవస్థాపకులు హబీబ్ సుల్తాన్ అలీ హాజరై, వినియోగదారుల రక్షణ చట్టం గురించి వివరించారు. తనపై నమ్మకంతో రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగించినందుకు వెంకటేష్ గుప్తా ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్రా తెలంగాణ వైస్ ప్రెసిడెంట్స్ కీర్తి, శ్రీధన్య, జనరల్ సెక్రటరీ ఎడిట్ పాయింట్ రమేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకట వీరేష్ , రాష్ట్ర పీఆర్వో ప్రశాంత్ , నేషనల్ అడ్మినిస్ట్రేషన్ మేనేజర్ ఎం శివకుమార్ కుమార్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డా.సౌరభ్ సురేఖ, కర్ణాటక రాష్ట్ర లీగల్ అడ్వైసర్ అడ్వకేట్ సి.హెచ్. సూర్య ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అగర్వాల్ సమాజ్ దీపావళి మిలన్

విశాలాంధ్ర, బషీర్ బాగ్: అగర్వాల్ సమాజ్ తరపున దీపావళి మిలన్ అన్నకూట్ ప్రసాద్ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహారాజా అగ్రసేన్‌జీకి పూజ, హారతి, దీపం వెలిగించడంతో ప్రారంభమైంది. శాఖ అధ్యక్షుడు పవన్ నారేటా అందరికీ హృదయపూర్వక స్వాగతం పలికి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్య అతిథులుగా అగర్వాల్ సమాజ్ తెలంగాణ అధ్యక్షులు అనిరుధ్ గుప్తా, గౌరవ కార్యదర్శి వికాస్ కేసరి, పూర్వ అధ్యక్షులు దుర్గా ప్రసాద్ నారేటాను శాలువాతో సన్మానించారు. పహాడీ హనుమాన్ మందిర్ ట్రస్టీ సుభాష్ గోయల్, అగర్వాల్ సమాజ్ తెలంగాణ పూర్వ అధ్యక్షులు దుర్గా ప్రసాద్ నారేటాను కూడా పదవీ అధికారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని కార్యనిర్వాహక సభ్యులు, ఉపాధ్యక్షుడు వాసుదేవ్ అగర్వాల్, సహ కార్యదర్శి దౌలత్ ప్రకాష్, కోశాధికారి ఉమేష్ అగర్వాల్, కేంద్ర కమిటీ సభ్యుడు మహేష్ నారేటా, సలహాదారులు ఖుషీ రామ్ అగర్వాల్, గజానంద్ అగర్వాల్, కార్యవర్గ సభ్యులు - వీరేందర్ అగర్వాల్, అనిల్ గోయెల్, భైరూలాల్, కైలాష్ చంద్, ఆశా దేవి సురేఖా, సందీప్ నరేటా, శాఖ సీనియర్ పౌరులు జగన్ ప్రసాద్ అగర్వాల్, మహిళలు, యువకులు అందరూ కలిసి ఈ దీపావళి మిలన్ అన్నకూట్ ప్రసాద్ వేడుకలో పాల్గొన్నారు.

సదరు ఉత్సవ వేడుకలకు జర్నలిస్టులకు ఆహ్వానం

విశాలాంధ్ర,షాద్ నగర్, రూరల్ : యాదవులు అపురూపకంగా నిర్వహించుకునే సదర్ ఉత్సవాల వేడుకలను నవంబర్ 2న రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాని కలిసికట్టుగా ఉండి సదర్ వేడుకలను విజయవంతంగా నిర్వహించాలన్న సంకల్పంతో నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరిని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పలుకుతున్నారు. యాదవ సదరు ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం టీయుడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర మఫీషియల్ కన్వీనర్ జి. శ్రీనివాస్, జిల్లా కమిటీ నియోజకవర్గ కమిటీ జర్నలిస్టులను మర్యాదపూర్వకంగా కలిసి సదర్ కార్యక్రమానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరికి పేరుపేరునా ఆహ్వానం పలుకుతున్నామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయు) రంగారెడ్డి జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు చెక్కల శ్రీశైలం, షాద్‌నగర్ నియోజకవర్గం ప్రింట్ మీడియా అధ్యక్షులు బూర్గుల ఫణీంద్ర, ఉపాధ్యక్షులు మల్లికార్జున్ నాయక్. హెచ్ఎంటీవీ శ్రీనివాస్. ప్రచార కార్యదర్శి ఆంధ్రజ్యోతి శేఖర్, రంగారెడ్డి జిల్లా ఈసీ మెంబర్ ఇలియాస్, సంయుక్త కార్యదర్శి అల్వాల దర్శన్ గౌడ్, సమీ, సాబీర్, సదర్ ఉత్సవ కమిటీ సభ్యులు గడ్డం శ్రీనివాస్ యాదవ్, రగనాద్ యాదవ్, మల్లేష్ యాదవ్, బాలరాజు యాదవ్ తదితరులు జర్నలిస్టులను సత్కరించి సదురులో పాల్గొనాలని ఆహ్వానించారు.

సీసీ రోడ్డు పనులను ప్రారంభం

విశాలాంధ్ర, మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 17వ వార్డులోని హై టెన్షన్ రోడ్డు అభివృద్ధికి నోచుకోక గత కొంతకాలంగా వివిధ కాలనీలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి వర్షం వచ్చిన నడవలేని స్థితిలో ఉన్న ఆ రోడ్డు పరిస్థితిని మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ దృష్టికి తీసుకురాగా వెంటనే దానికి కావాల్సిన నిధుల కొరకు హెచ్ఎండిఏ అధికారులను సంప్రదించడం జరిగింది. గురువారం ఉదయం రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో హెచ్ఎండిఏ నిధులతో పూర్తిస్థాయి సిసి రోడ్డును హరిణి మాన్షన్ నుండి వినాయక నగర్ వరకు రోడ్డు వేయడానికి సర్వే పనులు ప్రారంభించడం జరిగినది. లేక్ వ్యూ కాలనీ, విష్ణుపురి కాలనీ, వినాయక నగర్ కాలనీ మరియు అనుబంధ రోడ్డు కాలనీవాసులు సిసి రోడ్డుతో జరిగే అభివృద్ధి మరియు ఇబ్బందులు అన్నీ తొలగినట్టే అని హర్షం వ్యక్తం చేశారు. రోడ్డు అభివృద్ధికి తోడ్పడిన కుర్ర శివకుమార్ గౌడ్‌కి వారి వారి కాలనీల తరఫున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. పీర్జాదిగూడ నగర అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డికి నియోజకవర్గ ఇన్చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్‌కు మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ ప్రత్యేక ప్రకటనలో ధన్యవాదాలు తెలియజేశారు.

ఏసీబీ వలలో ట్రాన్స్‌కో డీఈ

విశాలాంధ్ర బ్యూరో, మెదక్: పౌల్ట్రీ ఫారం వద్ద విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు కోసం లంచం తీసుకుంటు మెదక్ ట్రాన్స్‌కో డిఈ షేక్ చాంద్ షరీఫ్ భాషా ఏసీబీకి పట్టుబడ్డాడు. సదరు వ్యక్తి నుండి రూ.21 వేల నగదు లంచం తీసుకుంటుండగా ఉమ్మడి మెదక్ జిల్లా ఏసీబీ డి.ఎస్.పి సుదర్శన్ తన సిబ్బందితో ట్రాన్స్కో డివిజనల్ కార్యాలయంలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. పాపన్నపేట మండలం సీతానగర్ గ్రామానికి చెందిన పాపగారి భాస్కర్ అనే రైతు రూ.18 లక్షల డీసీసీబీ నుండి రుణం తీసుకుని పౌల్ట్రీ ఫారం ఏర్పాటు చేస్తున్నాడు. ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటుకు పాపన్నపేట ఏఈ, మెదక్ డీఈ చుట్టూ తిరగ్గా రూ.30 వేలు డిమాండ్ చేయడంతో ఏసీబిని అశ్రయించాడు. డిఈ సూచించిన వ్యక్తికి 9 వేల ఫోన్ పే చేశాడు. గురువారం 21 వేల నగదు డీఈ షేక్ చాంద్ షరీఫ్ భాషా తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. మెదక్ తో పాటు ఇతర చోట్ల డిఈ ఇంటి వద్ద సోదాలు నిర్వహించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-నల్లగొండ బ్యూరో : మొంథా తుఫాను ప్రభావం నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రాణ, పశు, ఆస్తి నష్టం జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఆదేశించారు.గురువారం ఆయన హైదరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయం నుంచి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్రంలోని మంత్రులు, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం రాష్ట్రంలోని 16 జిల్లాలపై తుఫాను ప్రభావం చూపనుందని సీఎం వెల్లడించారు. తుఫాను ప్రభావిత జిల్లాల ఇన్‌చార్జ్ మంత్రులు క్షేత్రస్థాయిలో ఉండి ప్రజలకు అందుబాటులో ఉండాలి అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, మరియు సంబంధిత శాఖల జిల్లా అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

విద్యార్థులకు కూటమి ప్రభుత్వం దగా

- అడ్డంకులకు బెదరం.... పోరాటాలు ఆపబోం...
- సంక్షేమ వసతి గృహాలకు నిధులివ్వండి
- ఏలూరు సభలో వలరాజు, నాసర్‌జీ

విశాలాంధ్ర-ఏలూరు: ఎన్నికల వాగ్దానాలు విస్మరించి కూటమి ప్రభుత్వం విద్యార్థులను మోసం చేస్తోందని ఏఐఎస్‌ఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గుజ్జుల వలరాజు,బందెల నాసర్జీ విమర్శించారు. అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) అధ్వర్యంలో విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఈనెల 22 నుండి నవంబర్ 12 వరకు ఇచ్ఛాపురం నుండి హిందూపురం వరకు తలపెట్టిన బస్సు యాత్ర ఏలూరు చేరుకుంది. స్థానిక కాశీ విశ్వేశ్వర కల్యాణ మండపంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు డి.శివకుమార్ అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. ఈ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలరాజు మాట్లాడుతూ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ధర్నాలు, ఆందోళనలు, రాస్తారోకో కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. విద్యారంగంలో జరుగుతున్న మార్పులపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలలో అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులు ఉండాలని డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెలలు గడుస్తున్నా నేటికీ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు జరుగుతున్నాయని విమర్శించారు. మాజీ సీఎం జగన్ ఐదు మెడికల్ కళాశాలల్లో 50 శాతం సీట్లు ప్రైవేటుకు అమ్మితే, కూటమి ప్రభుత్వం 17 వైద్య కళాశాలలను ప్రైవేటుకు ధారాదత్తం చేసిందని విమర్శించారు. పీపీపీ విధానంలో 17 వైద్య కళాశాల నిర్వహణ నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో మౌలిక వసతుల కొరత తీవ్రంగా ఉందని, అనేక విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం, సరైన వసతులు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, గిరిజన విద్యార్థుల అభ్యున్నతికి చొరవ చూపాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.సంక్షేమ హాస్టళ్లలో మౌలిక సదుపాయాల కల్పన కోసం ఏఐఎస్ఎఫ్ అధ్వర్యంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్జీ మాట్లాడుతూ విద్యామంత్రి లోకేశ్ తన యువగళం పాదయాత్రలో ఇచ్చిన అనేక హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యాసంస్థలకు ఫీజు రియింబర్స్‌మెంట్ చెల్లించని కారణంగా యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో చదువు పూర్తయినప్పటికీ ఆయా విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యే పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో ఎన్నో కార్పొరేట్ విద్యాసంస్థలకు అనుమతులు లేవని, తమ దగ్గర ఆధారాలు ఉన్నాయని సవాల్ చేశారు. సంక్షేమ హాస్టళ్లల్లో ఆహారం విష తుల్యమవుతోందని... గిరిజన బిడ్డలను కూటమి ప్రభుత్వం శవాలుగా మారుస్తుందని ధ్వజమెత్తారు. ప్రభుత్వం ఆరోగ్యకరమైన ఆహారం అందించే విధంగా చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ పాఠశాలలకు స్వచ్ఛమైన తాగునీరందించాలని డిమాండ్ చేశారు. గూగుల్‌ను తేవడం కాదు సంక్షేమ హాస్టళ్లకు నిధులు కేటాయించాలన్నారు. భవిష్యత్తులో ఏఐఎస్ఎఫ్ చేసే పోరాటాలలో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సాయికుమార్ మాట్లాడుతూ బస్సు యాత్రకు అనుమతి ఇవ్వకపోవడం అన్యాయం అన్నారు.ఎన్ని అడ్డంకులు ఎదురైనా పోరాటాలలో వెనుకంజ వేసే ప్రసక్తే లేదన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగభూషణం, కోశాధికారి రవికుమార్, ఆంధ్ర యూనివర్సిటీ కార్యదర్శి బాబి తదితరులు ప్రసంగించారు. ఇంకా ఈ సభలో ఏఐఎస్ఎఫ్ ఏలూరు జిల్లా నాయకులు సిద్దు,అనిల్, సునీల్, కృష్ణ, లింగపాలెం మండల నాయకులు సన్నీ, రాజేష్, నాని, చరణ్, హేమంత్, నూజివీడు మండల నాయకులు సంతోష్, గోపి, సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

మొంథా బాధితులను ఆదుకోవాలి: ఈశ్వరయ్య

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మొంథా తుపాను సృష్టించిన బీభత్సం వలన పంటలు నష్టపోయిన రైతాంగాన్ని, తుపాను బాధితులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మొంథా తుపాను రాష్ట్రంలో విలయతాండవం సృష్టించిందన్నారు. మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు, గాలుల తీవ్రత కారణంగా 15 లక్షల ఎకరాల్లో పంటనష్టం జరిగిందని, లక్షలాది ఎకరాల్లో పంటలు నీట మునగడం వల్ల అప్పులు చేసి పంటలు సాగుచేసిన రైతాంగానికి కన్నీరే మిగిలిందని వివరించారు. సుమారు 10 లక్షల ఎకరాల్లో వరిపంటకు నష్టం వాటిల్లినట్లు తెలుస్తోందన్నారు. వరితోపాటు పత్తి, మొక్కజొన్న, మినుము, వేరుశనగ, కొబ్బరి, అరటి, టమోటా, ఉద్యానవన, ఆక్వా పంటలకు తీవ్ర నష్టం కలిగిందని వివరించారు. మొంథా ప్రభావం 40 లక్షలకు పైగా కుటుంబాలపై పడిందని, లక్షలాదిమంది ఉపాధి కోల్పోయారని, పలుచోట్ల ఇళ్లు కూలి నిరాశ్రయులయ్యారన్నారు. రోడ్లు ధ్వంసమయ్యాయని, మత్స్యకారుల వెతలు వర్ణనాతీతమని పేర్కొన్నారు. 304 మండలాలు... 1,825 గ్రామాల్లో 87 వేల హెక్టార్లలో పంట నష్టం జరిగిందని, 59 వేలకు పైగా హెక్టార్లలో వరిపంట నీట మునగగా, పత్తి, మొక్కజొన్న, మినుము పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, భారీ వర్షాలతో 78,796 మంది రైతులు నష్టపోయారని తెలిపారు. ఎకరానికి రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు రైతాంగానికి సహాయం అందించి, ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలన్నారు.

వల్లూరు శివప్రసాద్‌కు 'గిడుగు రామ్మూర్తి' అవార్డు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గిడుగు రామ్మూర్తి పంతులు అవార్డును అరసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సృజనాత్మక, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యనిర్వహణా ధికారి రేగుళ్ల మల్లికార్జునరావు చేతుల మీదుగా గురువారం ఆయన ఈ పుర స్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా వల్లూరు శివప్రసాద్‌కు ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.రాజశేఖర్ అభినందనలు తెలియజేశారు

ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు: వెంకట సుబ్బయ్య

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కార్మిక వర్గానికి, ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు, శ్రామిక, కష్ట జీవులకు ఏఐటీయూసీ 106వ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలను సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య తెలిపారు. ఈమేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాలకులు కార్మిక వర్గానికి నష్టం కలిగించే విధానాలు అవలంబిస్తున్నారని, వీటిని తిప్పికొట్టడానికి ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం ఒక ఉద్యమ కార్యచరణకు ప్రతీకగా నిలవాలని ఆయన పేర్కొన్నారు. 106 ఏళ్లుగా ఎన్నో ఉద్యమాలు, త్యాగాలు, వీరోచిత పోరాటాలను ఏఐటీయూసీ చేసిందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మరో ఉద్యమానికి సన్నద్ధం కావాలని ఏఐటీయూసీ శ్రేణులకు వెంకట సుబ్బయ్య పిలుపునిచ్చారు.

చేనేత కార్మికులను ఆదుకోండి: పిల్లలమర్రి

విశాలాంధ్ర-మంగళగిరి: తుఫాన్ బీభత్సంతో చేనేత మగ్గాలు మునిగిపోయాయని, ప్రభుత్వం తక్షణ సాయంతో చేనేత కార్మికులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరి వేములపల్లి శ్రీకృష్ణ భవన్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలు చేనేత రంగాన్ని తీవ్రంగా దెబ్బతీశాయన్నారు. గుంటూరు, తెనాలి, మంగళగిరి, చీరాల, ప్రకాశం, కడప, నెల్లూరు జిల్లాలలోని చేనేత గ్రామాల్లో నీటి ముంపు కారణంగా వందలాది మగ్గాలు గుంటల్లో మునిగిపోయి పనికిరాకుండా పోయాయన్నారు. దాంతో వేలాది మంది చేనేత కార్మికులు పనులు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారన్నారు. కొన్నిచోట్ల మగ్గాలు చెడిపోవడంతో కార్మికులు తమ వృత్తిని కొనసాగించలేని పరిస్థితి నెలకొందన్నారు. కూలిన ఇళ్లల్లోనే ఉంటూ జీవనాధారం కోల్పోయి వారి బతుకే ప్రశ్నార్థకమైందన్నారు. ప్రతి చేనేత కుటుంబానికి రూ.25 వేలు నష్టపరిహారం, నెలకు సరిపడ బియ్యం, కందిపప్పు, చింతపండు తదితర నిత్యావసర సరుకులు అందించాలని డిమాండ్ చేశారు. ఆ రంగంపై ఆధారపడిన కుటుంబాలు బతుకుదెరువు కోసం ప్రభుత్వ సహాయంపైనే ఆధారపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టపరిహారం అందించకపోతే, రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. గుంటూరు జిల్లా అధ్యక్షుడు గజవల్లి వెంకటకృష్ణారావు, మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షుడు బత్తుల గిరి, కార్యదర్శి దొడ్డి ఈశ్వరరావు, ఉపాధ్యక్షుడు గంజి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇంధన రంగంలో 'మెగా' మరో అడుగు

అబుదాబి సంస్థ నుంచి వంద శాతం వాటా కొనుగోలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: తమిళనాడులో నైవేలి వద్ద 250 మెగావాట్ల లిగ్నైట్ ఆధారిత విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) కొనుగోలు చేసింది. అబుదాబి కేంద్రంగా ఉన్న సంస్థ నుంచి వందశాతం వాటాను కొనుగోలు చేసినట్లు ఎంఈఐఎల్ ప్రకటించింది. ఈ విద్యుత్ కేంద్రానికి ఆ రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థతో దీర్ఘకాలిక విద్యుత్ కొనుగోలు ఒప్పందం ఉంది. రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా నిరంతర, నమ్మదగిన విద్యుత్ సరఫరా అందించడంలో ఈ యూనిట్ స్థిరమైన పనితీరు రికార్డును ఇప్పటికే నెలకొల్పింది. ప్రస్తుతం ఇంధన రంగంలో 5.2 గిగావాట్లకు పైగా విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని ఎంఈఐఎల్ కలిగి ఉంది. తమిళనాడు ప్లాంట్ కొనుగోలు ద్వారా ఈ రంగంలో తన స్థానాన్ని సంస్థ మరింత బలపరచుకుంటోంది. అలాగే, దేశంలో విద్యుత్ అవసరాలు తీర్చడంతో పాటు స్థిరమైన, భారీస్థాయిలో పనిచేసే ఉత్పత్తి ఆస్తుల పోర్ట్‌ఫోలియోను నిర్మించే లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్తోంది. టీఏక్యూఏ నైవేలీని తన ప్రస్తుత విద్యుత్ ఉత్పత్తి ఆపరేషన్లలో సులభంగా సమన్వయం చేయడాన్ని ఎంఈఐఎల్ ఎనర్జీ ప్రాధాన్యంగా తీసుకుంటోంది. దీని ద్వారా ఆపరేషనల్ ఎక్సలెన్స్, సమర్థవంతమైన ఆస్తి నిర్వహణ తదితరాలకు సంస్థ కట్టుబడింది. ఈ సందర్భంగా ఎంఈఐఎల్ గ్రూప్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ సలిల్ కుమార్ మిశ్రా మాట్లాడుతూ ఉన్నత నాణ్యత గల విద్యుత్ ఉత్పత్తి ఆస్తులను స్వాధీనం చేసుకోవడంలో ఇది ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. థర్మల్, హైడ్రో, పునరుత్పాదక శక్తి రంగాలను సమన్వయం చేసే సమతులిత, స్థిరమైన విద్యుత్ ఉత్పత్తి పోర్ట్‌ఫోలియో నిర్మాణానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు.

సీఆర్ ఫౌండేషన్‌కు పాండా, ఈశ్వరయ్య

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి: సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ పాండా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య గురువారం చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్‌ను సందర్శించారు. ఫౌండేషన్‌లో ఉన్న భారత కమ్యూనిస్టు పార్టీ వృద్ధ నాయకులు చెన్నమనేని వెంకటేశ్వరరావు, ఐదుకల్లు అరుణకుమారి, ఐఎస్ రాజు- ఝాన్సీ దంపతులను, సీనియర్ పాత్రికేయుడు ఏబీకే ప్రసాద్ తదితరులను పరామర్శించారు. రామకృష్ణ పాండా, గుజ్జుల ఈశ్వరయ్యను సీఆర్ ఫౌండేషన్ కోశాధికారి, వృద్ధాశ్రమ డైరెక్టర్ వి.చెన్నకేశవరావు సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, కనపర్తి జ్యోస్నా రాఘవాచారి, సీఆర్ పాలీ క్లినిక్ డైరెక్టర్ డాక్టర్ కూనంనేని రజిని, మహిళా సంక్షేమ కేంద్ర సభ్యురాలు వి.లలిత, వృద్ధాశ్రమం సలహాకమిటీ సభ్యులు తమ్మారెడ్డి తానియా, ఎన్.రాజేంద్రరావు, వెలుపోలు సాంబశివరావు, హోం మేనేజర్ శ్రీనివాస్, వృద్ధాశ్రమవాసులు పాల్గొన్నారు.

మార్గదర్శి కేసు మీరే వాదించండి

ఉండవల్లికి సుప్రీంకోర్టు సూచన

న్యూదిల్లీ: మార్గదర్శి కేసుపై గురువారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఆర్బీఐ నిబంధనలను మార్గదర్శి కంపెనీ ఉల్లంఘించిన అంశంపై తెలంగాణ హైకోర్టులో వాదనలు వినిపించాలని మాజీ ఎంపీ, న్యాయవాది ఉండవల్లి అరుణ్‌కుమార్‌కు సుప్రీంకోర్టు సూచించింది. మార్గదర్శి ఫైనాన్షియర్స్ కుంభకోణంపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఆ కేసుకు సంబంధించి జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ అలోక్ ఆరాధే ధర్మాసనం వాదనలు విన్నది. వర్చువల్‌గా విచారణకు హాజరైన ఉండవల్లి ఇది డిపాజిట్ల సేకరణ, చెల్లింపులకు సంబంధించిన సమస్య మాత్రమే కాదని, మార్గదర్శి ఆర్బీఐ నిబంధనలు ఉల్లంఘించిందని, దీనిపై విచారణ జరగాలని కోరారు. అయితే... ఈ అంశాలన్నీ హైకోర్టు ముందున్న ప్రధాన పిటిషన్ విచారణ సందర్భంగా వినిపించాలని ఆయనకు ధర్మాసనం సూచించింది. ప్రస్తుతం తాము కేసు మెరిట్‌లోకి వెళ్లడం లేదని, హైకోర్టు స్టే ఇవ్వనన్న అంశంపై మాత్రమే విచారణ చేస్తున్నామని స్పష్టం చేసింది. ఈ కేసులో ఉండవల్లి ప్రతివాది కాదని ఏపీ ప్రభుత్వ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపైనా తాము ఎలాంటి వ్యాఖ్యానం చేయదలచుకోలేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. మరోవైపు... మార్గదర్శి తరఫు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదిస్తూ తాము చెల్లించాల్సిన 2,300 కోట్ల రూపాయల డిపాజిట్లలో సింహభాగం చెల్లించామని, ఎస్క్రో ఖాతాలో 5.43 కోట్ల రూపాయలు ఉన్నాయని, డిపాజిట్ల మెచ్యూరిటీ ఆధారంగా వాటిని చెల్లించాలని కోరారు.

రైతుకు భరోసా కరువు: జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కూటమి ప్రభుత్వం అన్ని రకాలుగా రైతులకు భరోసా లేకుండా చేసిందని, ఇది చంద్రబాబు సృష్టించిన మరో విపత్తు అని మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. మొంథా తుపానుపై వైసీపీ ప్రాంతీయ సమన్వయకర్తలు, జిల్లా పార్టీ అధ్యక్షులతో గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి జగన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జగన్ మాట్లాడుతూ తుపాన్ సమయంలో పార్టీ శ్రేణులు ప్రజలకు అండగా నిలబడటాన్ని ప్రశంసించారు. పంట నష్టం అంచనాల్లో ఒక్క రైతుకు అన్యాయం జరగకుండా చూడాలని నిర్దేశించారు. పంట నష్టం అంచనాల్లో ప్రభుత్వం ఏ తప్పిదానికి ప్రయత్నించినా... గట్టిగా ప్రశ్నించాలని, ఆ తప్పిదాన్ని సవరించుకునేలా చొరవ చూపాలని ఆయన ఆదేశించారు. బాధితులకు ప్రభుత్వం నుంచి తగిన సహాయం అందేలా ఒత్తిడి తీసుకురావడంపై జగన్ దిశానిర్దేశం చేశారు. మొంథా తుపాన్ వచ్చినప్పటి నుంచి ప్రజలతో మమేకమవుతూ మీమీ ప్రాంతాల్లో సమన్వయకర్తలు చురుగ్గా పాలు పంచుకున్నారని అభినందనలు తెలిపారు. శ్రీకాకుళం నుంచి నెల్లూరు, అక్కణ్నుంచి రాయలసీమలో కర్నూలు, కడప, అన్నమయ్య, ఉమ్మడి చిత్తూరు జిల్లాల్లోనూ మొంథా తుపాన్ ప్రభావం చూపిందని, 25 జిల్లాలు, 396 మండలాలు, 3320 గ్రామాల పరిధిలో తుపాన్ ప్రభావం కనిపించిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు తోడుగా నిలబడాల్సి ఉందన్నారు. దాదాపు 15 లక్షల ఎకరాల్లో పంటలపై మొంథా తుపాన్ ప్రభావం చూపిందని, దాంట్లో 11 లక్షల ఎకరాల్లో వరి పంట ఉందని, 1.14 లక్షల ఎకరాల్లో పత్తి, 1.15 లక్షల ఎకరాల్లో వేరుశనగ, 2 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, మరో 1.9 లక్షల ఎకరాల ఉద్యాన పంటలపై మొంథా తుపాన్ ప్రభావం చూపిందని వివరించారు. వైసీపీ హయాంలో ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు ఈ-క్రాప్ వ్యవస్థ పక్కాగా ఉండేదని, ఆర్బీకేలు సమర్థమంతంగా పని చేసేవని గుర్తుచేశారు. ఈ ప్రభుత్వ హయాంలో రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ జీరో అని తెలిపారు. అన్ని రకాలుగా రైతుల కష్టాలకు చంద్రబాబే బాధ్యుడని మండిపడ్డారు.

వచ్చే నెల ఈ-క్రాప్ నమోదు పూర్తి చేస్తాం

రైతుల సంక్షేమంపై మాట్లాడే హక్కు జగన్‌కు లేదు: అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర - సచివాలయం: రాష్ట్రంలో 95 శాతం ఈ క్రాప్ నమోదైందని, నవంబర్ 12 వ తేదీ లోపు మిగిలిన ఐదు శాతాన్ని పూర్తి చేస్తామని వ్యవసాయ, సహకార, ఉద్యాన, మార్కెటింగ్ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మళ్లీ అబద్ధాల తుపాను సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. రైతు ఉత్పత్తికి విలువ, శ్రమకు గౌరవం కల్పించడాన్ని బాధ్యతగా భావిస్తున్నామని అచ్చెన్నాయుడు వెల్లడించారు. మొంథా తుపాల వల్ల జరిగిన పంటల నష్టంపై మాట్లాడే ముందు తన పాలనలో రైతులకు జరిగిన అన్యాయాలను జగన్ గుర్తు చేసుకోవాలన్నారు. రైతు సంక్షేమం గురించి మాట్లాడే హక్కు జగన్‌కు లేదని అన్నారు. కూటమి ప్రభుత్వం తుపాను ప్రభావిత ప్రాంతాల్లో అంచనా పనులు జరిపి, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీలు, తక్షణ సహాయ చర్యలు, బీమా పరిహారాలు అందజేస్తోందని అచ్చెన్నాయుడు తెలిపారు. కనీస మద్దతు ధర కంటే తక్కువ ధరకు అమ్ముడవుతున్న పంటలకు వెంటనే మార్కెట్ జోక్యాన్ని అందించేందుకు ప్రభుత్వం 2025-26 సంవత్సరానికి రూ.300 కోట్లను బడ్జెట్‌లో మంజూరు చేసిందని జగన్ గుర్తుపెట్టుకోవాలన్నారు. ఇప్పటివరకు రూ.800 కోట్ల వరకు మద్దతు ధరల కోసం ఖర్చు పెట్టామని, 2020లో మిర్చీ ధర రూ.12వేలు ఉంటే, మద్దతు ధరగా రూ.7వేలు మాత్రమే వైసీపీ ప్రభుత్వం నిర్ణయించింది కానీ రూపాయి కూడా చెల్లించలేదని విమర్శించారు. బర్లీ పొగాకు ధరలు పడిపోయినప్పుడు అదనంగా వచ్చిన పంట కూడా మేమే కొనుగోలు చేశామన్నారు. కోకో ధరలు తగ్గడంతో కిలోకు రూ.50 చొప్పున చెల్లించామని, తోతాపూరి మామిడి ధరలు తగ్గినప్పుడు 260 కోట్లు వెచ్చించి ప్రతి కిలోకు అదనంగా రూ.4 లెక్కన ఇచ్చామని జగన్ గుర్తు పెట్టుకోవాలని అన్నారు.

స్నేహితురాలి ఇంట్లో మహిళా డీఎస్పీ చోరీ

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని భోపాల్ జహంగిరాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ మహిళా పోలీసు అధికారి దొంగతనానికి పాల్పడింది. తన స్నేహితురాలి ఇంట్లోనే ఆమె నగదు ఎత్తుకెళ్లింది. వివరాల్లోకి వెళ్తే... పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో కల్పనా రఘువంశీ డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే స్నేహితురాలి ఇంటికి వెళ్లి అక్కడ నుంచి రూ.రెండు లక్షల నగదు, మొబైల్ ఫోన్ ఎత్తుకెళ్లింది. డీఎస్పీ కల్పనపై ఆమె స్నేహితురాలు ఫిర్యాదు చేసింది. మొబైల్ ఫోన్ ఛార్జింగ్ పెట్టి స్నానానికి వెళ్లిన సమయంలో దొంగతనం జరిగినట్లు ఆమె చెప్పింది. స్నానం చేసేందుకు బాత్రూంకు వెళ్లిన సమయంలో డీఎస్పీ కల్పన వచ్చి నగదు, సెల్‌ఫోన్ తీసుకెళ్లిందన్నారు. నగదు, ఫోన్ మిస్ కావడంతో... సీసీటీవీ ఫుటేజ్ పరిశీలిస్తే ఆ సమయంలో డీఎస్పీ కల్పన వచ్చి వెళ్లినట్లు కనిపించిందని, చేతుల్లో కరెన్సీ కట్టలు ఉన్న దృశ్యాలు కనిపించాయని పేర్కొంది. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా రఘువంశీపై చోరీ కేసు పెట్టారు. నిందితురాలైన మహిళా పోలీసు అధికారి ప్రస్తుతం పరారీలో ఉంది. పోలీసు బృందాలు ఆమె కోసం గాలిస్తున్నాయి. మొబైల్ ఫోన్ రికవరీ చేసినట్లు ఏఎస్పీ బిట్టు శర్మ తెలిపారు. అయితే నగదు మాత్రం ఆచూకీ లేదు. నిందితురాలైన ఆమెకు పోలీసు హెడ్‌క్వార్టర్స్ నోటీసులు జార చేసింది. క్రమశిక్షణా చర్యలు తీసుకోనుంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.